ఆదివారం అనుబంధం గోడ వెనుక మరో కథనం సినీ వార్తలపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కర్నూలు

: fb.com/vaartha Digital

Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 155 పేజీలు: 10+4 వెల: 8.00

ఒకే వేదికపైకి ఠాకరే బ్రదర్స్

యుపిలో ఘోర ప్రమాదం: 8మంది దుర్మరణం

5లో

# 15న జీడిపల్లికి హంద్రీనీవా నీరు



శనివారం జలవనరులశాఖపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

## ఫేజ్-2 పూర్తి చేసి 31కి పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్‌కు కృష్ణాజలాలు

## పోలవరం ఎడమకాల్వ నెలాఖరుకు పూర్తి

## వచ్చే జూన్‌కు వెలిగొండను పూర్తి చేయాలి

## ప్రాధాన్యతక్రమంలో ప్రాజెక్టులు పూర్తి

## జలవనరుల సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం ప్రభుత్వం రాయలసీమకు సాగునీరు ఇచ్చేందుకు ఏడాది కాలంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పను లకు ప్రభుత్వం రూ.3,890కోట్లు మంజూరు చేసి పనులు మొదలు పెట్టింది. ఈ పనులపై సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పురోగతిని తెలుసుకుంటున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి ఫేజ్1 పనులు పూర్తి చేసి జీడిపల్లి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం మేరకు 3,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నారు. దీని కోసం రెండు మూడు రోజుల ముందు పనులు పూర్తిచేసి జూలై 15వ తేదీన నీటిని విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. జీడిపల్లి నుంచి గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లను ఈ నీటితో నింపాలని చెప్పారు. అలాగే ఫేజ్2 కాలువ ద్వారా పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు జూలై 31న నీటిని విడుదల చేయాలని సూచించారు. కాలువల విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేయడం ద్వారా తొలిసారి సీమలోని వివిధ ప్రాంతాలకు సాగునీరు అందనుంది. జూలై 15న జీడిపల్లి రిజర్వా యర్‌కు నీటి విడుదల చేసి అక్కడ నుంచి 15 రోజుల పాటు పెన్నా ఆహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించనున్నారు. హంద్రీనీవా కాలువల ద్వారా విడుదలయ్యే 3,850 క్యూసెక్కుల నీటిని వినియోగించి రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులను నింపాలని సీఎం అధికారులను ఆదేశించారు. శనివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జలవనరుల శాఖపై సమీక్ష చేశారు. హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం ఎడమకాలువ పనులు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు,రిజర్వాయర్లలో నీటి మట్టాలు, నీటి నిర్వహణకు చేపడుతున్న చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు.

**అత్యుత్తమ నీటి నిర్వహణతో ప్రతి చుక్కా సద్వినియోగం:** రాష్ట్రంలో అత్యుత్తమ స్థాయిలో నీటి నిర్వహణ చేసి ప్రతి నీటిచుక్కను సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దీని కోసం పూర్తి స్థాయి ప్రణాళికతో ప్రభుత్వ శాఖలు, అధికారులు పని చేయాలని సూచించారు. ముఖ్యంగా భూగర్భ జలాల పెంపుపై మరింత శ్రద్ధతీసుకోవాలని, ఈ అంశంలో ఇరిగేషన్ శాఖతోపాటు పంచాయతీ రాజ్ శాఖను కూడా భాగస్వామిని చేయాలని సీఎం అన్నారు.

**ఆశాజనకంగా నీటి ప్రవాహాలు:** అధికారులు రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి లభ్యత, ప్రవాహాలపై సీఎంకు వివరించారు. ఒక్క కడపజిల్లా మినహా అన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతమే ఉందని రానున్న రోజుల్లో వర్షాలు ఆశాజనకంగా >>2




## కొత్తగా రెండు లక్షల కుటుంబాలకు 'కార్డు'లు

### ఎటిఎం తరహా రేషన్ కార్డులు ఆగస్టు నుంచి పంపిణీ

**విజయవాడ.జూలై5.ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కొత్తగా రెండు లక్షల లక్షల కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది.

దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించారు.దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు.పౌరసరఫరాలశాఖ అధికారుల సమాచారాన్ని అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,09,787మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది. ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు

**సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు: వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు:** అంతేకాకుండా రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత ప్రభుత్వం హయంలో రేషన్ కార్డులపై అధికారంలో ఉన్ననేతల ఫొటోలు ఉండేవి. ఇప్పుడు వాటికి >>2



## కేంద్ర ఉద్యోగులకు 4% డిఏ పెంపు

**న్యూఢిల్లీ, జూలై 5:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు శాతం డిఏ పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులకు ప్రతి ఏటా రెండుపర్యాయాలు డిఎలను పెంచుతుంది. ద్రవ్యోల్బణ తీరుతెన్నులు ఆధారంగా ఏడో వేతన కమిషన్ సిఫారసులను అనుసరించి ఈ డిఏ పెంపు ఉంటుంది. జూలై నెలనుంచే ఈ డిఏ ఉద్యోగుల జీతాలకు తోడవుతుంది. అయితే తుది ప్రకటన వెలువడాల్సి ఉంది. పారిశ్రామిక కార్మికులకు అన్వయించే అఖిలభారత వినియోగరంగ ధరల సూచీ మేనెలలో 0.5 పాయింట్లు పెరిగి 144కిచేరింది. మూడునెలలుగా సూచీ పెరుగుతూనే ఉంది. మార్చిలో 143, ఏప్రిల్‌లో 143.5, మేనెలలో 144 పాయింట్లుగా నమోదయింది. జూన్‌లో అయితే ఏకంగా 144.5పాయింట్లకు చేరింది. 12 నెలల సగటు కూడా 144.17 పాయింట్లుగా ఉంది. ఏడో వేతన కమిషన్ నిబంధనను అనుసరించి డిఏ రేటు >>2

## పేదలకు ఏకకాలంలో 3లక్షల ఇళ్లు

### శ్రావణమాసంలో గృహ ప్రవేశాలు: ప్రభుత్వం నిర్ణయం

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం 3లక్షల ఇళ్ళను ఏకకాలంలో పేదలకు ఇవ్వాలని నిర్ణయించింది. గృహా లబ్దిదారులతో వచ్చే శ్రావణ మాసంలో పేదలతో గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. గృహనిర్మాణశాఖ ఈ విషయాన్ని వెల్లడించింది.అప్పటిలోగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, పేదల ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఇసుకను ఉచితంగా అందుబాటులో ఉంచింది. లేఅవుట్లలో సమస్యలను కూడా పరిష్కరించింది. గత 13 నెలల్లో 2.30లక్షల గృహనిర్మాణాలు పూర్తయ్యాయి. రూఫ్ స్థాయిలో 87,000 ఇళ్లు ఉన్నాయి. లింటెల్ స్థాయిలో 1.2లక్షల ఇళ్లు ఉండగా, బేస్‌మెంట్ స్థాయిలో 50,000 ఇళ్లు ఉన్నాయి. మిగతా వాటికి పునాదులు కూడా వేయలేదు. వాటిని కూడా పూర్తి చేయించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇక ఈ ఇళ్ళను న్నికల హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వంకీలక అడుగు వేసింది.అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున భూమిని అందించే అంశంపై ఇప్పటికే ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అందరికీ ఇళ్లు అనే ప్రాతిపదికన కేటాయించిన ప్లాట్లకు రాష్ట్ర ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ జారీ చేస్తుందని ఉత్తర్వులో వెల్లడించారు. ఈ కన్వేయన్స్ డీడ్ 10 సంవత్సరాల వ్యవధితో ఫ్రీ హోల్డ్ హక్కులను అందిస్తుందని స్పష్టం చేశారు.జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే ఉచిత ఇళ్ల పట్టా ఇచ్చేలా విధివిధానాలను రూపొందించారు.ఇంటి పట్టా ఇచ్చిన రెండు సంవత్సరాలలోగా గృహ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దారిద్ర్య రేఖ(తీశిలి) దిగువన ఉన్నకుటుంబాలకు మాత్రమే ఉచిత ఇంటి స్థలం కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు. అందరికీ ఇళ్లుకార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చే అంశంపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసారు. అందరికి ఇళ్లు ప్రాతిపదికన కేటాయించిన స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ ఇస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడిం చారు. 10 ఏళ్ల కాలపరిమితితో >>2

# వేగంగా రాజధాని నిర్మాణం

### అమరావతి విమానాశ్రయానికి దాదాపు 12వేల ఎకరాల భూసేకరణ

### సిబిఐ, బ్యాడ్మింటన్ అకాడెమీ, కిమ్స్ సహా 16 సంస్థలకు 65 ఎకరాలు కేటాయింపు

### పొట్టి శ్రీరాములు, అల్లూరి స్మారక చిహ్నాల ఏర్పాటుకు సిఆర్‌డిఏ ఆమోదం

### ప్రతి నిర్ణయం క్షేత్ర స్థాయిలో అమలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి అభివృద్ధిలో తీసుకునే ప్రతి నిర్ణయం క్షేత్ర స్థాయిలో అమలులోకి తీసుకుని వస్తాం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాజధానికి విశేషంగా పెట్టుబడులను ఆకర్షించే దిశలో సీఆర్డీఏ పరిధిలో కార్యచరణ ఉండాలన్నారు.శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆయన నివాసంలో సీఆర్డీఏ అథారిటీ సమావేశంజరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై కీలకంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ రాష్ట్ర రాజధాని అమరావతికి పరిశ్రమలు రావాలంటే అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వచ్చారు.సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో స్ఫూర్తినిచ్చేవారి స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అమరజీవి పొట్టి శ్రీరాములు అని, గతంలో రాష్ట్ర సచివాలయం వేగంగా రికార్డు సమయంలో నిర్మించామని, అదే స్ఫూర్తితో పనులు పూర్తి చేయాలని అన్నారు. అమరావతిలో ఎయిర్ పోర్టు నిర్మాణం విషయంలో కేంద్రంతో సంప్రదింపులు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాజధానిలో నిర్మించతలపెట్టిన ఏ ప్రాజెక్టూ ఆలస్యం కాకుండా చూడాలన్నారు. కొత్తగా వచ్చే ప్రాజెక్టులకు అనుమతులను వేగవంతంగా ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. నిర్మాణ పనులు సరిగ్గా చేయని సంస్థలకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని, గడువులోగా



శనివారం సీఆర్డీఏ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులకు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల్లో నిర్మించే ఎకో పార్కులకూ మంచి పేర్లను పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొత్త ప్రాజెక్టుల కోసం అధికారులు ఎలాంటి బేషజాలు లేకుండా ప్రయత్నాలు చేయాలని సూచించారు. అమరావతి రాజధాని రాష్ట్ర ప్రజల సెంటిమెంట్ పూర్తి చేసేలా నిర్దేశించాలని ముఖ్యంత్రి చంద్రబాబు అన్నారు. మొత్తం ఏడు అంశాలకు సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. రాజధాని పరిధిలోని అమరావతి మండలంలో 4, తుళ్లూరు మండలంలో 3 గ్రామాల్లో అదనంగా 20,494 ఎకరాల మేర భూసమీకరణకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం. >>2

### ఆదిత్య ఫార్మసి ఎండి నరసింహమూర్తి రాజు

## ఆత్మహత్య



**విజయవాడ. జూలై5, ప్రభాతవార్తప్రతినిధి:** ఆదిత్య ఫార్మసి ఎండి నరసింహమూర్తిరాజు ఆత్మహత్య చేసుకున్నారు. విజయవాడ అయోధ్యనగర్ క్షత్రియభవన్‌లో ఆయన బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. గతేడాది స్నేహితుడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న నరసింహమూర్తిరాజు ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. నరసింహమూర్తి రాజు గత రాత్రి హైదరాబాద్ నుండి విజయవాడకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన అనూహ్యంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. రూ.కోట్ల అప్పుల్లో తాను ఉన్నట్లు >>2



కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయం ఉద్యోగులు

## బదలీలపై సచివాలయ ఉద్యోగుల నిరసన

**విజయవాడ కార్పొరేషన్,జులై 5,ప్రభాతవార్త:** విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు శనివారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగుల బదిలీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తమను కూడ ఉపాధ్యాయుల మాదిరిగా కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేయాలని వారు నినాదాలు చేశారు. కౌన్సిలింగ్ నిర్వహించకుండా ఇష్టమొచ్చిన రీతిన బదిలీలు చేశారంటూ విమర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు భిన్నంగా బదిలీలు చేశారని ఆరోపించారు.ఈబదిలీల్లో ఉద్యోగానికి >>2

# త్వరలోనే ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ



### బియ్యం చోరీ చేసిన వారితో ప్రెస్‌మీట్లు పెట్టిస్తున్న జగన్

### టిడిపి నేతలపై అక్రమకేసులు బనాయించిన వైఎస్సార్సీ పాలకులు

### ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై 5:** అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు రాష్ట్రంలో అసత్యపు ఆరోపణలు చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రంగా విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంద, అరాచకాలు, విధ్వంసాలు, కక్ష సాధింపులతోప్రజలను పీడించుకు తిన్నారన్నారు. గుంటూరు జిల్లాలో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున దాడులు చేయించి, టీడీపీ నాయకులపై అక్రమకేసులు పెట్టించారని, దీనివల్ల అనేక మంది గ్రామాలు వదిలి వెళ్లిన సందర్భాలు ఉన్నాయన్నారు. గతంలో టీడీపీ నాయకులపైన అచ్చెన్నాయుడు దగ్గర నుంచి నామీద, మా నాయకుడు చంద్రబాబుని కూడా కక్ష సాధింపుతో జైలుకు పంపించింది వాస్తవం కాదా? పచ్చని పల్లెల్లో నెత్తుటి మరకలు చేసింది వైసీపీయేనని, జగన్ ఫ్యాక్షన్ సంస్కృతితో గ్రామాల్లో కత్తులు తిప్పి అరాచకాలు చేసింది వైసీపీ నాయకులే. నాగమల్లేశ్వరరావు అనే వైసీపీ నాయకుడు సర్పంచ్‌గా ఉన్నప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడి,గ్రామాల్లో వ్యక్తిగత దాడులకు దిగి అక్రమ కేసులు పెట్టారని, బాబూరావుపై దాడి చేస్తే దాదాపు నెల రోజులు ఆసుపత్రిలో ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఊరు వదిలి వెళ్లిపోయిన వారు, ఇప్పుడు మళ్లీ వచ్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వ్యక్తిగత కక్షలకు పార్టీ రంగులు పులుముతున్నారని అన్నారు.

విజయవాడలో చెన్నుపాటి గాంధీ కన్ను పొగొట్టింది వైసీపీ ప్రభుత్వమే అని, దళిత సీఐ ఆనందరావును బ్లాక్ మెయిల్ చేసి బెదిరించడంతో అతను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. వైసీపీ నాయకుడు పెద్దారెడ్డి చెప్పిన పనులు చేయలేదని గుర్రయ్య అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని, అలాగే పేదవాడైన అమంర్‌నాథ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టింది వైసీపీ ప్రభుత్వమే. నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య వంటి దాదాపు 80మంది తెలుగుదేశం నాయకులను పెట్టనపెట్టుకుంది వైసీపీ దుర్మార్గమైన ప్రభుత్వమే అన్నారు.

జగన్మోహన్ రెడ్డి ఇంటి సమీపంలో ఒక దళిత బిడ్డపై అత్యాచారం జరిగినా పట్టించుకోలేదని, దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చంపి డోర్ డెలివరీ చేస్తే అతన్ని తీసుకొచ్చి ఊరేగించారని, పోలీస్ స్టేషన్లలో కేకులు కట్ చేయించారని పేర్కొన్నారు. ఒక మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్ ను హింసించి, వేధించి అతని ప్రాణాలు పోవడానికి కారణం వైసీపీయే అన్నారు. ఇసుక దందాను ప్రశ్నిస్తే దాడులు చేసి శిరోముండనం చేసింది కూడా వైసీపీనే కదా. మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరిపింది వైసీపీయేనని, పులివెందులలో అత్యాచారం చేసి హత్య చేస్తే, పరామర్శకు అనిత వెళ్తే ఆమె పై >>2



### వికసిత్ భారత్‌లో

## స్వర్ణాంధ్ర కీలకం

### జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు

### శూన్యపేదరికం నుంచి డీప్‌టెక్ వరకు పదిసూత్రాలకు ప్రాధాన్యం: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్రకు కీలకభాగస్వామ్యం లక్ష్యంగా అందుబాటులో ఉన్న వనరులు, బలాలు, సవాళ్ల ఆధారంగా ముందుకు అడుగులు వేద్దామని ఆరోగ్యశాఖ,ఎన్టీఆర్‌జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, జిల్లా దార్శనిక ప్రణాళిక యూనిట్ ఛైర్మన్ సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా, నియోజకవర్గాల దార్శనిక కార్యాచరణ ప్రణాళికల ముసాయిదాలను తయారు చేశామ తెలిపారు. 2047 నాటికి రూ. 18.23 లక్షలకోట్ల జీడీడీపీని గమ్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. శనివారం ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జిల్లా, నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా ప్రణాళికపై కలెక్టర్ లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రణాళికలను ఆయా నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశమున్న అంశాలు, కీలక ప్రగతి సూచికలు, పర్యాటక రంగ అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు), వ్యవసాయ యాంత్రీకరణ తదితరాలపై చర్చించి, ప్రణాళికల్లో చేర్చాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సగటున 18.5 శాతం వార్షిక వృద్ధి సాధనకు కార్యాచరణపై సూచనలు చేశారు.

అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ సుపరిపాలనలో కీలక అధ్యాయం పీ4 అని స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికల రూపకల్పన జరిగిందని వీటిని సరైన కార్యాచరణతో అమలుచేసేందుకు ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023-24లో జిల్లా తలసరి ఆదాయం రూ. 3,21,651 కాగా దీన్ని 2028-29 నాటికి రూ.6,38,946కు, 2047-48 నాటికి రూ. 62,88,851కు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. నియోజకవర్గాల స్థూల ఉత్పత్తి, విలువ జోడింపులను పెంచడం ద్వారా జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని ఇది స్వర్ణాంధ్రకు దోహదపడుతుందన్న ఉద్దేశంతో ఎక్కడాలేని విధంగా నియోజకవ >>2



## సింహాచలం గిరిప్రదక్షిణలో తప్పిన పెను ప్రమాదం

### కూలిన రేకుల షెడ్డు..పరుగులు తీసిన భక్తులు

**సింహాచలం, ప్రభాతవార్త జులై 5:** సింహాద్రి అప్పన్న భక్తులకు పెను ప్రమాదం తప్పింది. తొలిపావాంచా వద్ద గిరి ప్రధక్షణకు వేసిన రేకుల షెడ్డు కూలివడంతో అక్కడ దగ్గరలో ఉన్న భక్తులు, షెడ్డు నిర్మిస్తున్న కార్మికులు పరుగులు తీశారు. ఫోల్స్ >>2



దలైలామా 90వ పుట్టిన రోజు సందర్భంగా శనివారం హిమాచల్‌లోని కాంగ్రా జిల్లాలో ఆయన్ని కలుసుకున్న బౌద్ధ సన్యాసులు

# వేగంగా రాజధాని నిర్మాణం

>> రాజధానిలో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్ సహా మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్ ఎఫ్ పీ పిలిచేందుకు ఆమోదం తెలిపిన అథారిటీ మందడం, రాయ పూడి, పిచుకలపాలెంలోని ఫైనాన్స్, స్పోర్ట్ సిటీల్లో దాదాపు 58 ఎకరాల్లో హైడెన్సిటీ రెసిడె న్షియల్ జోన్, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్ ఎఫ్ పీ పిలిచేందుకు ఆమోదం అమరావతిలో నిర్మించే ఫైవ్ స్టార్ హోటళ్ల సమీపంలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం సీఆర్డీఏ ప్రతిపాదనకు అథారిటీ ఆమోదం మం దడం, తుళ్లూరు, లింగాయపాలెంలో 2.5 ఎకరాల చొప్పున నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి క్యూబీఎస్ ప్రాతిపదికన అమోదం అమరావతి లో జరుగుతున్న నిర్మాణ పనులకు ఇసుక డ్రెడ్జింగ్ కోసం సీఆర్డీఏకు అనుమతి ప్రకాశం బ్యారేజి ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుక తవ్వకునేందుకు అనుమతి ఇచ్చిన సీఆర్డీఏ అథారిటీ వచ్చే రెండేళ్లలో రాజధాని నిర్మాణానికి 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అంచనాభూముల కేటాయింపులపై కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం సీబీఐ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీ, ఎంఎస్కె ప్రసాద్ క్రికెట్ అకాడెమీ, కిమ్స్ సహా 16 సంస్థలకు 65 ఎకరాల మేర భూ కేటాయింపులకు ఆమోదంరాజధానిలోని ఈ- 15 రహదారిపై 6 లేన్ల ఆర్వోబీ నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదం. పొట్టి శ్రీరాములు , అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాల ఏర్పాటు స్థలం కేటాయించేందుకూ అథారిటీ ఆమోదం తెలిపింది.ఇక ఇప్పటికే రాజధాని అమరావతి నిర్మాణంలో మలివిడత భూ సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. మలివిడత పూలింగును రెండు దశల్లో చేపట్టాలని నిర్ణయించారు. తొలిదశలో 32 వేల ఎకరాలు, రెండోదశలో అచ్చంగా విమానాశ్రయ అభివృద్ధి కోసం పదివేల నుండి 12 వేల ఎకరాలు మొత్తంగా 44 వేల ఎకరాల వరకూ సమీకరించనున్నట్లు తెలిసింది. అమరావతి వినామాశ్రయానికి భూములిచ్చే రైతులకు ఒకేచోట భూములు ఇస్తామని ప్రత్యేక నిబంధన చేర్చారు. విమానాశ్రయానికి ఇచ్చే భూములు రెండోదశలో సమీకరణ కింద తీసుకోనున్నారు. విమానాశ్రయం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే అవకాశం ఉండటంతో అక్కడ రిటర్నబుల్ ప్లాట్లు డెవలపర్ల వాటాకు ఇవ్వాల్సినవి ఒకచోట, రైతులకు ఒకచోట ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అథారిటీ సమావేశంలో భూ సమీకరణపై జరిగిన చర్చలో తొలిదశలో మూడు మండలాల పరిధిలో 32 వేల ఎకరాలు తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. దీనిపై ఈ వారంలోనే జిల్లా అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. తరువాత గ్రామాల వారీ నోటిఫికేషన్ ఇచ్చి సభలు నిర్వహించనున్నారు. తొలిదశలో అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యంద్రాయి, కర్లపూడి గ్రామాలు ఉన్నాయి. తుళ్లూరు మండల పరిధిలోని హరిశ్చంద్రాపురం, వడ్డమాను, పెదపరిమి గ్రామాలను ఖరారు చేశారు. తాడికొండ మండలంలో ఏ గ్రామాన్ని తీసుకోవాలనేది ఆలోచన. రెండోదశలో భూములు తీసుకునేందుకు పెదకూరపాడు మండలంలోని రెండు గ్రామాలు, తాడికొండ మండలం పరిధిలోని రెండు గ్రామాలను ఎంపిక చేశారు. అవసరాన్ని బట్టి గ్రామాల సంఖ్యను పెంచే అవకాశమూ ఉంది. ఇప్పటికే పెదకూరపాడు ఎమ్మెల్యే ఎనిమిది గ్రామాల్లో సభలు పూర్తి చేశారు. పాత అమరావతి గ్రామం పూలింగుకు తీసుకోవాలా వద్దా అనే అంశంపై నిర్ణయం తీసుకునే దిశలోను చర్చ జరిగిందంటున్నారు.అమరావతి రాజధాని నిర్మాణం మూడేళ్ళ పూర్తికావాలనే లక్ష్యాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో కీలక సూచన చేసారు.రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులకు కృష్ణానది నుంచే ఇసుకను డ్రెడ్జింగ్ చేసుకునేందుకు సీఆర్డీఏకి అనుమతి మంజూరు చేసింది. ప్రస్తుతం రాజధానిలో రూ.49,040 కోట్ల విలువైన పనులు జరుగుతున్న రీత్యా రానున్న రెండేళ్లలో వివిధ ప్రాజెక్టులకు 160 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని సీఆర్డీఏ అంచనా వేసింది. రాజధాని నిర్మాణానికి అవసరం అయ్యే ఇసుకను ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టింగ్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని జలవనరుల శాఖను సీఆర్డీఏ కోరింది. రెండేళ్ల పాటు రాజధాని ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను తవ్వుకునేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియకు రూ.286 కోట్ల మేర వ్యయం కానున్నట్టు అథారిటీ సమావేశంలో అధికారులు తెలిపారు.



శనివారం అర్జెంటీనాలోని బ్యూనస్ఎయిర్స్ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు

## కేన్సర్ బాధితునితో వీడియో కాల్‌లో మాట్లాడిన సీఎం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై 5:** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోన్న పార్టీ కార్యకర్త అభిమతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఆకుల కృష్ణతో చంద్రబాబు వీడియో కాల్ చేసి మా ట్లాడారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం, మోరంపూడి జంక్షన్‌కు చెందిన ఆకుల కృష్ణ మొదటి నుంచీ టీడీపీ అభిమాని. చంద్రబాబు అంటే అమిత ఇష్టం. అయితే ఆయన ఇటీవల క్యాన్సర్ వ్యాధికి గురై బాధపడుతున్నారు. తన ఆరోగ్య క్షీణిస్తుండడంతో చంద్రబాబుతో ఒక్క సారైనా మాట్లాడాలని ఆయన కోరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు శనివారం స్వయంగా ఆకుల కృష్ణకు వీడియో కాల్ చేసి మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిని గురిం చి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉం డాలని అన్ని విధాలాతాను అండగా ఉంటానని కృష్ణకు, ఆయన కుటుంబానికి ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అత్యంత విషమంగా ఆరోగ్య పరిస్థితి ఉన్న కారణంగా సరిగా మాట్లాడలేని స్థితిలో ఉన్న కృష్ణ స్వయంగా చంద్రబాబు ఫోన్ చేయ డంపై సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఇప్పుడు ఎంతో సంతృప్తిగా ఉందని అన్నారు.

## కొత్తగా రెండు లక్షల కుటుంబాలకు కార్డులు

>> స్వస్తి చెప్పి రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి.

బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ- పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతోపాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవు తుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పేదలకు ఏకకాలంలో 3లక్షల ఇళ్లు

>> ఫ్రీ హోల్డ్ హక్కులను కల్పించేలా ఈ కన్వేయన్స్ డీడ్ ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు గృహ నిర్మాణం కోసం ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల చొప్పున అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వారికి ఉపాధి హామీ పథకం కింద మరో రూ.30 వేలు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 1000 చెల్లిస్తోంది.ఇదికాకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష అదనపు సహాయం అందిస్తున్నారు. ఇప్పటికే సుమారుగా లక్ష మంది లబ్ధిదారులకు రూ.300 కోట్ల వరకు మంజూరు చేసింది. వారిలో 50 వేల మంది ఇళ్ల నిర్మాణాన్ని పునఃప్రారంభించినట్లు అధికా రులు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహాయం అందించినప్పటికీ నిర్మాణం ఎందుకు చేపట్టలేదో మిగిలిన వారు క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

# 15న జీడిపల్లికి హంద్రీనీవా నీరు

>> ఉన్నాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన రిజర్వాయర్లలో ప్రస్తుతం 419 టీఎంసీల మేర నీటి నిల్వలు ఉన్నాయని... గత ఏడాది ఇదే సమయంలో కేవలం 182 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు వివరించారు. గతంలో కంటే ఈ ఏడాది 236 టీఎంసీల నీరు అదనంగా అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. పెన్నా బేసిన్‌లో సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నీటి నిల్వకు ఎక్కువ అవకాశం ఉందని, ప్రస్తుతం ఆ ఆయకట్టు రైతులకు అవసరమైన సాగునీరు ఇచ్చి, అనంతరం ప్రాజెక్టులను నింపాలన్నారు. అదే విధంగా కడపకు నీళ్లు ఇచ్చే గాలేరు నగరి కెనాల్ పనులను కూడా త్వరలోనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. హంద్రీనీవా ఫేజ్ 2 కాలువ ద్వారా చిత్తూరు జిల్లాలోని చివరి ప్రాంతాలకూ నీరు ఇచ్చేందుకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ప్రకాశం జిల్లాకు కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పనులను 2026 జూన్ నాటికి పూర్తి చేయాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. దీనికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. అలాగే పోలవరం ఎడమ కాలువ పనులు వేగంపెంచి జూలై 31కి పూర్తి చేయాలన్నారు. అనకాపల్లికి వరకు నీరు తీసుకువెళ్లేందుకు అవసరమైన 7 ప్యాకేజీలు పూర్తి చేయాలని ఇందులో ఎలాంటి మినహాయింపు లేదని సీఎం స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కించి నిర్దేశించిన సమయంలోపు పూర్తి చెయ్యాలని సీఎం సూచించారు. తారకరామ తీర్థప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేయాలని, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేయాలన్నారు.

వంశధారనాగావళి అనుసంధానంలో పెండింగ్ పనులను పూర్తిచేయాలని సీఎం స్పష్టం చేశారు. ఉత్తారాంధ్ర సుజలస్రవంతిని వీటికిఅనుసంధానిం చేలా ప్రణాళిక అమలు చేయాలన్నారు.

**వాటర్ ఆడిటింగ్:** రాష్ట్రంలో కురిసే వర్షపాతం, నదుల నుంచి వచ్చే ఇన్ ఫ్లోస్, భూగర్భ జలాలు, సాగు, తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటిని లెక్కించి పక్కాగా వాటర్ ఆడిటింగ్ చేయాలని సీఎం సూచించారు. వాసార్ ల్యాబ్స్ ద్వారా నీటి ఆడిటింగ్ చేపట్టి... సమర్థ నీటి వినియోగం కోసం అవసరమైన ప్రణాళిక అమలు చేయాలన్నారు. పని చేయకుండా ఉన్న ఫిజియోమీటర్లు, వాటర్ లెవల్ తెలిపే సెన్సార్ సిస్టం, రెయిన్ గేజ్ స్టేషన్స్‌ను అందుబాటులోకి తేవాలన్నారు. దీనికి అవసరమైన నిధులు మంజూరుకు సీఎం అంగీకారం తెలిపారు. భూగర్భ జల మట్టాలను కనిష్టం 3 మీటర్లు, గరిష్టం 8 మీటర్లు లక్ష్యాన్ని సాధించేలా జలవనరుల శాఖ పని చేయాలని సీఎం అన్నారు. చీఫ్ ఇంజనీర్‌లు ప్రాజెక్టులు మాత్రమే తమ పరిధి అనుకోకుండా ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపులో కూడా భాగస్వాములు కావాలని సీఎం అన్నారు. పూడిక తీత, చెరువులు నింపడం, చెక్ డ్యాంల నిర్మాణం వంటి చర్యల ద్వారా భూగర్భ జలాలపెంపు లక్ష్యాన్ని సాధించాలని సిఎం సూచించారు. నీటి నిర్వహణను సక్రమంగా చేస్తే కరవు అనే పరిస్థితి ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి రామానాయుడు, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# త్వరలోనే ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ

>> ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టింది వాస్తవం కాదా?. అలాగే తెలుగుదేశం కార్యాలయంపై దాడులు చేయించి, దాడులు చేసిన వారికి ప్రమోషన్లు ఇప్పించారని అన్నారు. చంద్రబాబునాయుడు ఇంటిపై దాడి చేసిన జోగి రమేష్‌కు జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవి ఇచ్చారన్నారు.

**కక్షపూరిత రాజకీయాలకు చిరునామా జగన్:** కక్షపూరితమైన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ జగన్మోహన్ రెడ్డి అని, తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై ఎవరైతే దాడులు చేశారో వారికి ప్రమోషన్లు ఇచ్చి క్రిమినల్స్ ను ప్రోత్సహించింది వైసీపీయే అన్నారు. బూతులు మాట్లాడిన వారికి రక్షణ కల్పించారని,. పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తూ ఒక జీవో తెచ్చింది కూడా వైసీపీయే అని తెలిపారు. బియ్యం కొట్టేసినవారు మాట్లాడు తున్నారని, దొంగపట్టాలు ఇచ్చినోడు మాట్లాడుతున్నారన్నారు. ప్రజా స్వామ్యంలో ఇంత నీచానికి దిగజారుతారా? సిగ్గులేకుండా బరితెగించి మా ట్లాడుతారా? అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో అధికారుల ను వేధించారని, అనేకమంది ఐఏఎస్ అధికారులు జైలుపాలయ్యారు మంత్రి పేర్కొన్నారు. **ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ 'కూటమి' పాలన:** ప్రస్తుతం ఏడాది కాలంలో ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీల ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా రూ.4000 పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, వికలాంగులకు రూ.6000, కిడ్నీ వ్యాధి గ్రస్తులకు రూ.10,000, పూర్తిగా బెడ్ మీద ఉన్నవారికి రూ. 15000 ఇస్తున్నామన్నారు. దాదాపు 2 కోట్ల మందికి ఉచితగ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, 'తల్లికి వందనం' కింద ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంతమందికి ఇచ్చామని, గతంలో 42 లక్షల మందికి ఇస్తే, ఈరోజు 67 లక్షల మందికి 'తల్లికి వందనం' ఇచ్చామన్నారు. రోడ్ల గుంతలను పూడ్చి ప్రజలకు సౌకర్యవంతంగా చేశామని, గ్రామాల్లో సీసీరోడ్లు వేశామని తెలిపారు. త్వరలో 'అన్నదాత సుఖీభవ' కింద మొదటి విడత ఇవ్వనున్నామని, మహిళలకు 'ఉచిత బస్సు ప్రయాణం' అమలు చేయబోతు న్నామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

**సిద్ధార్థ్ కౌశల్ ఐపీఎస్ రాజీనామా, సింగయ్యకు సంబంధించిన వీడియోలను రాజకీయం చేస్తున్న వైసిపి:** సిద్ధార్థ్ కౌశల్ ఐపీఎస్ రాజీనామా, సింగయ్యకు సంబంధించిన వీడియోలు వంటి విషయాలను కూడా వైసీపీ రాజకీయం చేస్తోందని అన్నారు. దొంగతనం చేసి డబ్బులు కట్టేస్తే.. దొర అయిపో తారా? అక్రమంగా ఇళ్ల పట్టాలు సృష్టించి ఎన్నికల్లో కొడుకును అందలం ఎక్కించడం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేసిన వ్యక్తులను మీ పక్కన కూర్చోబెట్టుకుని ప్రోత్సహిస్తారా?. తప్పుడు ప్రచారాలు చేస్తే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు.

# వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్ర కీలకం

>> ర్గాల దార్శనిక ప్రణాళిక యూనిట్లను గౌరవ ముఖ్యమంత్రి ప్రారం భించారన్నారు. స్వల్ప, మాధ్యమిక, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశిం చుకోవడం జరిగిందన్నారు. వాటిని చేరుకునేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, అభివృద్ధి ఆకాంక్షితులు సమన్వయంతో పనిచేయనున్నట్లు వివరించారు. క్వాంటం వ్యాలీ అనుబంధ కార్యకలాపాలతో పాటు ఆధ్యాత్మిక, ఎకో, నదీ పర్యాటకంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేసుకుంటూ, సద్వినియోగం చేసుకొని లక్ష్యాల సాధనకు కృషిచేయనున్నట్లు తెలిపారు. ఇది తొలి అడుగు మాత్రమేనని.. ప్రగతిపై నిరంతర మదింపు ఉంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు..నైపుణ్యాభివృద్ధి కీలకంగా జిల్లాలో పులు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. యువత సుస్థిర ఉపాధి అవకాశాలు పొందేందుకు నైపుణ్యా భివృద్ధి కీలకమన్నారు.ఆటోనగర్‌లో ఆటోమొబైల్ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చాలా ముఖ్యమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగరంలో కొత్తగా వివిధ ప్రాంతాల్లో ఈట్ స్ట్రీట్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు దిశగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. పీఎం ఎఫ్ఎంఈ, పీఎం ప్రణమ్ వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విజయవాడలో సేవారంగ అభివృద్ధికి పుష్కల అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావే శంలో, శాసనసభ్యులు శ్రీరాంరాజగోపాల్ (తాతయ్య), గద్దె రామ్మోహన్, కొలికపూడి శ్రీనివాసరావు,బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరే షన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్, కేడీసీసీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపా లక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.సీపీవో వై.శ్రీలత, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళిక యూనిట్ల ప్రత్యేక అధికారులు డి.చంద్రశేఖర్,డీఎంఎఫ్ విజయకుమారి, ఎ.రవీంద్రరావు. డా. ఎం.హను మంతరావు, పి.బాలాజీకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సింహాచలం గిరిప్రదక్షిణలో తప్పిన పెను ప్రమాదం

>> క్రింద కాంక్రీట్ వేయక పోవడం, ఈ మధ్య కురిసిన వర్షాలవల్ల బరువు ఎక్కువై భారీ షెడ్డు ఒక్కసారిగా కూలియింది. దీనితో పెను ప్రమాదం తప్పింది. కె. ఎస్. ఆర్. గుత్తదారు డికి దేవస్థానం షెడ్లు, బారికేడ్లు నిర్మానానికి ఇవ్వడం జరిగింది.. ఐతే ప్రస్తుతం కూలిన షెడ్డు వరకు వేరేవ్యక్తికి షెడ్డు నిర్మాణానికి సంబంధించి 5.80 లక్షలకి సబ్ కాంట్రాక్టు ఇవ్వడం జరిగింది. ఐతే ఇందులో ఈ నిర్మాణానికి సంబంధించి దానిలో ఉన్న నాణ్యత పర్యవేక్షించాల్సిన బాధ్యత దేవస్థానం అధికారులు ఈ ఈ , డి ఈ , ఏ ఈ. లపై ఉంది.. కానీ వారి పర్యవేక్షణ లోపం వలెనే ఇటువంటి సంఘటన జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. మరోప్రక్క కాంట్రాక్టర్ కూడా సరైన పద్ధతిలో నిర్మాణం జరపలేనట్లుగా తెలుస్తోంది. ఈ మధ్య వర్షాలు పడటం వలన అక్క డ జరుగుతున్న నిర్మాణం వద్ద కనీసం భూమిలో ఇనుప ఫాల్స్ తో పాటు, కాంక్రీట్ తో ఫోల్స్ ను గట్టిగ, లోతుగా నిర్మించాల్సి ఉంది.. కానీ అక్కడ అటువంటి క్వాలిటీ పని జరగలేనట్లు గా, అక్కడ జరిగిన సంఘటన చూస్తే అర్థమవుతుంది..మొన్న జరిగిన చందనోత్సవం గోడ కూలిన ఘటన తరువాత గిరిప్రదక్షిణ కు ఏర్పాట్లు చేస్తున్న షెడ్డు కూలడంతో భక్తుల మరింతగా ఆందోళన చెందు తున్నారు.. స్వామివారి ఉత్సవాలలో ఎప్పుడు ఏమిజరుగుతుందోనని భయపడుతు న్నారు. లోపం ఎక్కడ ఉందో ఎవరు గుర్తించ డం లేదు. కేవలం కమీషన్ల కక్కుర్తి కోసం అధికారులు ఇటువంటి అనాలోచిత నిర్ణయాలు వలననే ఇటువంటివి పునరావృతమవుతున్నా యని భక్తులు, విశ్వాహిందూ పరిషత్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..ఇక దేవాలయం ఇంజనీర్లు సైతం కాసులకు కక్కుర్తి పడి కాంట్రాక్టులకు అప్పజెప్పడం, పర్యవేక్షణ లోపం వలెనే ఇటువంటి ప్రమాదాలు జరుగుతు న్నాయని భక్తులు ఆవేదన చెందుతున్నారు.. ఇక నయినా అధికారులు కళ్ళు తెరవాలని, భక్తుల విశ్వా సాన్ని పెంపొందే దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు.ఇక ఈ ఘటనపై ఈవో త్రినాదరావు స్పందించారు. దీనిపై ఒక కమిటీ ద్వారా విచా రణ చేపట్టి, ఎక్కడతప్పు జరిగిందో పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు.

## ఆత్మహత్య

>> రాజు రాసిన సూసైడ్ లెటర్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నరసింహ మూర్తి రాజు మృతదేహాన్ని పోలీసులు ఆసు పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణా లపై ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 4% డిఎ పెంపు

>> ప్రస్తుతం 58.85శాతంగా ఉంటుంది. ప్రభుత్వం ఈ సంఖ్యను 59శాతంగా సవరించే అవకాశం ఉంది. వీటన్నింటి దృష్ట్యా చూస్తే ఈ ఏడాది జులై నుంచి డిఎను కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు 3నుంచి 4శాతంమేర పెంచుతుందని అంచనా. ప్రస్తుతం ఉద్యోగులకు 55శాతం డిఎ ఉంది. తుదినిర్ణయం జూన్‌నెల ధరలసూచీ ఆధారంగాచేస్తారు. ఈ సూచీ గణాంకాలు ఆగస్టులో విడుదలవుతాయి. ఈ డిఎ పెంపు జులైనుంచి డిసెంబరు వరకూ ఉం టుంది. ఏడోవేతన సంఘం సిఫారసులమేరకే చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. 2014లో ఈకమిషన్‌ను ఏర్పాటుచేసారు. కమిషన్ సిఫార సులన్నీ కూడా 2016 జనవరి ఒకటినుంచి అమలులోకి వచ్చాయి. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర అన్నిరంగాల వారిని సంప్రదించి ప్రభు త్వానికి తన సిఫారసులు అందచేస్తుంది. కేంద్ర ప్రభుత్వం 8వ వేతనసంఘం సిఫారసులను కూడా ఆమోదించింది. 2025 జనవరినుంచి సిఫారసులుచేసింది. అయితే ఇవి 2026 జన వరి ఒకటినుంచి అమలుకువస్తుంది. డిఎ పెం పును కూడా వాస్తవానికి సెప్టెంబరు లేదా అక్టో బరులో ప్రకటిస్తుంది. ఈసారి కూడా దీపావళి పండగ సీజన్ ఉన్నందున డిఎ పెంపును ప్రకటించిందని అంచనా.

### ఉద్యోగుల నిరసన

>>రాజీనామా చేసిన వారికి,విధులకు గైర్హా జరు అయిన వారికి,చనిపోయిన వారికి బదిలీ ఉత్తర్వులివ్వడం తమకు ఆశ్చర్యం కల్గించింద న్నారు. ప్రభుత్వం ఐదు సంవత్సరాలు నుండి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేయాలని ఇచ్చిన ఉత్తర్వులకు భిన్నంగా తమ బదిలీలు చేపట్టారని విమర్శించారు. సుమారు 200 మంది సచివాలయం ఉద్యోగులు సాయంత్రం వరకు తమ నిరసనను తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కృష్ణలంక సిఐ నాగరాజు బందోబస్తును నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 06-07-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి రా.9.13
విశాఖ రా.10.40
వర్జ్యం రా.3.05-4.51
దు.సా.4.56-5.48
శుభసమయం:ఉ.9.00-10.00, సా.7.15-8.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** పోటీపరీక్షల్లో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. రాజకీయ, కళారంగాల వారు సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. బాంధవ్యాల యత్నాలు అనుకూలిస్తాయి.

**మిథునం:** సంగీత సాహిత్యా విషయాలలో ఆసక్తి చూపుతారు. రుణపత్తిడుల నుండి బయటపడతారు.

**కర్కాటకం :** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** దూరప్రాంతాల నుండి సంతోష కరమైన వార్తలు అందుకొంటారు. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కన్య :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు.

**తుల :** ఉద్యోగయత్నాలు కలిసి వస్తాయి. రాజకీయ, పారిశ్రామిక, వైద్య రంగాల వారికి యోగదాయకంగా వుంటుంది.

**వృశ్చికం:** శ్రమకు తగిన ఫలితాలు పొందుతారు. స్థిరాస్తి వృద్ధి చెందుతుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. అనుకోని అతిథుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**మకరం:** సోదరులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** స్థలాలు క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త ఆనందం కలుగుతుంది. వృత్తివ్యాపారాలు విస్తరిస్తారు. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మద్యం కుంభకోణంలో 40వ నిందితుడిగా పురుషోత్తం వరుణ్‌కుమార్

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు, పురుషోత్తం వరుణ్‌కుమార్‌ను 40వ నిందితుడిగా చేరుస్తూ సిట్ అధికారులు చేర్చారు.ఆ మేరకు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో మెమో దాఖలు చేసినట్లు సిట్ అధికారులు తెలిపారు. గతేడాది జులై, ఆగస్టు నెలల్లోనే వరుణ్ విదేశాలకు పారిపోయాడు. ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇప్పటికే అతనిపై లుకౌట్ నోటీసులూ జారీ అయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్‌కుమార్ ఇంజినీరింగ్ చదివాడు. హైదరాబాద్‌లోని ఓ కాఫీ షాపులో నెలకు రూ.32 వేల వేతనంతో పనిచేస్తున్న వరుణ్‌కుమార్‌ను ప్రవాసాంధ్రుడైన ఓ వైద్యుడి ద్వారా రాజ్ కెసిరెడ్డి బృందం మద్యం కుంభకోణంలో పాత్రదారిని చేసింది. పుదుచ్చేరిలోని లీలా డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వరుణ్‌కుమార్‌ను ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా నియమించి, అతని పేరిట రూ.వందల కోట్లు కొల్లగొట్టింది. దర్యాప్తులో దీనికి సంబంధించిన పక్కా ఆధారాలు లభించటంతో సిట్ అధికారులు వరుణ్‌ను నిందితుడిగా చేర్చారు. ఈ విషయాన్నే వారు కేసు షీట్‌లో స్పష్టం చేసారు. తమిళనాడులోని ఎస్ ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ సంస్థకు సంబంధించిన డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ లను రాజ్ కెసిరెడ్డి బెదిరించి వారి అనుబంధ సంస్థ అయిన లీలా డిస్టిలరీస్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్నారు. లీలా డిస్టిలరీస్‌తో ఆథరైజేషన్ ఇప్పించి వరుణ్‌కుమార్‌ను ఆకంపెనీకి ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా నియమిం చారు. అతని పేరిట బ్యాంకు ఖాతా తెరిపించి, రూ.10 కోట్ల వరకూ చెక్ పవర్ కల్పించారు. సొంతంగా మద్యం తయారు చేసే కనీస మౌలిక సదుపాయాలు లేని లీలా డిస్టిలరీస్‌కు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి భారీగా మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చారు.2020 జూన్ నుంచి 2024 మార్చి మధ్య 21 నెలల్లో ఏపీఎస్‌బీసీఎల్ ఈ సంస్థ ఖాతాలో ఏకంగా రూ.459 కోట్లు జమ చేసింది. ఈ వ్యాపార పరిమాణం అసాధారణంగా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది.అంతేకాదు ఈ డబ్బంతా వెనువెంటనే వేర్వేరు ఖాతా ల్లోకి మళ్లిపోయింది. వాటిని విశ్లేషించిన సిట్ అధికారులు అందులో అత్య ధికశాతం కల్పిత కంపెనీలతో నిర్వహించిన అనుమానాస్పద లావాదేవీలేనని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే వరుణ్‌కుమార్‌ను నిందితుడిగా చేర్చారు.

# ఆదాయ సమానత్వంలో ప్రపంచంలోనే భారత్-4

### జి7,జి20 దేశాలను వెనక్కి నెట్టేసిన ఇండియా

**న్యూయార్క్, జూలై 5:** ఆదాయ సమానత్వం పరంగా భారత్ ప్రపంచంలోనే ఒక ఆదర్శవంతమైన దేశంగా నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఆదాయ పంపిణీలో అసమానతలను కొలిచే 'గిని సూచీ'లో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించి, ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలిచింది. స్లోవాక్ రిపబ్లిక్, స్లోవేనియా, బెలారస్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. అమెరికా, చైనాతో పాటు జీ7, జీ20 కూటమిలోని అన్ని అగ్ర దేశాలను భారత్ వెనక్కి నెట్టడం విశేషం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారత్ గిని సూచీ స్కోరు 25.5గా నమోదైంది. ఇదే సమయంలో చైనా (35.7), అమెరికా (41.8) వంటి దేశాలు భారత్ కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. 2011లో 28.8గా ఉన్న గిని స్కోరు ఇప్పుడు గణనీయంగా మెరుగుపడటం, దేశఆర్థిక ప్రగతి ఫలాలు ప్రజలం దరికీ సమానంగా అందుతున్నాయనడానికి నిదర్శనమని సాంఘిక సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘనత వెనుక దేశంలో పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న స్థిరమైన విధానాలే ప్రధాన కారణమని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో స్పష్టం చేసింది. 2011 నుంచి 2023 మధ్య కాలంలో దేశంలో సుమారు 17.1 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది.

ఇదే సమయంలో, రోజుకు 2.15 డాలర్ల ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటే, దేశంలో పేదరికపు రేటు 16.2 శాతం నుంచి కేవలం 2.3 శాతానికి పడిపోయింది. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ద్వారా 55 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆధార్ ద్వారా 142 కోట్ల మందికి ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) సేవలు అందించడం వంటి కార్యక్రమాలు ఈ మార్పునకు దోహదపడ్డాయి. డీబీటీ ద్వారా మార్చి 2023 నాటికి రూ.3.48 లక్షల కోట్లు ఆదా అయినట్లు నివేదిక వెల్లడించింది. వీటితో పాటు, ఆయుష్మాన్ భారత్ కింద 41 కోట్ల మందికి ఆరోగ్య రక్షణ, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా 80 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించడం వంటి పథకాలు కూడా ఆదాయ సమానత్వాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి.



## తిరుమలలో రాయచోటి జంట వివాహం

### ఇద్దరూ మేజర్లమంటూ ప్రకటన

**తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:** కొంత కాలంగా ఇద్దరూ మనస్పూర్తిగా ఇష్టపడి జీవితంలో ఒక్కటవ్వాలని నిర్ణయించుకుని దేవుని కొలువైన చోట వివాహం చేసుకున్నామని అన్నమయ్యజిల్లా రాయచోటికి చెందిన జంట తిరుమలలో వెల్లడించింది. మేమిద్దరం మేజర్లమని ,మా ఇష్టప్రకారం వివాహం చేసుకున్నామని,మమ్మల్ని బ్రతకనివ్వండి అని వేడుకున్నారు. రాయచోటికి చెందిన పూలశెట్టి సాయిప్రతాఫ్(26),(19) యువతితో ఇద్దరూ తిరుమలలోని లేపాక్షి కూడలిలో ఉన్న శ్రీవారి చెంత పూలదండలు మార్చుకుని సాంప్రదాయంగా వివాహం చేసుకున్నామన్నారు.మేము ఇష్టపూర్వకంగానే పెళ్ళి చేసుకున్నామని, మా బ్రతుకులు మమ్మల్ని బ్రతకనివ్వండి అని వేడుకున్నారు. యువతీయువకులు పెళ్ళి చేసుకోవడంపై పోలీసులుకు ఎలాంటి సమాచారంగానీ, పిర్యాదుగానీ లేదని తిరుమల పోలీసులు తెలిపారు.

## విదేశాల్లో వైద్య విద్య అభ్యసించే విద్యార్థుల ఇంటర్న్‌షిప్ విషయంలో కోర్టు నిర్ణయం మేరకు చర్యలు

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి ఇంటర్న్‌షిప్ విషయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యపై హైకోర్టు తీర్పును బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని మెడికల్ కౌన్సిల్ చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు వెల్లడించారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో మీడియాతో శుక్రవారం మాట్లాడారు. ప్రస్తుతం ఆందోళన చేస్తున్న విద్యార్థులు విదేశాల్లో వైద్య విద్య చదువుకొని కోవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో,ఆఫ్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేశారు. ఇక్కడే ఉండి ఆన్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి రెండేళ్ళు,చదువుకున్న దేశంలో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఏడాది సమయం జాతీయ మెడికల్ కౌన్సిల్ ఇచ్చింది. దీనిపై కొంత మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు అక్కడ పెండింగ్‌లో ఉంది. జాతీయ మెడికల్ కౌన్సిల్,హైకోర్టు ఇచ్చే తీర్పును బట్టి ప్రస్తుతం ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యకు పరిష్కార మార్గాలను యోచిస్తాం' అని దగ్గుమాటి తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ,జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని చెప్పారు.

# 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కార్యక్రమాలు..
- జూనియర్ కళాశాలల్లో కూడా నిర్వహణ..
- తల్లిదండ్రులతో పాటు పూర్వ విద్యార్థులు హాజరు..
- తల్లి పేరుతో మొక్క నాటడం ప్రత్యేకం..

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులు

**విజయవాడ, జూలై 5,ప్రభాత వార్తప్రతినిధి:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ఈ నెల 10న జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని.. గత ఏడాది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించడం జరిగిందని, ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో కూడా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌పై కలెక్టర్ లక్ష్మీశ శనివారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,500 పాఠశాలల నుండి రెండు లక్షల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలసి హాజరు కానున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా ఈ పీటీఎం సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 186 జూనియర్ కళాశాలల్లో 78,162 మంది విద్యార్థులున్నట్లు తెలిపారు. పిల్లలే ఆహ్వానాలను తల్లిదండ్రులకు అందిస్తారని, ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్ ను కూడా ఇస్తారని, తల్లిదండ్రులు ఆ ఫార్మాట్ పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. పండగలా నిర్వ హించే ఈ కార్యక్రమాలలో పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని, టీచర్, స్టూడెంట్, పేరెంట్స్ తో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థి గతేడాది చూపిన ప్రతిభను, ఈ ఏడాది సాధించవలసిన దాని గురించి చర్చ జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానించడం జరుగుతుందని, అలాగే పూర్వ విద్యార్థులను, అక్కడే చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన గొప్ప వ్యక్తులను కూడా ఆహ్వానించి సత్కరించడం జరుగుతుందన్నారు. పిల్లలలోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా పలు పోటీలను నిర్వహించడం జరుగుతుందని, అలాగే తల్లిదండ్రులకు కూడా రంగోలి, టగ్ ఆఫ్ వార్ , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. తల్లి పేరుతో ఒక మొక్క నాటడం ఈ ఏడాది థీమ్ గా తీసుకోవడం జరిగిందని, పాఠశాల ఆవరణలో కానీ, లేదా వారి ఇంటి వద్దగానీ మొక్క నాటవచ్చని తెలిపారు. అందుకోసం లీప్ (లినితిశి) యాప్ లో లాగిన్ అయి వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల పర్యవేక్షణకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కమిటీలను నియమించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన పెంపొందించి, డ్రగ్స్ రహిత జిల్లా కోసం డ్రగ్స్ వద్దు బ్రో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు.

సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష అధికారి జి.మహేశ్వరరావు పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మునగ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని.. ఈ నేపథ్యంలో రైతులు ఉపాధి హామీ పథకం సహాయంతో మునగసాగు చేపట్టి, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. నందిగామ మండలం, సోమ వారం గ్రామంలో ఓ రైతు పొలంలో మునగ విత్తనాలు నాటి రెండు వరుసల్లో మునగ పంట పెంపకం పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునగ సాగును ప్రధాన పంటగా లేదా పొలం గట్ల వెంబడి చుట్టూ అంతర పంటగా చేపట్టవచ్చని తెలిపారు.

ప్రత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయలు పండించే రైతులు వారి పొలం చుట్టూ రెండు వరుసల్లో ఎకరానికి 190 మొక్కలు నాటితే ఉపాధి హామీ పథకం నుంచి రెండేళ్లకుగాను పూర్తి ఉచితంగా రూ. 31 వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ మొక్కల ద్వారా దాదాపు రూ. 1,50,000 అదనపు ఆదాయం పొందొచ్చన్నారు.

# ఈ యేడాది తిరుమలేశునికి వార్షిక బ్రహ్మోత్సవాలే!

**తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు... కలియుగ ప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది ఒక బ్రహ్మోత్సవమ్ మాత్రమే నిర్వహించనున్నారు. సాధారణంగా ప్రతి మూడేళ్ళకోసారి అధికమాసం వస్తే రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్‌లో మొదలు కానున్నాయి. బ్రహ్మోత్సవాల పేరుతో తొమ్మిది రోజులు జరిగే ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 13నుండి అంగరంగ వైభవంగా చేపట్టనున్నారు. సాధారణంగా అధికమాసం వస్తే రెండుదఫాలు (సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్‌మాసంలో, నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ మాసంలో) నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఒకేబ్రహ్మోత్సవమ్ జరుగుతుంది. భగవంతుని వాహనసేవలను ఆలయమాఢ వీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవల వీక్షణకు సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందించనున్నారు.

బ్రహ్మోత్సవాల నిర్వ హణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా టిటిడి, పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు.




విశాఖ-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్

## విశాఖ - సికిందరాబాద్ వందేభారత్ బోగీల పెంపు

**గుంతకల్లు రైల్వే, జూలై 5,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల్లోని దక్షిణ కోస్తా రైల్వే దక్షిణ మధ్య రైల్వే జోన్‌ల పరిధిలోని విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య తిరిగే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బోగీలతో నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య తిరిగే నెంబర్ 20707/08వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు శనివారం నుంచి అదనంగా మరో 4 ఏసి చైర్ కార్ బోగీలను కలిపి మొత్తం 20బోగీలతో నడుపుతున్నట్లు వారు తెలిపారు.

## ఖరీఫ్‌లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం

- వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ పంటలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు స్పష్టం చేసారు.రైతులకు సాగు వినియోగం కోసం ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు.ఈ తరుణంలో ఎరువులు దొరకవనే అపోహలు వద్దన్నారు. కొరత ఉందనే దుష్ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని కోరారు. ఎప్పటికప్పుడు సమీక్ష చేసి,అవసరం మేరకు ప్రవేవేటు డీలర్లు,సొసైటీలు,రైతుసేవా కేంద్రాల్లో ఎరువులను అందుబాటుతులో ఉంచుతామని చెప్పారు. మంగళగిరి లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో క ంపెనీల ప్రతినిథులు,డీలర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మార్క్‌ఫెడ్,సొసైటీలు రైతుసేవా కేంద్రాలు, డీలర్ల వద్ద 8.73 లక్షల టన్నుల ఎరువల లభ్యత ఉండగా,యూరియా 3.12 లక్షల టన్నులు ఉన్నాయని తెలిపారు వచ్చే 3 నెలల్లో మరో 4.50లక్షల టన్ను యూరియా రావాల్సి ఉందన్నారు. డీలర్లు కృషి చేసి కొతర సృష్టించినా, ఎమ్మార్పీ కన్నా అధికంగా అమ్మినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

# తిరుమల సమాచారం

## వంటసామాగ్రి మార్కెటింగ్ గోడౌన్‌లో కోల్డ్‌స్టోరేజ్

- అలిపిరి టోల్‌గేట్ విస్తరణకు చర్యలు :టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,జూలై 5ప్రభాత వార్తప్రతినిధి:** భక్తులకు అన్నప్రసాదాలు తయారు చేసేందుకు వినియోగించే వంటసామాగ్రి నిల్వవుంచందుకు వీలుగా మార్కెటింగ్ గోడౌన్‌లో కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులకు ఆదేశాలిచ్చార. భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా, ఆధునికసౌకర్యాలతో కల్యాణకట్ట నిర్మాణం కోసం ఎంపికచేసిన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా చేపట్టి, దశలవారీగా విస్తరణ చేసే అంశాలను పరిశీలించాలన్నారు. భక్తులకు మరింత వేగంగా తనిఖీ సేవలుఅందించేందుకు అలిపిరి టోల్‌గేట్ ప్లాజా వద్ద చెకింగ్ పాయింట్ విస్తరణ, అత్యాధునిక కెమెరాలు ఏర్పాటు పై చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఇఒ శ్యామలరావు టిటిడిలో అభివృద్ధి పనులపై, టోల్‌గేట్ విస్తరణపై సమీక్షించారు. భక్తుల సౌకర్యార్థం తిరుమల,తిరుపతిలో నిర్మిస్తున్న భవనాలను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గుత్తేదారులు అలసత్వం లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి నివేదిక సమర్పించాలని కోరారు. టిటిడిలో దళారీ వ్యవస్థ, నకిలీ టిక్కెట్ల పేరుతో సేవల టిక్కెట్ల అమ్మకాలు,అవినీతిపై మరింత నిఘా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా అలిపిరి భూదేవికాంప్లెక్స్ లోట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇఒ తెలిపారు.

## వారాంతం సెలవులతో వెంకన్న దర్శనానికి 26గంటలు



**తిరుమల,జూలై 5ప్రభాత వార్తప్రతినిధి:** వేసవి సెలవులు అనంతరం వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్రనుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్ లు,నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు వరకు చేరాయి. ఏడుకొండలస్వామిని చూడటానికి సామాన్యభక్తులు ఇబ్బందులు తప్పడంలేదు. సాధారణ సర్వదర్శనానికి 26గంటలు సమయం కేటాయిస్తుండగా, సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్ల భక్తులకు 10గంటలు సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఆరు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో కొండ కిటకిటలాడుతోంది. టిటిడి అధికారులు భక్తుల రద్దీకి తగ్గట్లు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 50వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## 15,16 తేదీల్లో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

- ఆ రెండురోజులు సిఫార్సులేఖలు తేవద్దు

**తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:** ఆపద మొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆణిమాసం చివరన ఎంతో విశిష్టత ఉన్న ఆణివార ఆస్థానం నిర్వహించడంఆనవాయితీ. ఈ పర్వదినం ముందు మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఈనెల15వతేదీ మంగళవారం వెంకన్న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ,16వతేదీ బుధవారం ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. దీనికి ముందు సోమవారం 14వతేదీ విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు తీసుకురావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. అలాగే 15వతేదీ మంగళవారం కూడా 16వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని టిటిడి వెల్లడించింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## స్వామివారి ఆశీస్సులతో అంతా మంచి జరగాలి: చాముండేశ్వరీనాథ్



**తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా మంచి జరగాలని, క్రీడా కారులకు శుభాలు కలగాలని స్వామివారిని వేడుకున్నట్లు ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు వి. చాముండేశ్వరినాథ్ తెలిపారు. శనివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో మనసు ఆనందం

**తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమలేశుని దర్శనంతో మనసు ఆనందం కలుగుతుందని టివి సీరియల్స్ నటి సోనియాసింగ్ అభిప్రాయపడ్డారు. తనకు అంతా మంచి జరిగేలా ఆశీస్సులు వేంకటేశ్వరస్వామి అందజేయాలని వేడుకున్నట్లు తెలిపారు. వేంకటేశ్వరస్వామి దర్శనం అపార ప్రశాంతత, ఆనందాన్ని కలిగించిందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# భైరవాని తిప్ప ప్రాజెక్టు పనులు పునఃప్రారంభం

### కల్యాణదుర్గం ప్రాంతానికి ప్రాజెక్ట్ జీవనాడి : ఎమ్మెల్యే సురేంద్రబాబు

### వేగంగా పని చేస్తే యేడాదిలోపే కృష్ణా జలాలతో బిటిపి నింపొచ్చు.. విప్ కాలువ శ్రీనివాసులు




భైరవని తిప్ప ప్రాజెక్టు పనుల పున ప్రారంభ దృశ్యాలు

**అనంతపురం, జులై 5, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో భైరవానితిప్ప ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చారని, కళ్యాణ్ దుర్గం, రాయదుర్గం నియోజకవర్గ ప్రజలకు భైరవానీ తిప్ప ప్రాజెక్టు జీవనాడి లాంటిదని కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడించారు.. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి గ్రామ సమీపంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా బి.టి.పి కాలువ పునఃప్రారంభ పనులను శనివారం ప్రారంబి ంచారు. ప్రభుత్వ విప్, రాయ దుర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్, జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు, నియోజకవర్గం నుంచి తరలివచ్చిన పార్టీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కొబ్బరికాయ కొట్టి కాలువ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాకు ధైర్యం చెప్పడంతోనే పనులు పునఃప్రారంభించడం జరిగింది. ఇక్కడ మా కంపెనీకి శ్రేయస్సు కంటే ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సు ముఖ్యం అన్నారు..నారా చంద్రబాబు నాయుడు ను కలిసిన ప్రతి సారి తప్పకుండా మీ బీటీపీ కాలువ పనులు చేద్దాం అని చెప్పే వారు అని ఎమ్మెల్యే అన్నారు.ఎట్టకేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీటీపీ పనులు ప్రారంభించడానికి అంగీకారం తెలపడం మాకు సంతోషం కలిగించింది అన్నారు. రాష్ట్రం జగన్మోహన్ రెడ్డి అప్పులు చేసి పోగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా రైతుల బాధలు, వారి ఇబ్బందులు గుర్తించి నిధులు కేటాయిస్తామని చెప్పడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టం అన్నారు. రైతులకు పరిహారం ఇవ్వకపోయినా కూడా కాలువ పనులు చేయమని అడుగుతున్నారు అంటే ఇక్కడ నీటి అవసరం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు..రాయలసీమలో ఉన్న నీటి ప్రాజెక్ట్ లపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపి నేడు 3800 కోట్లు వెచ్చించి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేస్తున్నారు. అది పూర్తయితే మన బీటీపీ ప్రాజెక్ట్ కు అవసరమైన నీళ్లు ఎప్పుడు అందుబాటులో ఉంటాయన్నారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో సాగునీటి సౌకర్యాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం రైతుల అభ్యున్నతే లక్ష్యంగా భైరవానదిప్ప ప్రాజెక్టు పనులు చేపట్టిందని,, ఈ ప్రాజెక్టు వల్ల కళ్యాణ్ దుర్గం, రాయదుర్గం నియోజకవర్గం ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. యువతి మృతి.. 15 మందికి గాయాలు

**.రేణిగుంట జూలై 5 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్రిగుంట సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, 15 మంది గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం దగ్గరలోని అమర ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా కరకంబాడి లోని ఓ ప్రైవేట్ కర్మాగారానికి ఉదయం పిచ్చాటూరు నుండి కార్మికులను, ఉద్యోగులను తీసుకెళ్లే కంపెనీ బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు కూర్చున్న ఊహా మహాలక్ష్మి అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. 15 మంది గాయపడ్డారు.విషయం తెలుసుకున్న వెంటనే రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, తమ సిబ్బందితో సంఘటన స్థలం చేరుకొని ట్రాఫిక్ ని క్రమబద్ధీకరించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అమర ఆసుపత్రికి తరలించారు. అమర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందిస్తాల్సిందిగా వైద్యులను కోరారు. ప్రమాద విషయం పై సిఐటియు నేతలు సెల్వరాజ్, ఈశ్వరి తదితరులు స్పందిస్తూ మృతురాలి కుటుంబానికి కోటి రూపాయలు, గాయపడిన వారికి 50 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కంపెనీ యాజమాన్యాన్ని విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.



గాయపడిన వారికి అందిస్తున్న చికిత్సపై ఆరా తీస్తున్న తహసీల్దార్

# డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అమలు

- రద్దు కానున్న ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్ ప్రకటన
- ఆన్‌లైన్ ప్రవేశాల కౌన్సిలింగ్‌లో కళాశాలలకు ప్రాధాన్యం

**విజయవాడ,జులై 5,ప్రభాతవార్త ప్రతినిధి:** డిగ్రీలో కొన్ని మార్పులతో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిగ్రీలో 126 క్రెడిట్లు ఉండేలా మార్చనున్నారు. ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్ విధానం అమలుకు సిలబస్ రూపొందించి నోటిఫికేషన్ జారీ చేయగా...ఇప్పుడు కొన్ని మార్పులతో సింగిల్ సబ్జెక్ట్ విధానమే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.దీంతో గత నెలలో ఉన్నత విద్యామండలి ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసే అవకాశం ఉంది.వైకాపా హయాంలో 2023-24లో సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకురాగా,దీంట్లో మార్పులంటూ ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలుకు చర్యలు చేపట్టింది. సిలబస్‌నుసైతం ఖరారు చేసింది. అమలుకు నోటిఫికేషన్ జారీ చేయడంతో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు సింగిల్ నుంచి డబుల్‌కు మారేందుకు ధరఖాస్తు చేసుకున్నాయి. ఈ తరుణంలో కొన్ని మార్పులతో సింగిల్ మేజర్ విధానాన్నే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నత విద్యామండలి డబుల్ మేజర్‌కు చర్యలు తీసుకోగా...కళాశాల విద్యాశాఖ సింగిల్ మేజర్ అమలుచేయాలని పట్టుబట్టింది. దీనిపై రెండు శాఖల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం సాగుతోంది.మంత్రి లోకేష్ వద్ద శుక్రవారం జరిగిన సమీక్షలోనూ డబుల్,సింగిల్ మేజర్‌లపై రెండు విభాగాల తరపున ప్రజెంటేషన్ ఇచ్చారు.రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నందున డబుల్ మేజర్ విధానంలో క్వాంటమ్ టెక్నాలజీని మైనర్ సబ్జెక్టుగా ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టింది. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీని తప్పనిసరి చేసింది. ఇంటర్మీడియట్‌లో గణితం,భౌతికశాస్త్రం సబ్జెక్టులు చదివి,డిగ్రీలో ఇతర కోర్సులు చదివేవారికి ఐచ్ఛికం చేసింది. నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో కృత్రిమ మేధను తీసుకువచ్చింది. ఇప్పుడు డబుల్ మేజర్ లేకపోతే...వీటిపై సందిగ్ధత ఏర్పడుతుంది.డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్‌లో రెండు విధాలుగా నిర్వహించాలని నిర్ణయించింది.

ఇప్పటి వరకు ఉన్నత విద్యామండలి కన్వీనర్ కోటా సీట్లకు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది నుంచి విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.కళాశాలల ద్వారాను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.ఆయా కళాశాల్లోనీ 70% కన్వీనర్ కోటాగా కేటాయిస్తారు.

మిగతా 30% యాజమాన్య కోటాలో కళాశాలలు భర్తీ చేసుకోవాలి. కన్వీనర్ కోటాకు బోధన రుసుముల చెల్లింపు పథకం వర్తిస్తుంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ వ్యాప్తంగా ఖరీఫ్ (వానాకాలం సాగు) సీజను ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో ఖరీఫ్ సీజనుపై రైతులు దృష్టి సారించారు. వానకాలం సీజన్ రైతులకు అనుకూలంగా ఉండటంతో జూన్ మొదటి వారంలో వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తా యి. పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు పడుతుండడంతో పత్తి, సోయా, మక్క పంట ఎదుగుదల బాగా ఉంది. రైతులు పంటలు పెరగడానికి ఎరువులను వినియోగిస్తారు. అయితే రైతులకు ఎరువులు పెద్ద సమస్య అయింది. ముమ్ముందు ఎరువులకు మరింత ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదం ఉంది. కేంద్రప్రభుత్వం ఎరువులు సరఫరా చేయడం లేదని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చేసిన ప్రకటన, ప్రస్తుతం ఉన్న ఎరువుల నిల్వలపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. వరి, మక్క, పత్తి పంటలకు కీలకం కానున్న యూరియాకుకొరత ఏర్పడితే పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఈ నెలలో కేటాయింపులు జరిగితేనే కొరత లేకుండా ఉంటుందని, లేదంటే తాము రోడ్డె క్కాల్సి వస్తుందని రైతాంగం వాపోతున్నది. రైతులకు అవసరమైన ఎరువులు దుకాణాల్లో లభించకపోవడంతో పడిగాపులు కాయాల్సి న దుస్థితి నెలకున్నది. ఈనెలలో సరిపడా ఎరు వులు కేటాయించ కుంటే రైతులు మరింత ఇబ్బందులు పడాల్సి న పరిస్థితి ఉంటుంది. అయితే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసర మైన ఎరువులు సరఫరా చేయడం లేదని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కేంద్రప్రభుత్వం కూడా సకాలంలో ఎరువులు కేటాయిస్తేనే కొరత లేకుండా ఉంటుంది. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ వద్ద 222 బస్తాలతో ఉన్న యూరియా లారీని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు.

# అన్నదాతకు ఎరువుల టెర్రర్

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కీలకమైన ఖరీఫ్ పంటలు ఊపందుకున్న నేపథ్యంలో రైతులు యూరియా తదితర ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎరువుల కొరత ప్రారంభమైంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ఉన్న ఎరువులను బ్లాక్ చేస్తూ, అత్యధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే కొరతను ఎదుర్కొంటున్న రెండు రాష్ట్రాల్లో ఎరువులు సకాలంలో కేటాయించకుంటే తీవ్రమైన కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉన్నది.? ఇప్పటికే యూరియా తదితర ఎరువుల కొరత రైతులను పట్టి పీడిస్తోంది. డీఏపీ కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరానికి తగినట్లు సరఫరా లేదు. ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులు కూడా వాడుకోవచ్చని అధికారులు చెబుతున్నప్పటికీ డీఏపీ వాడినంత ఫలితం ఉండదనే ఉద్దేశ్యంలో రైతులు ఉన్నారు. ఎరువుల కోసం రైతులు సహకార సంఘాలు, ఆగ్రో సెంటర్లు, మార్క్‌ఫెడ్ తదితర వాటి చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రధానమైన వరి, మక్క, పత్తి పంటలకు ఎక్కువగా ఎరువులు వినియోగిస్తుండగా, కీలక దశలో ఎరువుల కేటాయింపు తగిన రీతిలో లేకుంటే రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఉంటుంది. వరి, పత్తి వంటి కీలక పంటల భవితవ్యాన్ని సకాలంలో సరఫరాలు నిర్ణయిస్తాయి. ఎకరానికి సగటున 173 కిలోల ఎరువుల వాడకంతో భారతదేశంలో ఐదవ స్థానంలో ఉన్న రాష్ట్రం, సరఫరా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది, దీని ఫలితంగా స్థానికీకరించిన ధరలు పెరిగాయి, కొంత మంది రైతులు సబ్సిడీరేటు రూ.266.50 నుండి రూ.268 వరకు ఉండగా, 45 కిలోల సంచికి రూ.300 నుండి రూ. 325 వరకు చెల్లిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది పంట కాలంలో 39 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా ఎరువుల కొరతతో ఈ ఏడాది దానిని 35 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించేలా వ్యవసాయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో డైఅమోనియం ఫాస్ఫేట్, యూరియా ఎరువుల కొరత వరి సాగుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రాష్ట్రానికి మొత్తం 16.76 లక్షల టన్నుల ఎరువులు కేటాయించబడ్డాయి, వీటిలో 6.22లక్షల టన్నులయూరియా, 2.60 లక్షల టన్నుల డిఏపి, 0.70 లక్షల టన్నుల ఎమ్ఒపి, 0.94 లక్షల టన్నుల ఎస్ఎస్‌పి, 6.30 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయి. అయితే నెలవారీగా రావాల్సి న ఎరువుల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఆంధ్రాలో ఎరువుల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. అలాగే ఏప్రిల్ నుండి జూన్ వరకు తెలంగాణకు కేంద్రం ఐదు



లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించింది, కానీ కేవలం 3.06 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయబడ్డాయి, ఫలితంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నులలోటు ఏర్పడింది. జూలై నెలలో, కేంద్రం 1.60 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామని హామీ ఇచ్చింది, అందులో 60శాతం దిగుమతి చేసుకున్న యూరియా, కానీ దాని రవాణా కోసం ఏ నౌకలను కేటాయించలేదు, దీనివల్ల మరింత ఆలస్యం జరుగుతుందనే భయాలు తలెత్తుతున్నాయి. సరఫరాలో ఈఅంతరం, లాజిస్టికల్ వైఫల్యాలతో మరింతగా పెరిగి, ఖరీఫ్ సీజన్‌ను పతనపరిచే ప్రమాదం ఉంది. ముందస్తు నైరుతి రుతుపవనాల రాకతో కురుస్తున్న వర్షాలతో వానాకాలం సాగులో ఎరువుల కొరత ప్రధానంగా యూరియా పెద్ద సమస్యగా తయారవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్, జగిత్యాల తదితర జిల్లాల్లో రైతులు ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క వానకాలం సీజన్‌లో విత్తనాలు విత్తు కోవడం ప్రారంభం కావడంతో ఎరువులు అవసరమైన రైతులు దుకాణాల చుట్టు యూరియా, డీఏపీ మందుల కోసం పాకులాడుతున్నారు. అనుకూల వాతావరణం, రిజర్వాయర్ నీటి నిల్వలు పూర్తి స్థాయిలో ఉండటంతో పంటల సాగుపై దృష్టి సారించారు. దుక్కులు దున్ని సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముఖ్యంగా యూరియాకు డిమాండ్ ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలంలో యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉండడంతో ఉదయం 6 గంటల నుంచే సహకార సంఘాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఖమ్మం జిల్లాలో అరకొర యూరియాతో రైతులు ఇబ్బదులు పడుతున్నారు. మేలో 831 టన్నుల యూరియాకు గాను 419 టన్నులు, జూన్‌లో 4,153 టన్నులకు కేవలం 1,973 టన్నులు మాత్రమే సరఫరా చేయడంతో రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనికి తగినట్లుగా ఈ వానాకాలం సాగులో తెలంగాణ ఎరువుల వినియోగంలో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇది గత ఏడాది కంటే మించిపోతుందని అంచనా. 2023-24లో దేశం మొత్తం యూరియా వినియోగంలో తెలంగాణ 5.8 శాతం వాటాను కలిగి ఉంది. ఇదే కాలంలో రాష్ట్రం 1.08 మిలియన్ టన్నుల డిఎపి, 0.16 మిలియన్ టన్నుల ఎంఒపి, 1.11 మిలియన్ టన్నుల ఎన్‌పికె కాంప్లెక్స్ ఎరువులను వినియోగించింది. 2023-24లో హెక్టారుకు 139.8 కిలోల మేర ఎరువుల వినియోగం ఉండగా, ఈసారి అది 145 కిలోలకు చేరుకునే వీలుందని అంచనా. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో యూరియాకు లోటుఏర్పడింది. అధికారిక లెక్కల ప్రకారం కేంద్రం వానాకాలం సాగుకై తెలంగాణకు 9.8 లక్షల టన్నుల యూరియాను కేటాయించింది. అయితే, ఏప్రిల్, మేలో 3.3 లక్షల టన్నులకు 2.16 లక్షల టన్నులు మాత్రమే పంపిణీ చేసింది, దీనితో 1.14 లక్షల టన్నులలోటు ఏర్పడింది. ఇక ఏప్రిల్‌లో 1.7 లక్షల టన్నులకు 1.22 లక్షల టన్నులు, మేలో 1.6 లక్షల టన్నులకు 0.94 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. ఈ నెలకు సంబంధించి కేటాయించిన 1.7 లక్షల టన్నులలో ప్రస్తుతం 37 శాతం మాత్రమే దేశీయంగా సేకరించబడుతుందని భావిస్తున్నారు. మిగిలిన 67శాతం దిగుమతులపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఎరువులు అధికంగా ఉపయోగించే వరి, మొక్కజొన్న సాగువిస్తరణ కారణంగా యూరియా డిమాండ్ పెరుగుతోంది, ఈ కొరత రైతులలో ఆందోళనకు కారణమైంది. కీలకమైన విత్తనాలు వేసే సమయంలో ఎరువుల లభ్యతను అంతరాయం లేకుండా చూసుకోవడానికి జూన్ నెల కేటాయింపులతో పాటు మిగిలిన 1.14 లక్షల టన్నుల లోటును త్వరగా తీర్చాలని ఇప్పటికే రాష్ట్రసర్కార్ కేంద్రాన్ని లేఖరాసినా ఇంత వరకూ అది కార్య రూపం దాల్చ లేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రమంత్రులకు లేఖ రాస్తూ ఎరువుల సంక్షోభాన్ని పరిష్కరించడానికి వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. జూలై నెలకు నిర్ణయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి చేసుకున్న యూరియాను రవాణా చేయడానికి వెంటనే ఓడలను కేటాయించాల ని, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ నుండిదేశీయ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుండి 60,000 టన్నులకు పెంచాలని తన లేఖలో కోరారు. ఏప్రిల్, జూన్ లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కూడా కోరుతూ, ఈకీలకమైన వ్యవసాయ సీజన్‌లోతెలంగాణ రైతుల కు మద్దతు ఇవ్వడానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రిక్వెస్ట్ చేశారు. ●

# దినదిన గండం!

కర్ణాటక

**ఎ.వి.వి ప్రసాద్**

దినదిన గండం..నూరేళ్లాయుష్షు అంటూంటారు. కర్ణాటక నాయకత్వ వివాదాన్ని చూస్తే ఆ సామెతే గుర్తుకు వస్తుంది. ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ద రామయ్య, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న డికె శివకుమార్ మధ్య నెల కొన్న 'కోల్డ్ వార్' ఇటీవల మరింత పెరిగినట్లు కనిపిస్తోంది. వారి ముఖ్య అనుచరులు చేసే కామెంట్లు, అప్పుడప్పుడు ఆ ఇద్దరు నేతలు చేస్తున్న ప్రకటనలు అందరిలో చాలా అనుమానాలనే కలిగిస్తున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో నాయకత్వ మార్పు తప్పదా? అనే ప్రశ్నఅందుకే అధికంగా వినిపిస్తోంది. మీడియా ప్రతినిధులు వేసే ప్రశ్నలకు'అంతా అధిష్ఠానం నిర్ణయిస్తుంది' అని సిద్దరామయ్య, డికె అనడం ఎక్కువయింది. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి 'అధిష్ఠానం' పాత్ర అటువంటిదే గనుక వారు అలా అనడంలో తప్పు లేదనుకోవచ్చు. కానీ పార్టీఅధ్యక్షుడైన మల్లికార్జున ఖర్గే కూడా 'ఆ విషయం అధిష్ఠానం చూసుకొంటుంది' అనడమే ఆశ్చర్యంకలిగిస్తుంది. కర్ణాటక వారైన ఖర్గేకు సొంత రాష్ట్రం రాజకీయాలపై పట్టు మరింత ఎక్కువ ఉంటుంది కనుక అయన సిఫారసులకే ప్రాధాన్యత లభిస్తుంది. కానీ ఆయనే'అధిష్ఠానం' వేరే ఉన్నట్లు అనడం చూస్తే రాష్ట్రంలో నాయ కత్వ మార్పు తప్పదేమో! అనే అభిప్రాయమే కలుగుతుంది. ఆయన ఉద్దేశంలో ఆ అధిష్ఠానం రాహుల్, సోనియా కావచ్చు. అంటేహైకమాండ్ కంటె ఎక్కువగా హయ్యస్ట్ కమాండ్ అన్న మాట. అయితే ఆ హయ్యస్ట్ కమాండ్ ఆలోచన ఏమిటన్నది ఇంకా అస్పష్టంగానే ఉన్నా, కొన్ని ప్రకటనలు మాత్రం కార్యకర్తల్లో అనుమానాలు పెంచుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యే అయిన ఇక్బాల్ హుస్సేన్ ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ రెండు, మూడు నెలల్లో డికె ముఖ్యమంత్రి అవుతారని బహిరంగంగానే ఓ ప్రకటన చేయడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దానికి కొందరు చిలవలు పలవలుఅల్లేసరికి సిఎం సిద్దరామయ్య స్వయంగా స్పందించి' అయిదేళ్లు అధికారంలో నేనే ఉంటా. దానిలో ఎలాంటి మార్పు ఉండదు' అంటూ ఓ ప్రకటన చేశారు. ఆ తర్వాత డికె మరో ప్రకటన చేస్తూ 'సిఎంకు అండగా ఉండడం తప్ప నాకు మరో ఆప్షన్‌లేదు. నేను ఆయనకు మద్దతివ్వాలి. అధిష్ఠానం ఏం చెప్తే అది చేయాలి కదా!' అన్నారు. మామూలుగా అయితే వివాదానికిఅక్కడితో ఫుల్ స్టాప్ పడాలి. కానీ' ముఖ్యమంత్రి కావాలనే కోరిక నాలో ఇంకాఉంది. అది ఎప్పటికి తీరుతుందో' అని డికె మరో ప్రకటన కూడాచేశారు. 'ప్రయత్నాలు ఇంకా ఫలించకపోయినా తాను బలంగా కోరుకున్నదాని కోసం చేసిన ప్రార్థనలకు తగిన సమాధానం దొరకకపోదు' అని కూడా అన్నారు.



సిద్దరామయ్య


అక్కడే మెలికకనిపిస్తోంది. దానితో వివాదానికి మళ్లీ కొత్త చిగుళ్లు వచ్చాయి. నిజానికి సిద్దరామయ్య కంటె డికె కే హయ్యస్ట్ కమాండ్‌వద్ద ఎక్కువ పట్టు ఉందంటారు. అసెంబ్లీలో పార్టీకి గల 150మంది ఎమ్మెల్యేలలో మెజారిటీ మద్దతు కూడా డికె కే ఉన్నదంటున్నారు. కానీ బిసినేతగా సిద్దరామయ్యకు ఒక వర్గం ప్రజల్లో ఆదరణ బాగా ఉంది. అందుకే అధిష్ఠానం ఆయనను కొనసాగిస్తోంది. ఎన్నికలు జరిగిన తర్వాత గత రెండున్నరేళ్లలో సిద్దరామయ్య గ్రాఫ్‌నిజానికి పడిపోయిందనే చెప్పాలి. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలే అందుకు కారణం. ముఖ్యంగా ముడా స్కాం, వాల్మీకి స్కాంలు ఆయన ఇమేజ్‌ను బాగా తగ్గించాయి. మైసూరు అర్బన్‌డెవలప్మెంట్ అథారిటీ సిద్ద రామయ్య భార్యకు 14 ప్లాట్లు కేటాయించిన వివాదం హైకోర్టు దాకా వెళ్లి ఇడి, లోకాయుక్త విచారణలతో అనేక మలుపులుతిరిగి సిద్దరామయ్య మెడకు గట్టిగా బిగుసు కొంది. రూ.400కోట్ల కుంభకోణం అది. దానికి తోడు రూ.200 కోట్ల వాల్మీకి స్కాంలో కూడా ముఖ్యమంత్రి చిక్కుకొన్నారు. దానిపై కూడా సిఐడి, ఇడి విచారణలు సాగుతున్నాయి. టిఎ, డిఎ బిల్లులస్కాం కూడా ఆయన మెడకే చుట్టుకొంది. తాజాగా చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటన బాధ్యత కూడా ఆయన ఖాతాలోనే పడేట్లు కనిపిస్తోంది. 'నేను పూర్తిగా ఐదేళ్లు పదవిలో ఉంటా' అని సిద్దరామయ్య గట్టిగానే అంటున్నా, దాని వెనుక కొంత బెదురు కూడా కనిపిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్ని కల సమయంలోనే డికె రొటేషన్ షరతు పెట్టా రనీ, దానికి అధిష్ఠానం అప్పట్లోనే సమ్మతించిం దనీ అందువల్ల మార్పు తప్పదనీ ఒక వర్గం గట్టిగా చెబుతోంది. కానీ అది తప్పనిసరికాదనీ, రొటేషన్ ఫార్ములా అంటూ ఏదీలేదనీ మరోవర్గం వాదిస్తోంది. కానీ అనిశ్చితి మాత్రం కొనసాగుతోంది. ఇటువంటి అనిశ్చితి ఉంటే పాలన సమర్థంగా సాగుతుందా? అనే అనుమానం కూడా అందరిలో ఉంది. వాల్మీకి కార్పొరేషన్‌కు చెందినదాదాపు రూ.200 కోట్లు పక్కదారి పట్టాయనీ, ముఖ్యమంత్రి సన్నిహితులు కొందరికి దానిలో భాగం ఉందనీ ఆరోపణలు ఉండడంతో దర్యాప్తు జరుపుతున్న సిబిఐ ఎప్పుడుఎటువంటి చర్య తీసుకొంటుందో అనే అనుమానం కూడాఉంది. ఎన్నికలకు ఇంకా రెండున్నర సంవత్సరాల వ్యవధి ఉన్నందున తొందరపాటు ప్రకటనలు చేయొద్దంటూ నేతలను పార్టీ అధ్యక్షుడు కూడా అయిన డికె హెచ్చరించారు. అయితే ఎన్నికల సమయానికి డికె ముఖ్యమంత్రిగా ఉంటేనే పార్టీ విజయావకాశాలు మెరుగుపడతాయనీ, లేకుంటే చీలికలు తప్పవనీ పలువురు భావిస్తున్నారు. అధి ష్ఠానం వద్దనేగాక పార్టీ కార్యకర్తల్లో కూడా డికెకు మంచి పట్టు ఉన్నదనీ, పార్టీ మరోసారి అధికారంలోకి రావాలనుకుంటే మాత్రం నాయకత్వ మార్పు చేయక తప్పదనీ వారుఅంటున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సూర్జేవాలా గతవారం బెంగళూ రులో ఉండి నాయకుల అభి ప్రాయాలను సేకరించారనీ, ఆయన ఇచ్చే నివేది కపై రాజకీయ మార్పులు ఆధారపడి ఉంటా యనీ తెలుస్తోంది. ఏదిఏమైనా సిద్దరామయ్య పరిస్థితి మాత్రంగందరగోళంగానే ఉన్నట్లనిపిస్తోంది. హయ్యస్ట్ కమాండ్ ఏం నిర్ణయం తీసుకొంటుందో చూడాలి. ●

# బిలియనీర్ల కోసమేనా 'బ్యూటిఫుల్' బిల్లు!

అమెరికా

**గన్ని మోహన్**

అమెరికా భవిష్యత్తును నిర్దేశించే బిల్లుగా చెపుతున్న బిగ్ బ్యూటిఫుల్ బిల్లును చట్టరూపంలోకి తెచ్చేందుకు అధ్యక్షుడుడొనాల్డ్‌ట్రంప్ సంతకం చేసారు. అదికూడా అమెరికా ఆవిర్భావ దినోత్సవం రోజునే కావడం విశేషం. లక్షలకోట్ల డాలర్ల విలువైన ఈ బిల్లులో ప్రత్యేకించి సంపన్నులకు ఎంతో ఊరట నిచ్చి సామాన్య మధ్య తరగతిని ప్రభుత్వ ఫలాలకు దూరం చేస్తున్నారన్న విమర్శలు వచ్చినా అమెరికా గ్రేట్ ఎగైన్, అమెరికా గెలిచింది. గతంలో ఎన్నడూలేనంత విజయం సాధించామంటూ ట్రంప్ బిల్లును చట్టరూపంలోకి తెచ్చారు. 900 పేజీలు ఉన్న ఈబిల్లును ఆమోదింప చేసుకునేందుకు సెనేట్, రిపబ్లికన్లను సముదాయించేందుకు ఉభయ సభల అధిపతులు కష్టపడ్డారు. ప్రత్యే కించి ప్రతినిధుల సభ స్పీకర్ జాన్సన్ కృషి కీలకం అయిందనే చెప్పాలి. సంపన్నులకు ప్రయోజనం కల్పించే విధంగా పన్ను తగ్గింపులు వయో వృద్ధులకు ఇచ్చే 6వేల డాలర్ల తగ్గింపు వంటివి విమర్శలు పాలవుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా మెడికెయిడ్ ప్రయోజనాల్లో కోత విధించడం వల్ల ఇప్పుడు అమెరికాలో సుమారు 12 మిలియన్ల పౌరులు ఆరోగ్యబీమాను పొంద లేని స్థితికి వచ్చారు. అమెరికాలో సుమారుగా ఉన్న 17 మిలియన్ల వేతన జీవుల నుంచి దోపిడీ చేసి ట్రంప్ సంపన్నులు, కార్పొరేట్లకు ప్రయోజనాలు కల్పిస్తున్నారని ఆర్థికరంగ నిపుణుల వాదనలు కూడా ట్రంప్ లెక్క చేయలేదు. ఇక ప్రభుత్వ స్థానిక సంస్థల పన్నులు తగ్గింపు లను అంటే 'సాల్ట్' పిలిచే వీటిని మూడురెట్లు పెంచారు. ఐదేళ్లకాలంలో 40 వేల డాలర్లకు పెరిగాయి. వ్యాపార వేత్తలకు నూరుశాతం ఊరటనిచ్చే విధంగా కొన్నింటిని రద్దుచేసారు. ఇక సంపన్న కుటుంబాలకు మేలు జరుగుతుంటే అల్పాదాయ వర్గాలకు మాత్రం ఏడాదికి 1600 డాలర్లు అధికభారం మోసే పరిస్థితి వస్తోంది. మెడికెయిడ్, ఫుడ్‌ఎయిడ్‌లలో కోత విధించడమే ఇందుకు కారణం. మెడికెయిడ్, పౌష్టికాహార ప్రయోజనాల పరంగానే ట్రంప్ తన కొత్త చట్టం ద్వారా 1.2 లక్షలకోట్ల డాలర్లు కోతవేసారు. ఇక ప్రత్యేకించి వలసలను నివారించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ ఈ బిల్లుద్వారా 350 బిలియన్ డాలర్లు సరిహద్దు, జాతీయ భద్రత అజెండా కోసం కేటాయిస్తున్నారు. అమెరికా మెక్సికో సరిహద్దులో లక్షమంది వలస జీవులడిటెన్షన్ కేంద్రం ఏర్పాటుచేసేందుకు బిల్లులో నిధులు ప్రతిపాదించారు. సరైన పత్రాలు లేని వారందరినీ 'అక్రమ గ్రహాంతరవాసులు' అని చెప్పిన ట్రంప్ వీటిని కట్టడిచేసేందుకు అదనపు అధికారులకు అనుమతించారు. పదివేల మంది కొత్తవారు వస్తారు. సరిహద్దు గస్తీ అధికారులకు పదివేల డాలర్లు బోనస్‌లు కూడా ప్రకటించారు. ఈ బిల్లును చట్టరూపం లోకి తీసుకురావడానికి ప్రధాన కారణం కూడా అమెరికా నుంచి ప్రతి ఏటా పది లక్షలమంది వీసాపత్రాలు లేనివారిని వారి స్వదేశాలకు పంపించేయాలన్న ప్రధాన లక్ష్యం ఉంది.



ట్రంప్


ఇందుకోసం వలసజీవులు కొత్త రుసుంలు కూడా చెల్లించాల్సి ఉంటుంది. శరణార్థులుగా ఉండాలనుకుంటే వారు రక్షణకోసం కూడా ఫీజులు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇక రక్షణ వ్యవస్థ పెంటగాన్‌కు నౌకానిర్మాణం, ఆయుధ వ్యవస్థలకు బిలియన్లకొద్దీ డాలర్లు కేటాయించింది. రక్షణ రంగంలోన్న సిబ్బంది జీవనశైలి మెరుగు పరిచేందుకు అదనపు నిధులు అవసరమని ఈ బిల్లు ద్వారా ట్రంప్ తేల్చిచెప్పారు. కేవలం సరిహద్దు భద్రతకే ఈ బిల్లుద్వారా రక్షణ విభాగానికి 100 కోట్ల డాలర్లు నిధులు అందుతాయి. ఇక 2029 నాటికి పూర్తిచేసేవిధంగా ఇజ్రాయల్ ఐరన్‌డోమ్ తరహాలో అమెరికాలో 175 బిలియన్ డాలర్ల వ్యయంతో గోల్డెన్‌డోమ్ క్షిపణి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తొలివిడతగా 25 బిలియన్ డాలర్లు ఈ బిల్లులో కేటాయించారు. అమెరికా ప్రయోజనాల కోసమే అని చెపుతున్న ఈ బూటిఫుల్ బిల్లులో నిరుపేదలకు అందే సాయంపై కోత విధించడం తీవ్ర విమర్శలకు కారణమయింది. గర్భిణీలు, వికలాంగులు, చిన్నారులకు అందించే ఈ సాయం వృథా అని మోసం అని దుర్వినియోగం అవుతున్నదని పేర్కొనడం డెమొక్రాట్లకు ఆగ్రహం రప్పించింది. నెలకు 80 గంటల పని విధానంలో 65 ఏళ్లపైబడినవారు, 14 ఏళ్లకు పైబడిన పిల్లలున్న వారు కూడా ఈ బిల్లులో నిబంధనలకు అర్హులై ఉండాలి. ముఖ్యంగా మెడికెయిడ్ పొందే పౌరులు ఇప్పుడు 35 డాలర్లు అదనపు చెల్లింపులు భరించాలి. అమెరికాలో 7.1 కోట్లమంది మెడికెయిడ్‌పై ఆధారపడి ఉన్నారు. 40 మిలియన్ల మంది పౌష్టికాహార పథకం కింద సాయం పొందుతున్నారు. ఇప్పుడు ఈ బిల్లులో వీటన్నింటిపైనా కోత విధించడం, అమెరికా గ్రేట్ అగైన్ అంటూ ట్రంప్ పేర్కొంటుండటం డెమొక్రాట్లు, విభిన్న రంగాల మేధావులు, నిపుణులకు ఎంత మాత్రం రుచించడంలేదు. వచ్చే మధ్యంతర ఎన్నికల్లో తమ విజయానికి ఇదే తొలిమెట్టు అని భావిస్తున్న డెమొక్రాట్లు ఈ బిల్లును వ్యతిరేకించేందుకు శతవిధాల ప్రయత్నించినా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం చట్టరూపంలోకి తెచ్చేంతవరకూ విశ్రమించలేదు. తన అనుంగు మిత్రుడు తన విజయానికి కీలక పాత్రపోషించిన ఎలాన్ మస్క్ దూరం అయినా సరే లెక్క చేయలేదు. ఈ బిల్లు అమెరికాను మళ్లీ అంధకారంలోకి నెట్టివేస్తుందని, తాను కొత్తపార్టీతో వస్తానని చెప్పిన మస్క్‌ను సైతం ట్రంప్ హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న అన్ని సబ్సిడీలు, రాయితీలు కట్ చేస్తామని చెప్పిన ట్రంప్ చిరవకు మస్క్‌ను కూడా నోరు మూయించగలిగారు. మొత్తంగా చూస్తే అక్రమ వలసలను కట్టడి చేయడం, అసలు వలస జీవులు లేని దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా స్వతహాగా సంపన్నుడయిన ట్రంప్ తన బిల్లు ద్వారా సంపన్నులకే రాయితీలు అన్నీ కట్టబెట్టారన్న విమర్శలు కూడా ఇప్పుడు మోయక తప్పదు. ●

# అవినీతి ప్రవాహం అభివృద్ధికి అవరోధం



సుంకవల్లి సత్తిరాజు

అవినీతి ఈ ప్రపంచానికి ఒక శాపంగా పరిణమించింది. కొంతమంది సంపద అనూహ్యంగా పెరిగిపోతుంటే, మరికొంత మంది తినడానికి తిండి లేక కనీస వసతి సదుపాయాలు లేక అల మటిస్తున్నారు. అగ్రరాజ్యాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ప్రజల మధ్య పెరుగుతున్న ఆర్థిక అంతరాల గురించి కూలంకషంగా అధ్యయనం చేసి, ప్రజలందరికీ ఆర్థిక ఫలాలు అందించడానికి కృషి చేయాలి. ఆర్థిక అంతరాలు తగ్గించడానికి ప్రయత్నాలు చేపట్టకపోతే భవిష్యత్తులోఅనేక అవాంఛనీయ పరిణామాలు సంభవించే అవకాశాలను తోసిపుచ్చలేం. అడ్డదిడ్డంగా సంపాదిస్తున్న అవినీతి సంపదవలన ప్రజలందరికీ సమన్యాయం జరగడం లేదు. మనం గొప్పగా చెప్పుకుంటున్న దేశాల్లో కూడా అవినీతి కొనసాగుతుంది. ఆయా ప్రభుత్వ విధానాలు, సంస్కరణల వలన చాలామంది వ్యక్తులు ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. బ్లాక్‌మనీ కూడా వైట్ మనీగా మార్చే ప్రక్రియలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భారతదేశం గతంలో కంటే ఆర్థికంగా బలోపేతమవుతున్నా, ఆ ఆర్థిక ఫలాలు కూడా ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రభుత్వాలు ప్రజల బాగోగుల కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నమాట వాస్తవం. ఇదే సందర్భంలో దేశంలోని ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుదల ఆశాజనకం లేదు. అరకొర ఆదాయంతో జీవితాలను నెట్టుకొచ్చే పరిస్థితులు నెలకొంటున్నాయి. నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు, పిల్లల చదువులు మోయలేని భారంగా మారిపోతున్నాయి. రోగమొస్తే ఆసుపత్రుల ఖర్చులు భరించలేక ఉన్న ఆస్తులు అమ్ముకునే దుస్థితి ఏర్పడింది. చాలా దేశాల్లో ప్రజల జీవన ప్రమాణాలు అత్యంత దారుణంగా పడిపోయాయి. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి, 78 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా పేదరికం తాండవించడం, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులోఉన్నా, వాటిని అందుకునే ఆర్థిక స్థోమత లేకపోవడం బాధాకరం. ప్రజలకిస్తున్న సంక్షేమ, ఉచిత పథకాల వలన శాశ్వత ప్రయోజనం సిద్ధించదు. దీర్ఘకాల ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వాలు పాటుబడాలి. పెరుగుతున్న అవినీతిని అరికట్టాలి. ఎన్నికల్లో విచ్చలవిడిగా అభ్యర్థులు పెడుతున్న ఖర్చు ఎక్కడిది? దీనివల్ల అంతిమంగా అవినీతి జరగదా? ప్రజలు ఆర్థికంగా నష్టపోరా? అవినీతి వివిధ రూపాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్నది. కేసులు, దర్యాప్తులు, జైలుశిక్షలు వంటి చర్యల వలన ప్రజల సంపద తిరిగి ప్రభుత్వానికి చేరుతున్నదా? భారత దేశంతో సహా పలు ప్రపంచదేశాల్లోని ప్రజలు పెరుగుతున్న అవినీతి వలన అనేక కష్టాలను అనుభవిస్తున్నారు. అవినీతిని అంతం చేయకుండా ఆర్థిక ప్రగతి సాధ్యపడదు. సంపద కేవలం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం వలన ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు ఆర్థిక మాంద్యంలో కూడా బలపడుతున్నాయి. అయితే ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో పెద్దగా మార్పులేమీ చోటుచేసుకోకపోవడం విడ్డూరం. అమెరికా 30.51 ట్రిలియన్ల డాలర్ల స్థూలజాతీయోత్పత్తితో ప్రపంచంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా వెలుగొందుతున్నది. ఇంతగా అభివృద్ధి చెందిన దేశం ఇతర దేశాలను భయపెట్టి ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంలో గల మతలబు ఏమిటి? రష్యాతో స్నేహం చేయవద్దని, రష్యా ఆయుధాలు కొనవద్దని భారత్ లాంటి దేశాలకు హుకుం జారీ చేయడం అమెరికా ఆర్థిక వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెడుతున్నది. ట్రంప్ ప్రతిపాదిత 'బిగ్ బ్యూటీఫుల్ బిల్లు' అమెరికా ఆర్థిక దివాళా కోరుతనాన్ని సూచిస్తున్నది. ఇక చైనా విషయానికొస్తే కొన్ని ఆశ్చర్యకరమైన నిజాలు వెలువడతాయి. చైనా 19.23 ట్రిలియన్ల డాలర్లతో ప్రపంచంలో రెండవ ఆర్థిక అగ్రగామి దేశంగా ఉంది. అయితే అక్కడ కూడా అవినీతి చోటుచేసుకుంటున్న దాఖలాలు కనబడుతున్నాయి. జీ జిన్ పింగ్ విధానాలే చైనా ఆర్థిక పతనానికి కారణమనే ఉద్దేశ్యంతో జిన్ పింగ్‌ను



అధ్యక్ష పదవిని తప్పిస్తారనే వార్తలు వెలువడుతున్నాయి. చైనా తర్వాత ఆర్థికంగా జర్మనీ మెరుగైన స్థితిలోఉంది. జర్మనీ 4.74 ట్రిలియన్ డాలర్లతో, ఇండియా 4.187, జపాన్ 4.186 ట్రిలియన్ డాలర్ల జిడిపితో అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్నట్లు ఐ.ఎమ్.ఎఫ్ గణాంకాలు సూచిస్తున్నాయి. యు.కె, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్ లాంటి దేశాలు ఈ దేశాల తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచంలో బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నది. ఇందులో ఎలాన్ మస్క్, మార్క్ జూకర్ బర్గ్, జెఫ్ బెజోస్, లారీ ఎల్లీసన్, వారెన్ బఫెట్, బెర్నార్డ్ అర్నాల్ట్, బిల్ గేట్స్ వంటి కుబేరుల వద్ద వందల కొద్దీ బిలియన్లు మూలుగుతున్నాయి. ఎక్కువ మంది బిలియనీర్లున్న దేశంగా అమెరికా పేరొందింది. ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ, సావిత్రి జిందాల్, శివనాదార్ వంటి భారతీయ కుబేరుల వద్ద బిలియన్ల కొద్దీ సంపద ఉంది. సుమారు 900 మంది బిలియనీర్ల చేతుల్లో అమెరికా సంపద దాగిఉంది. చైనా, హాంకాంగ్‌లు సుమారు 500లకు పైగా, ఇండియా 200లకు పైగా కుబేరులతో తులతూగుతున్నది. అమెరికాలో కేవలం 10 శాతం మంది చేతుల్లోనే అధికశాతం సంపద కేంద్రీకృతమై ఉంది. భారతదేశంలో కుబేరులంతా తమ తమ వ్యాపారాలతో, తెలివి తేటలతో దేశ సంపదను పెంచుకుంటున్నారా? వీరంతా తమకున్న సంపదతో దేశంలోకొద్ది శాతం మందికి ఉపాధి కలిగించవచ్చు. దేశ ఆర్థికవ్యవస్థ బలపడడానికి కొంతమేరకు తోడ్పడి ఉండవచ్చునేమో కాని దేశ ఆదాయం అందరికీ ఉపకరించకపోవడం బాధాకరం. మన దేశంలో 26శాతం మందికిపైగా ప్రజలు ఇంకా దారిద్ర్య రేఖకు దిగువనున్నారు. 5శాతం మంది ప్రజలు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నట్టు కొన్ని అధ్యయనాల వలన తేటతెల్లమవుతున్నది. ఆర్థిక ఫలాలు అందరికీ అందాలి. అవినీతి జాడ్యం మహమ్మారిలా విస్తరించడం ప్రజలకు దీర్ఘకాలంలో శాపంలా పరిణమించనున్నది. అవినీతి ఆర్థిక అంతరాలకు మూలం. అవినీతి తిమింగాలు అడుగడుగునా అగుపిస్తున్నాయి. చిన్న చేపలు గేలానికి చిక్కుతున్నాయి. కోట్లాది సంపదను కూడబెట్టుకున్నవారు పెద్ద మనుషుల్లా చెలామణి అవుతున్నారు. పెద్ద పెద్ద ఆర్థిక నేరస్తులను వదిలేసి, చిన్నచిన్న ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్న వారిని శిక్షించడంలో గల ఔచిత్యమేమిటో అవగతం కావడంలేదు. న్యాయస్థానాల్లో ఏళ్ళతరబడి కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. విచారణ నత్తనడక సాగుతున్నది. ఆర్థిక నేరస్తుల దగ్గర మూలుగుతున్న ధనరాశులు తిరిగి ప్రభుత్వానికి చేరే మార్గం కనపడడం లేదు. స్కాముల డొంక కదులుతున్నా, శిక్షలు పడడంలో జాప్యం జరుగుతున్నది. ఇదే ఆర్థిక నేరస్తులకు వరంగా మారింది. తప్పు చిన్నదైనా, పెద్దదైనా నేరమే. కాని పెద్దపెద్ద ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిని శిక్షించడంలో ఆలస్యం తగదు. త్వరితగతిన కేసుల విచారణ జరగాలి. ఆర్థిక నేరాల సత్వర విచారణకు ఉన్నత న్యాయస్థానం ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటుచేయాలి. అవినీతి అత్యంత ప్రమాదకరం. అవినీతికి శిక్షలు పడకపోతే ప్రజలే అంతిమ బాధితులుగా మిగిలిపోతారు. ప్రజల ధనాన్ని అవినీతి మార్గాల ద్వారా మళ్ళించి తమ సొంతసంపాదనగా మార్చడం అత్యంత దారుణం. 21వ శతాబ్ధంలో కూడా ఇంకా కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఆర్థిక అంతరాలు అంబరాన్నంటుతున్నాయి. అవినీతి పెరుగుదల ఆర్థిక ప్రగతి కాబోదు. ప్రజలంతా బాగుండాలంటే వారి బ్రతుకులు బాగుపడాలి. వారి జీవన ప్రమాణాలస్థాయి పెరగాలి. ప్రజల వాస్తవ తలసరిఆదాయం పెరగాలి. ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. ధనిక దేశాలు బీద దేశాలను వాటి ఆర్థిక అవసరాల మాటున భయపెట్టి లొంగదీసుకోవడం వంటి చర్యల వలన ప్రపంచంలో అశాంతి తలెత్తుతుంది. దేశాల మధ్య, ప్రజలమధ్య హద్దులు లేకుండా పెరిగిపోతున్న ఆర్థిక అంతరాల వలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తున్నాయి. కుల, మత విబేధాల కంటే ఆర్థిక అంతరాలే అత్యంత ప్రమాదకరం. శ్రమ వలన సంపద పెరుగుతుంది. న్యాయబద్ధమైన సంపాదనతో ఉన్నత శిఖరాలకు ఎదగడం హర్షించదగ్గ పరిణామమే. ఆర్థిక అసమానతలు ఈనాటివికావు. శతాబ్దాల తరబడి విశ్వవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ అసహజ ప్రక్రియకు మూలకారణం అవినీతి. సామాన్యప్రజల ఆర్థిక పునాదులు పటిష్ఠమయ్యే తరుణమెప్పుడు? ఆర్థిక అంతరాలను కనీసస్థాయికి తగ్గించాలి. ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులు ఏర్పడాలి. అప్పుడే దేశం వాస్తవంగా ఆర్థికంగా బలోపేతం కాగలదు. ●

# ఒకే వేదికపైకి ఠాకరే బ్రదర్స్

**రెండుదశాబ్దాల తర్వాత చేతులు కలిపిన సోదరులు**

**త్రిభాషా విధానాన్ని రాష్ట్రంలో రద్దు చేయడం పట్ల హర్షం**



**ముంబయి, జూలై 5:** శివసేన యూబీటీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే రాజకీయ వేదికపైకి చేరుకున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేస్తూ తెచ్చిన త్రిభాషా విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ముంబయిలో నిర్వహించిన మెగా విజయోత్సవ సభలో ఇరువురు నేతలు పాల్గొన్నారు. మరాఠీ తమ హక్కు అని ఇరువురు నేతలు ఉద్ఘాటించారు. మహాయుతి సర్కారు రాష్ట్రంలో హిందీ భాషను అమలు చేయిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఈ సభను ఇరుపార్టీలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. కలిసి ముందుకు సాగేందుకే తన సోదరుడు రాజ్ ఠాక్రేతో తాను కలిసిపోయామని శివసేన (ఉద్ధవ్) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఇప్పుడు అందరి చూపు తమ ఇద్దరు సోదరులపైనే ఉందని, ప్రతి ఒక్కరు తమ ప్రసంగాల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ సభను తాము ప్రకటించినప్పటి నుంచి ప్రతీ ఒక్కరు ఆతుర్తగా రాజ్‌ఠాక్రే ప్రసంగం కోసం ఎదురు చూస్తున్నారని ఉద్ధవ్ చెప్పుకొచ్చారు. రాజ్ గొప్ప వక్త అని, ఆయన ప్రసంగాలు అమోఘంగా ఉంటాయని కితాబిచ్చారు. అందుకే తాను ఇక మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. తన దృష్టిలో తమ ఇద్దరి ప్రసంగాల కంటే ఈ సభే చాలా ముఖ్యమైందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంబయికి, మహారాష్ట్రకు ఏం చేశాయని ఉద్ధవ్ ప్రశ్నించారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ద్వారా శివసేన (ఉద్ధవ్) చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అందరికీ తెలుసన్నారు. ముంబయిలోని ప్రముఖ పరిశ్రమలను సైలెంట్‌గా గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర వెన్ను విరిచే ప్రణాళికలో భాగంగానే ఇలాంటివన్నీ చేస్తున్నారని ఉద్ధవ్ మండిపడ్డారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కోసం ఏం చేశారని తమను ప్రశ్నించే వాళ్లు, మహారాష్ట్రలోని ముఖ్య పరిశ్రమలు గుజరాత్‌కు ఎందుకు తరలిపోతున్నాయి అనే దానికి బదులివ్వాలన్నారు. మహాయుతి ప్రభుత్వం వైఫల్యం వల్లే మహారాష్ట్రలోని డైమండ్ వ్యాపారమంతా గుజరాత్‌కు తరలిపోయిందని ఆయన ధ్వజమెత్తారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌పై ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే ఫైర్ అయ్యారు. తమ ఇద్దరు సోదరులను కలపడం బాలాసాహెబ్ ఠాక్రే వల్ల కూడా కాలేదని, ఫడ్నవిస్ సర్కారు చేష్టల వల్ల తమ మధ్య దూరం తొలగిపోయిందన్నారు. మహారాష్ట్రలో హిందీ భాషను తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయంపై తాను రాష్ట్ర మంత్రి దాదా భూసేను నిలదీశానని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్‌లో మూడో భాషగా ఏమున్నదని ఆయన్ను ప్రశ్నించినట్లు రాజ్ ఠాక్రే చెప్పారు. హిందీ పాలిత రాష్ట్రాల్లోనే లేని రూల్‌ను మహారాష్ట్రలో బలవంతంగా ఎందుకు అమల్లోకి తెచ్చారని దాదా భూసేను ప్రశ్నించినట్లు తెలిపారు. అయితే తాను హిందీ వ్యతిరేకిని కాదని, ఏ భాషనూ వ్యతిరేకించనని తేల్చి చెప్పారు. మరాఠా సామ్రాజ్యం చాలా ప్రాంతాలను పాలించినా, ఎన్నడూ ఆయాచోట్ల మరాఠీని బలవంతంగా రుద్దలేదన్నారు. కానీ హిందీని బలవంతంగా రుద్దే ప్రక్రియను మహారాష్ట్రలోనే ప్రయోగాత్మకంగా మొదలుపెట్టాలని కనిపిస్తోందని రాజ్ ఠాక్రే విమర్శించారు. దీన్ని మహారాష్ట్ర ప్రజలు వ్యతిరేకించకుంటే, ముంబయి నగరాన్ని రాష్ట్రం నుంచి వేరు చేసేందుకు వెనుకాడరని మండిపడ్డారు. మా పిల్లలు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చదువుకున్నారు. అయితే ఏంటి? మరాఠీ మీడియం స్కూళ్లలో చదువుకున్న దాదా భూసే మంత్రి అయ్యారు. ఇంగ్లిష్ మీడియంలో చదివిన ఫడ్నవిస్ సీఎం అయ్యారు. అయితే ఏంటి? నేను మరాఠీ మీడియం స్కూలులో చదివాను. బాలాసాహెబ్ ఠాక్రే, మా నాన్న శ్రీకాంత్ ఠాక్రేలు ఇంగ్లిష్ మీడియంలో చదివారు. వాళ్లందరికి మరాఠీ భాషపై ఉన్న ప్రేమను ఎవరైనా ప్రశ్నించగలరా? రేపు నేను హిబ్రూ భాషను కూడా నేర్చుకుంటాను. అలా చేసినంత మాత్రాన నాకు మరాఠీపై ఉన్న ప్రేమను ఎవరైనా ప్రశ్నిస్తారా? మహారాష్ట్రలో ఉండే గుజరాతీలైనా, ఎవరైనా సరే మరాఠీ తెలిసిన వారై ఉండాలి. అయితే మరాఠీ భాషలో మాట్లాడనంత మాత్రాన వారిని కొట్టాల్సిన అవసరం లేదు. ఎవరైనా అనవసర డ్రామాలు చేస్తే మాత్రం మీరు గూబలు గుయ్యమనేలా కొట్టండి. దాని వీడియోలు తీయకండి. బాధిత వ్యక్తే అందరికీ చెప్పుకోనివ్వండని ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, ఈ సభ ప్రారంభం కావడానికి ముందు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఉద్ధవ్, రాజ్ సోదరులు పూలమాల వేశారు. ఈసందర్భంగా ఇద్దరు సోదరులు ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.

## ప్రజల సేవలో మరో 40 యేళ్లు జీవిస్తే చాలు



**కొనసాగుతున్న వారసుని ఎంపిక ప్రక్రియ: దలైలామా**

**న్యూఢిల్లీ, జూలై 5:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జూలై 6న తన 90వపుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులో భాగంగా టిబెట్ టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తూ మరో 30,40 ఏళ్లు జీవించాలని ఉందని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలనని దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి క్షేమంగా లేకుండా కృషి చేస్తున్నానని.. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడారు తాను 110 ఏళ్ల జీవిస్తానని ఒక కల వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధ మత అత్యున్నత గురువారం దలైలామా తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24న తాను టిబెట్ బౌద్ధమత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి తన వారసుడి ఎంపిక కొనసాగించాలా? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. ఇందుకు అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు. కాగా టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విషప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్టు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగవచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమ దేనని తేల్చిచెప్పారు.

## టిబెట్ సరిహద్దుల్లోకి చైనా మానవరహిత ఆయుధాలు!



**బీజింగ్,జూలై 5:** చైనా మరో స్కెచ్ సరిహద్దుల వద్ద మాన్‌స్టర్స్ చైనా అన్ మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్స్ (యుజివి)లను పెద్ద సంఖ్యలో తయారు చేస్తోంది. వీటిని ఎక్కడినుంచైనా ఆపరేట్ చేయొచ్చు. వీటి కోసం జవాన్లు యుద్ధ భూమిలోకి దిగాల్సి న అవసరం లేదు. అలాగేసరిహద్దులవద్ద రోబో మాన్‌స్టర్స్‌ను కూడా ఏర్పాటుచేస్తోంది. ప్రపంచం మొత్తం ఒక తీరు మాదొక తీరు అనే చైనా టెక్నాలజీ పరంగా మాత్రం టాప్‌లో ఉంది. కొత్త కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేస్తూ దేవుడి సృష్టికి ప్రతి సృష్టి చేస్తోంది. టెక్నాలజీని ఉపయోగించి ఆర్మీని మరింత పటిష్టం చేస్తోంది. చైనా ఏ దేశంపైనా నేరుగా యుద్ధానికి దిగకపోయినా, యుద్ధానికి మాత్రం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. పరోక్ష యుద్ధానికి అవసరమైన సన్నాహాలు చేసుకుంటూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తమ సైనికులను యుద్ధానికి పంపకుండా మిషిన్లతోటే యుద్ధం చేయడానికి చూస్తోంది. ఇందుకోసం అన్ మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్స్ (యుజివి)లను పెద్ద సంఖ్యలో తయారు చేస్తోంది. వీటిని ఎక్కడినుంచైనా ఆపరేట్ చేయొచ్చు. వీటి కోసం జవాన్లు యుద్ధ భూమిలోకి దిగాల్సి న అవసరం లేదు. చైనా ప్రస్తుతం యూజీవీలపై పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. హిమాలయాల్లో పట్టు సాధించటం కోసం వీటిని ఉపయోగించాలని చూస్తోంది. మనుషులు వెళ్లలేని చోటుకు కూడా యూజీవీలు వెళ్లగలవు. జవాన్ల కంటే వేగంగా కదలగలవు. చైనా ఇప్పటికే చాలా యూజీవీలను తయారు చేసింది. యూజీవీలలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి షార్ప్ క్లా, రెండోది షార్ప్ క్లా 2. షార్ప్ క్లా 120 కేజీల బరువు ఉంటుంది. ఆరు కిలోమీటర్ల రేంజ్ వరకు వీటిని ఆపరేట్ చేయవచ్చు. కొండలపైకి కూడా ఎక్కగలవు. వీటిలో మిషిన్ గన్స్ ఉంటాయి. కెమెరాల ద్వారా అన్నిటిని చూడగలదు. షార్ప్ క్లా 2 గుహల్ని, బంకర్లను, బిల్డింగులను ధ్వంసం చేయగలదు. చైనా నాలుగు కాళ్ల రోబో కుక్కలు, తోడేళ్లను కూడా తయారు చేసింది. అయితే, వాటిని మాత్రం యుద్ధ భూమిలోకి తీసుకురాలేదు. చైనా తమ యూజీవీలను టిబెట్ సరిహద్దుల దగ్గరకు చేర్చినట్లు తెలుస్తోంది. ఇదే ఇపుడు భారత్‌ను కలవరపెడుతోంది. హిమాలయాల్లో భారత జవాన్లు చైనా యూజీవీలతో పోరాటం చేస్తే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. చైనా గోతి కాడ నక్కలాగ సరైన అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంది.

## యుపిలో ఘోర ప్రమాదం: 8 మంది మృతి, ఇద్దరికి సీరియస్

### పెళ్లి వేడుకకు వెళ్తున్న ఇంట్లో పెనువిషాదం




**సంభాల్,(యూపి),జూలై 5:** పెళ్లి వేడుకకు వెళ్తున్న ఆ ఇంట్లో పెను విషాదం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పెళ్లికొడుకు, ఇద్దరు చిన్నారులు సహా ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనతో పెళ్లి జరగాల్సి న ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. హర్‌గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన సుఖ్‌రామ్ తన కుమారుడు సూరజ్ పాల్ (20)వివాహాన్ని బదౌన్ జిల్లాలోని సిర్సౌల్ గ్రామానికి చెందిన యువతితో నిశ్చయించారు. నిన్న సాయంత్రం పెళ్లి బృందంతో కలిసి దాదాపు 11 వాహనాలు బయలుదేరాయి. కాగా, వరుడు సూరజ్‌తో పాటు మరో తొమ్మిది మంది ప్రయాణిస్తున్న మహీంద్రా బొలెరో వాహనం కాస్త వెనుకబడింది. మీరట్‌బదౌన్ జాతీయ రహదారిపై జునావాయి పట్టణం సమీపంలోకి రాగానే బొలెరో వాహనం అతివేగంతో అదుపు తప్పి జనతా ఇంటర్ కాలేజీ ప్రహరీని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనం నుజ్జునుజ్జయింది. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో చిక్కుకు పోయిన వారిని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఒక జేసీబీ సహాయంతో వాహనం భాగాలను తొలగించి క్షతగాత్రులను బయటకు తీశారు. వెంటనే వారిని సమీపంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించగా, అప్పటికే ఎనిమిది మంది మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుల్లో వరుడు సూరజ్ పాల్‌తో పాటు రవి (28), ఆశ (26), సచిన్ (22), మధు (20), కోమల్ (15), ఐశ్వర్య (3), గణేష్ (2) ఉన్నారు. తీవ్రంగా గాయపడిన హిమాన్షి, దేవ అనే మరో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం వేరే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లి వేడుకకు బయలు దేరిన వారు మార్గమధ్యంలోనే మృత్యువాత పడటంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## కాక్‌పిట్‌లోనే కుప్పకూలిన పైలట్

**బెంగళూరు, జూలై 5:** ఎయిరిండియా సంస్థకు చెందిన పైలట్ కాక్‌పిట్‌లోనే కుప్పకూలి పోయారు. విమానం బయలుదేరే కొన్ని నిమిషాల ముందే ఆ అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. దీంతో వెంటనే సంబంధింత వర్గాలు మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాయి. శుక్రవారం ఉదయం బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్లే విమానంలో ఘటన జరిగినట్లు తెలిపాయి. అధికారుల సమచారం ప్రకారం, విమాన కాక్‌పిట్‌లోకి పైలట్ వెళ్లాక కొన్ని తప్పనిసరి పేపర్స్‌పై సంతకాలు చేయాల్సి ఉంది. అందులో టెక్ లాగ్ వంటి దస్త్రాలు ఉంటాయి. వాటిపై సంతకాలు చేసిన సమయంలోనే కుప్పకూలిపోయారు. దీంతో విమానంకొద్దిసేపు నిలిచిపోయింది. మరో పైలట్ వచ్చాక ఆ విమానం బయలు దేరింది. అయితే ఈ పరిణామంపై ఎయిరిండియా ప్రకటన చేసింది. జులై 4న ఉదయం తమ పైలట్‌లలో ఒకరికి అత్యవసర వైద్య పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. దీంతో బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్లాల్సి న ఏఐ 2414 విమానాన్ని నడపలేకపోయారని పేర్కొంది. వెంటనే ఆయన్నుస్థానిక ఆసుపత్రికి తరలించామని తెలిపింది. ప్రస్తుతం పైలట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారని పేర్కొంది. ఇలాంటి సమయంలో పైలట్‌కు, ఆయన కుటుంబానికి అండగా నిలబడటమే తమ ప్రాధాన్యమని ఎయిరిండియా తెలిపింది.

## పొలం దున్నిన సిఎం పుష్కర్‌సింగ్ ధామి



**డెహ్రాడూన్, జూలై 5:** నిత్యం అధికారిక సమీక్షలు, సమావేశాలతో తీరిక లేకుండా గడిపే ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, అందుకు భిన్నంగా ఓ కొత్త పాత్రలో కనిపించారు. ఏకంగా రైతు అవతారమెత్తి, పొలంలోకి దిగి అందరినీ ఆశ్చర్యపరిచారు. కాడెద్దులతో నాగలి పట్టి పొలాన్ని దున్ని, స్థానిక రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. వివరాల్లోకి వెళ్తే.. ముఖ్యమంత్రి ధామి తన సొంత పొలంలో సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయ పనులు చేపట్టారు. కాడెద్దులతో నాగలిపట్టి పొలాన్ని దుక్కి దున్నారు. అనంతరం అక్కడున్న స్థానిక రైతులతో కలిసిపోయి ఉత్సాహంగా వరి నాట్లు వేశారు. సీఎం సామాన్యుడిలా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వడంతో ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా వ్యవసాయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. రైతులంతా వరి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో రైతులకు భరోసా కల్పిస్తూ వారిలో ఒకరిగా సీఎం ధామి పొలం పనుల్లో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, మరో వైపు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతుండటం, వరదలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది.

## హమాస్ అంతమే టార్గెట్‌గా ఇజ్రాయెల్ దాడులు



**గాజాసిటీ, జూలై 5:** హమాస్ అంతమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఐడీఎఫ్ జరుపుతున్న ఈ దాడుల్లో అనేక మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా గాజాపై ఇజ్రాయెల్ దళాలు జరిపిన వైమానిక దాడులు, కాల్పుల వల్ల వివిధ ప్రాంతాల్లో తలదాచుకున్న దాదాపు 42 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు గాజా ఆసుపత్రి వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఆహారం కోసం వేచి ఉన్న ప్రజలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినట్లు పేర్కొంది. తాజా దాడుల్లో అనేక మంది గాయపడినట్లు పేర్కొంది. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరోవైపు 60 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనపై వెంటనే చర్చలు ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు హమాస్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌హమాస్ మధ్య యుద్ధం అక్టోబర్ 2023లో ప్రారంభమైన విషయం తెలిసిందే. హమాస్ ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 1200 మందికిపైగా ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రతీకారంలో ఇప్పటివరకు 58 వేలకుపైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో పెద్ద సంఖ్యలో జనాభా నిరాశ్రయులయ్యారు. వేలాదిమంది ఆకలి బాధల ను ఎదుర్కొంటున్నారు. గాజా అంశంలో తమ ప్రతినిధులు ఇజ్రాయెల్‌తో సుదీర్ఘ చర్చలు చేపట్టారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపిన విషయం తెలిసిందే. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, ఆ సమయంలో అన్ని పార్టీలతో కలిసి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తామన్నారు. శాంతి ఒప్పందం కోసం ఖతార్, ఈజిప్ట్ తీవ్రంగా ప్రయత్నించాయని, వాళ్లే దీనికి సంబంధించిన తుది ప్రతిపాదన చేస్తారన్నారు. మిడిల్ ఈస్ట్ మంచి కోసం హమాస్ ఆ ఒప్పందాన్ని అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే, గాజాపై యుద్ధాన్ని పూర్తిగా ఆపేస్తామంటేనే ఒప్పందాన్ని అంగీకరిస్తామని హమాస్ సంస్థ తెలిపింది. గాజాలో 60 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటన వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని వ్యాఖ్యానించారు. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ సంస్థను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం' అని వ్యాఖ్యానించారు.


## మెగామార్ట్‌లో అగ్నిప్రమాదం




**న్యూఢిల్లీ, జూలై 5:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కరోల్ బాగ్ ప్రాంతంలోని ప్రముఖ విశాల్ మెగా మార్ట్‌లో గత రాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో లిఫ్ట్‌లో చిక్కుకుపోవడం వల్లే ఆయన మృతి చెందినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు ధ్రువీకరించారు. సాయంత్రం 6:44 గంటల సమయంలో భవనంలోని మొదటి అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మొదట మాల్ సిబ్బంది అక్కడున్న అగ్నిమాపక పరికరాలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, అవి వేగంగా స్టోర్ మొత్తం వ్యాపించాయి. ఈ ప్రమాదంలో లక్షల రూపాయల విలువైన వస్తువులు, సరుకులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది 13 ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. సుమారు రాత్రి 9 గంటల సమయానికి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగినప్పటికీ, ఇంకా భవనంలో వేడి తగ్గకపోవడంతో కూలింగ్ ప్రక్రియ కొనసాగుతోం దని, ఆరు ఫైరింజన్లు ఘటనా స్థలంలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హిందూ యువతుల బలవంతపు మతమార్పిడిపై ఎన్ఐఎ కేసు నమోదు

**భోపాల్, జూలై 5:** హిందూ యువతులను ఆకర్షించి మతమార్పిడికోసం ముస్లిం యువకులకు డబ్బులు ఇచ్చారనే తీవ్ర ఆరోపణలపై ఇండోర్‌కు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ అన్వర్ ఖాద్రీపై పోలీసులు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు యువకులు తమకు అన్వర్ ఖాద్రీయే డబ్బులు ఇచ్చారని పోలీసుల విచారణలో చెప్పడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని, వారిని వివాహం చేసుకుని ఇస్లాంలోకి మార్చేందుకు ఒక్కొక్కరికి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఖాద్రీ చెల్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. మతం దాచిపెట్టి మోసం చేసి తమపై లైంగికదాడికి పాల్పడ్డారంటూ రెండు వారాల క్రితం ఇద్దరు హిందూ యువతులు బం



గంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కుట్ర బయటపడింది. ఈ ఫిర్యాదుతో పోలీసులు సాహిల్ షేక్, అల్తాఫ్ అలీ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. విచారణలో వీరు ఖాద్రీ పేరు చెప్పడంతో ఆయనపై మత స్వేచ్ఛ చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఖాద్రీ పరారీలో ఉండగా, ఆయన ఆచూకీ తెలిపిన వారికి రూ. 10,000 రివార్డును పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పందించారు. పరారీలో ఉన్న కౌన్సిలర్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని,దోషులు ఎవరైనా వదిలిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, బీజేపీ ఎమ్మెల్యే రమేశ్వర్ శర్మ తీవ్రంగా స్పందించారు. ఖాద్రీని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇండోర్ కలెక్టర్ ఆశిష్ సింగ్ కూడా సామాజిక సామరస్యానికి ముప్పు వాటిల్లుతున్నందునే ఎన్ఎస్ఏ ప్రయోగించినట్లు ధ్రువీకరించారు. ఆధారాల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉన్నా ఉపేక్షించేది లేదని పోలీసులు తెలిపారు.

## బిజెపినేత గోపాల్‌ఖెమ్కా హత్య




**పాట్నా,జూలై 5:** బీహార్ రాజధాని పాట్నాలో దారుణం చోటుచేసుకుంది. బీజేపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను దుండగులు కాల్చి చంపారు. సరిగ్గా మూడేళ్ల క్రితం ఆయన కుమారుడు గుంజన్ ఖేమ్కా కూడా ఇలాగే హత్యకు గురయ్యారు. ఒకే కుటుంబంలో తండ్రీకొడుకులు హత్యకు గురవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. గాంధీ మైదాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పనాచే హోటల్ సమీపంలో ఉన్న ట్విన్ టవర్ అపార్ట్‌మెంట్‌లో గోపాల్ ఖేమ్కా నివాసం ఉంటున్నారు. ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపి పరారయ్యారు. ఈ ఘటనలో ఖేమ్కా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిటీ ఎస్పీ సెంట్రల్ దీక్ష మాట్లాడుతూ, "గోపాల్ ఖేమ్కా హత్యకు గురైనట్టు మాకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆ ప్రాంతాన్ని మా ఆధీనంలోకి తీసుకున్నాం. ఒక బుల్లెట్, షెల్ కేసింగ్‌ను స్వాధీనం చేసుకున్నాం. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## టెక్సాస్‌ను ముంచెత్తిన వరదలు: 24 మంది మృత్యువాత



**న్యూయార్క్, జూలై 5:** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు సంభవించాయి. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 24 మంది ప్రాణాలు కోల్పోగా మరో 20 మందికిపైగా బాలికలు గల్లంతయ్యారు. వీరి కోసం రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. వర్షాల కారణంగా హంట్ ప్రాంతంలోని గ్వాడాలుపే నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి. అనేక నివాసాలు నీట మునిగాయి. వీధుల్లోకి భారీగావరద నీరు చేరింది. ఇప్పటి వరకు 24మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులుధ్రువీకరించారు. వరదల్లో చిక్కుకున్న దాదాపు 200 మందికిపైగా ప్రజలను రక్షించారు. గ్వాడులుపే నదీతీరంలో ఉన్న క్రిస్టియన్ క్యాంప్‌లో వేసవి శిక్షణాశిబిరం నిర్వహిస్తున్నారు. ఈ క్యాంప్‌ను వరదలు ముంచెత్తడంతో ఇందులో దాదాపు 23-25మంది బాలికలు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఈబాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఆచూకీ తెలియజేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు షేర్ చేస్తున్నారు. మరోవైపు, బాలికల కోసం అధికారులు తీవ్రంగాగాలిస్తున్నారు. పడవలు, హెలికాప్టర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

## పాకిస్థాన్-రష్యా మధ్య రైలు మార్గానికి అంగీకారం



**ఇస్లామాబాద్, జూలై 5:** పాకిస్థాన్‌ను తమ దేశంతోపాటు మధ్యాసియా దేశాలతో అనుసంధానించే బలమైన రైలు, రోడ్డు నెట్‌వర్క్ ఏర్పాటులో సహకారం అందించేందుకు రష్యా అంగీకరించింది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. రష్యాతో కుదిరిన ఒప్పందం తమ దేశాన్ని ఒక వ్యూహాత్మక అంతర్జాతీయ రహదారి కూడలిగా మారుస్తుందని పాకిస్థాన్ కమ్యూనికేషన్ల మంత్రి అబ్దుల్ అలీం అన్నారు. చైనాలోని టియాన్‌జిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) మంత్రిత్వ స్థాయి సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య, ఆర్థిక అనుబంధం పెంపొందించుకునేందుకు తాము కృషిచేస్తున్నామన్నారు. పాకిస్థాన్ చేపట్టిన ఆధునీకరణ చర్యల్ని ఆయన ప్రస్తావించారు. ఇందులో భాగంగానే రవాణా మౌలిక సదుపాయాలను డిజిటీకరించామని, ఎలాంటి అవరోధాల్లేని మోటార్‌వేల ఏర్పాటు, ఈ-ట్యాంగింగ్, సిసిటివి నిఘా వంటి అనేక చర్యలు చేపట్టామన్నారు. పాకిస్థాన్ రష్యాల మధ్య సహకారం ప్రాంతీయ వాణిజ్య సమీకరణలను మార్చివేస్తాయని రష్యా ఉప మంత్రి నికిటిన్ అన్నారు.

## యాత్రీకుల బస్సులు ఢీ: 36 మందికి తీవ్ర గాయాలు



**జమ్ము,జూలై 5:** అమర్‌నాథ్ యాత్రకు భక్తులతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 36 మంది యాత్రికులు గాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో యాత్రికులతో వెళ్తున్న ఓ బస్సు అదుపుతప్పి ఆగి ఉన్న ఇతర బస్సులను వెనుక నుంచి ఢీకొట్టింది. పవిత్ర అమర్‌నాథ్ పుణ్యక్షేత్రానికి వెళ్తున్న యాత్రికుల కాన్వాయ్ చందర్‌కోట్ ప్రాంతంలో అల్పాహారం కోసం ఆగింది. ఆ సమయంలో కాన్వాయ్‌లోని ఓబస్సు నియంత్రణ కోల్పోయింది. దీంతో ముందు పార్క్ చేసి ఉన్న నాలుగు బస్సులను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో యాత్రికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంపై రాంబన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ) కుల్బీర్ సింగ్ స్పందించారు.

# వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా పి 4 కార్యక్రమం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**శ్రీకాకుళం, జూలై 5 ప్రభాతవార్త ;** వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యం దిశగా పి 4 కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం శ్రీకాకుళంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర పి 4 పౌండేషన్ సమీక్ష సమావేశం జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన కుటుంబాలను ఆదు కోడానికి, పునరుద్ధరించడానికి, సశక్తీకరించ డానికి పి 4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని, పి 4 కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ధనవంతులు, శ్రేయోభిలాషులను చేరదీసి, ఆ కుటుంబాలకు నేరుగా మార్గనిర్దేశనం, ఆర్థిక సహాయం, ఉద్యోగ అవకాశాలను కల్పించడమే లక్ష్యమని వివరించారు. అందుకు తగిన విధంగా నియోజకవర్గం వారీగా విజన్ ప్లాన్ అమలు చేస్తామని స్పష్టం చేసారు. మంత్రి కింజరాపు అచ్చం నాయుడు మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన కుటుంబాలు పేద కుటుంబాల్ని తాము స్వయంగా దత్తత తీసుకుని మార్గనిర్దేశనం చేయడాన్ని ప్రోత్స హించాలని, తాత్కాలిక దాతృత్వాన్ని కాకుండా, దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. అదేవిధంగా నాన్ రెసిడెన్షియల్ ఇండియన్స్ తో పాటు నాన్ రెసిడెన్షియల్ విలేజర్స్ ను గుర్తించి వారి ద్వారా కూడా సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా ఆరోగ్యవంతమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని తక్కువ ఆదాయ కుటుంబాలను గుర్తించేందుకు గ్రామ/వార్డు సచివాలయాల డేటాను ఆధారంగా చేసుకొని సర్వే చేయడం జరిగిందన్నారు. 75,566 కుంభాలలోని 2,11,586 మందిని గుర్తించామన్నారు. జిల్లాలో 10 అత్యధిక ధనవంతులను గుర్తించి 20 శాతం పేద కుటుంబాలను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలలో ఆ యా శాసనసభ్యులు అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీలను ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన కమిటీ ఆమోదించింది. ఆ యా కమిటీల కార్యాలయాలను నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చం నాయుడు ఆదేశించారు. సమీక్షలో ఆమదాలవలస, నరసన్నపేట శాసనసభ్యులు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి పలు సలహాలు సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో 8 నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి అధునాతన నిర్మాణ రూపకల్పన అవసరం



ఐఐటిలో ఆవిష్కరణల దృశ్యం

**శ్రీకాళహస్తి,జూలై 5 ప్రభాతవార్త** క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ఆధునాతన నిర్మాణ రూపకల్పన ఎంతో అవసరం అని ఉమ్మడి బాధ్యత సమిష్టిధృవీకరణ ఎంతో అవసరమని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మేధావులు, అతిధులు అభిప్రాయపడ్డారు. తిరుపతి ఐఐటిలో మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సమావేశాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఎన్నో కీలకమైన అంశాలపై సుధీర్ఘ చర్చలు సెమినార్లు నిర్వహించారు. ప్రభుత్వాలు పరిశోధనా సంస్థల నుంచి 550 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. మూడు రోజజుల పాటు లోతైన విద్యా ప్రసంగాలు, ప్రపంచ సహాకారం, భవిష్యత్తును చూపే ఆవిష్కరణలకు వేదికగా మారింది. సమావేశాలను డైరెక్టర్ ప్రొఫెసర్ కె. యన్ సత్యనారాయణ పర్యవేక్షలో నిర్వహించారు. సీనర్జీ ఆఫ్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్ ఇతి వృత్తం కేంద్రీకృతమైన, వాతావరణ మార్పు, వనరుల కొరత డిజిట్ పరివర్తన మరియు పట్టణ సంక్లిష్టత తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొంటానికి ఆధునాతన నిర్మాణ రూపకల్పనతో మెటీరియల్ ఆవిష్కరణ నుసమ లేఖనం చేయాల్సిన తక్షణ అవసరాన్ని ప్రస్తావించింది. ఐసిసిఎంఎస్ 2025 ఇక విద్యాసమావేశం కాదని

## తిరుపతి ఐఐటి అంతర్జాతీయ సమావేశాల్లో మేధావులు

చర్యకువ్యూహాత్మక పిలుపు అని డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన సమావేశంల 10ప్లీనరీ లెక్చర్లు, 21 కీలక ప్రసంగాలు, 427 సాంకేతిక పత్ర ప్రజెంటేషన్లు 113 పోస్టర్ సెషన్లు భౌతిక మరియు హైబ్రీడ్ ఫార్మట్లలో జరిగినట్లు వివరించారు. ఈ సెషన్లలో అల్ట్రా-హై- పెర్ఫార్మెన్స్ కాంక్రీట్, తక్కువ-కారబన్ సిమెంట్లు, డిజిటల్ నిర్మాణ సాంకేతికలు, జీవిత చక్ర రూపకల్పన ఫ్రేమ్ వర్కులు, అగ్నిమాపకనిరోధక పదార్థల మరియు నిర్మాణ ఆరోగ్య పర్యవేక్షణ వంటి విస్తృత శ్రేణి అంశాలుచర్చకు వచ్చాయని సత్యనారాయణ వివరించారు. తిరుపతి ఐఐటి నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సుల్లో విదేశీ యూనివర్శిటీలకు చెందిన ప్రతినిధులు రావటం గమనించదగ్గ విషయం. ప్రపంచ ప్రసిద్ది చెందిన ప్లీనరీ స్పికర్లు ప్రొఫేసర్మైక్ ఫ్లైచ్, ప్రో. జయాన్కూకా రాంజీ, ప్రో. బాల్తాసర్ నోవాక్, దామోదర్ కత్తి వారు పాల్గొన్నారు. వారి రచనలు పదార్థా సామర్థ్యం, నిర్మాణ అప్టిమైనేషన్, స్థిరత్వ వ్యూహాలు భద్రతా ప్రమాణాలపై కీలకమైన అంతరాష్ట్రాలను అందించాయి. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ప్రో. మనుసంతానం, ప్రో. మార్టిన్ మెన్సిఎగ్ర్, డాక్టర్సురేంద్ర సింగ్ నిర్వహించిన ప్రత్యేక సెషన్, కేరీర్ ప్రారంభం దశలో ఉన్న పరిశోధనలకు నిర్మాణాత్మక మద్దతు ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది ప్రో. వసంత్ మత్సగర్, డాక్టర్ ఎస్, అలెగ్జాండర్ బ్రాండ్, డాక్టర్ జిట్టిన్ వర్గీస్, ప్రో. రాధాకృష్ణన్ పిళ్ళై, ప్రో. ప్రదీప్ సర్కార్ ముఖ్య ఉపన్యాసాలు, పదార్థలక్షణం, నిర్మాణ విశ్వసనీయత మరియు స్థిరమైన నిర్మాణ వ్యవస్థలపై ప్రసంగాన్ని మరింత సుసంపన్నం చేసాయి.



# చెరువు సమీపంలో గజరాజు మృతి

**కల్లూరు, జూలై 5 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం పాతపేట పంచాయితీ పూరేడు వారి పల్లి చెరువు సమీపంలో శనివారం ఉదయం ఏనుగు మృతి చెందింది. మండలంలో గత మూడు నెలలుగా ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక ఆడ ఏనుగు చెరువు వద్ద మృతి చెంది ఉండడంతో గ్రామస్తులు సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న జిల్లా అటవీశాఖ అధికారిణి ధరణి సంఘటనా స్థలానికి చేరుకొని ఏనుగు మృతిపై విషయాలను సేకరించారు. తిరుపతి జూపార్క్ వైద్యులు ఏనుగుకు పోస్టుమార్టం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారిణి. ధరణి మాట్లాడుతూ తినడం బాధాకరమని మామిడి కాయలు ఎక్కువగా తినడం వల్లనే ఈ సంఘటన జరిగిందని పోస్టుమార్టం రిపోర్టు అనంతరం పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. పులిచెర్ల తాసిల్దార్ జయసింహా, అటవీశాఖ అధికారులు, సర్పంచ్ నటరాజ, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదాసు లోకేష్, వీఆర్వోలు శకుంతల, మౌనిక తదితరులు పర్యవేక్షించారు. ఏనుగు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సమీప గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటన స్థలాన్ని చేరుకుని ఏనుగును చూశారు.

# దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎన్నికల సంస్కరణలు జరగాలి

## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు




**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎన్నికల సంస్కరణలు జరగాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గోదావరి జలాలను అంతర్రాష్ట్ర వివాదాల్లోకి నెట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. బనకచర్ల ప్రజలకు భారం కార్పొరేట్ల చేతుల్లోకి నీటి వ్యాపారం గోదావరి నీటి పంపకం విషయంలో కేంద్రం అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని, ఆంధ్రా, తెలంగాణా మధ్య జుట్లు ముడేసి తన్నుకు చావండి తమాషా చూస్తామనే వైఖరి తీసుకుందని శ్రీనివాసరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గ వైఖరికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి కూడా ఉపయోగపడుతుందని అన్నారు. పర్యావరణ అనుమతి కోసం దరఖాస్తు చేస్తే వారు సిడబ్ల్యుసి అనుమతి తీసుకోవాలని సూచించడంతోపాటు వారికి సంబంధం లేని నీటి గ్యారంటీ గురించి ప్రశ్నించారని విమర్శించారు. నీటి లభ్యత అంశాన్ని అడ్డుపెట్టుకుని పర్యావరణశాఖ ద్వారా కేంద్రం వివాదాన్ని లేవనెత్తించిందని, నీటిలభ్యత లేదని అనుమతి ఇవ్వలేము అంటే లేని వివాదాన్ని సృష్టించడమే అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కిమ్మనడం లేదని విమర్శించారు. బాలోత్సవ భవనంలో వివిధ అంశాలపై శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ కేంద్రం ఎన్నికల కమిషన్‌ను తొత్తుగా మార్చుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కమిషన్ ఎన్నికల కమిటీలో చీఫ్ జస్టిస్‌ను తొలగించి క్యాబినెట్ మినిస్టర్‌ను పెట్టారన్నారు. అక్కడ ప్రధాని, ప్రతిపక్ష నేతతోపాటు ఖచ్చితంగా చీఫ్ జస్టిస్ ఉండాలని కోరారు.

ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్ సంస్క రణల మీద దేశ వ్యాప్తంగా ప్రచారం చేయాలని సిపిఎం నిర్ణయించిందని, మేధావులతో కూడా చర్చిస్తామని చెప్పారు. బీహార్ ఎన్నికల సందర్భంగా ఓటర్ల లిస్టును తాజాపర్చే పేరుతో తీసుకొచ్చిన నిబంధనలు ఓటు హక్కును తిరస్కరించేవిగా ఉన్నాయని అన్నారు. సవాలక్ష నిబంధనలు పెడుతూ బలహీనవర్గాలు, మైనార్టీలు, వలసపోయిన వారికి ఓట్లు నిరాకరించే మిగతా 7లో వివాదాస్పద అంశాన్ని కమిషన్ ముందుకు తెచ్చిందని తెలిపారు.

# 8 నుండి శాకంబరిగా దుర్గమ్మ


## - మూడు రోజుల ఉత్సవానికి సమాయత్తం - వేడుకగా ఆషాఢం సారె సమర్పణ

**ఇంద్రకీలాద్రి, జూలై 5, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 8 నుండి 10 వరకు శాకంబరి ఉత్సవాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సకల లోకాలను చల్లగా కాపాడు జగజ్జనని దుర్గమ్మవారు ఒకానొక కాలంలో వర్షాలు కురవక క్షామం తలెత్తినప్పుడు సకల జీవాలకు ఆహారమందించే శాకంబరిగా అవతారమెత్తిన దుర్గమ్మవారు ఈ మూడు రోజులు భక్తులకు అదేరూపంలో శాకంబరి మాతగా దర్శనమిస్తారన్నారు. దుర్గమ్మవారి మూలవర్లతో పాటు ఉపాలయాల్లోని శ్రీస్వామి అమ్మవార్లకు కూడా శాకంబరి ఉత్సవాలు జరుపుతామని ఆలయమంతా వర్ణమయ కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరిస్తామన్నారు. ఘాట్‌రోడ్డుపై వేంచేసియున్న శ్రీ గణపతి, కామధేను మాత ఆలయాల్లో కూడా శాకంబరి ఉత్సవాల్లో భాగంగా కూరగాయలు, పండ్లతో అలంకరణ చేస్తామన్నారు. శాకంబరి మాతగా దుర్గమ్మవారిని దర్శనం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా త్రయాహ్నిక దీక్షా పూర్వకంగా ఉత్సవ నిర్వహణ చేసి 10వ తేదీన పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

- నిత్యాన్నదానానికి విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి


విరాళం చెక్కును అందిస్తున్న దాతలు

రు.1లక్ష 116ల విరాళాన్ని శనివారం గుంటూరుకు చెందిన ఆవుల శ్రీకమల్ తమ కుటుంబసభ్యులతో కలిసి ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మవారి



చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు.

- జగన్మాత వైభవాన్ని చాటిన నృత్యనీరాజనం : దుర్గమ్మవారి ఆలయంలో విజయవాడకు చెందిన నృత్యాచార్య వి మనోజ్ఞ కామేశ్వరి నేతృత్వంలో కూచిపూడి నృత్యాన్ని శనివారం అద్భుతంగా ప్రదర్శించారు.

అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిశ్రీ అమ్మవారి ప్రసాదం, మెమొంటో అందించారు.

# టేకాఫ్ దశలో ఉన్న బోయింగ్ విమానంలో ఫైర్ అలారం

## భయంతో రెక్కలు ఎక్కి దూకేసిన ప్రయాణికులు

**మ్యాడ్రిడ్, జూలై 5:** స్పెయిన్‌లో ఓ విమానంలో ఆకస్మిక గందరగోళం చోటు చేసుకుంది. టేకాఫ్ దశలో ఉన్న బోయింగ్ 737లో అకస్మాత్తుగా ఫైర్ అలారం మోగడంతో ప్రయాణికుల్లో తీవ్ర భయం నెలకొంది. ఒక్కసారిగా విమానం లోపల కేకలు, అరుపులతో ఆందోళన వాతావరణం ఏర్పడింది. అత్యవసర సిబ్బంది ప్రయాణికులను అత్యవసర ద్వారాల ద్వారా బయటకు తరలించేందుకు ప్రయత్నించారు. అయితే భయం ఎక్కువైన కొందరు ప్రయాణికులు సిబ్బంది సూచనలను పట్టించుకోకుండా విమాన రెక్కలపైకి ఎక్కారు. ఆ తర్వాత వారు కిందకు దూకేసారు. ఈ ఘటనలో కనీసం 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ భయానక ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చాయి. ప్రయాణికులు భయంతో విమానం నుంచి ఎలా బయటపడ్డారనేది వీడియోలు స్పష్టంగా చూపించాయి. ఈ వీడియోలు శరవేగంగా వైరల్ కావడంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ సంఘటనపై దృష్టి వెళ్లింది. ఫైర్ అలారం మోగటానికి అసలు కారణం సాంకేతిక లోపమేనని, విమానంలో ఎలాంటి మంటలు లేకపోయాయని స్పష్టం విమానసంస్థ స్పష్టం చేసింది. ముందు జాగ్రత్త చర్యగా టేకాఫ్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, ప్రయాణికులందరిని సురక్షితంగా టెర్మినల్‌కి తరలించామని తెలిపింది. ప్రస్తుతం గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# డాక్టర్ జివి పూర్ణచంద్ 'రాయలవారి కధలు, గాధలు' ఆవిష్కరణ



డాక్టర్ జీవీ పూర్ణచంద్ 'రాయలవారి కధలు,గాధలు' ఆవిష్కరిస్తున్న ఏపీ హైపర్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్

**విజయవాడ, జూలై5,ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగు మాధుర్యాన్ని విశ్వ విఖ్యాతం చేసిన అపర ఆంధ్ర భోజుడు, శ్రీకృష్ణ దేవరాయలు మాతృభాష మనోవికాసానికి దోహదం చేస్తుందని చెప్పిన మహా ఏలికని పలువురు వక్తలు అన్నారు. ప్రఖ్యాత రచయిత, సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జీవీ పూర్ణచంద్ 150వ రచన" రాయలవారి కధలు, గాధలు" పుస్తకాన్ని ఏపీ భాషా, సాంస్కృతికశాఖ ప్రచురించింది. కృషాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలోఈ పరిశోధనాత్మక గ్రంధాన్ని స్థానిక ఐలాపురం హోటల్‌లో ఏపీ హైపర్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఏపీ భాషా, సాంస్కృతికశాఖ ముఖ్య కార్యదర్శి రెగుళ్ళ మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన సభలో తొలిపత్రిని ఏపీ అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులు కళా ప్రపూర్ణ, డాక్టర్ మండలి బుద్ధప్రసాద్‌కు అందజేసారు. ఇక చైర్మన్ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్ భువన విజయం పుస్తకాన్ని రాసిన పూర్ణచంద్ర అద్భుత సాహసం చేసారన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అపోహాల్లోంచి వాస్తవికతలోకి భువన విజయం తీసుకుని వెళ్ళే ప్రయత్నం చేసిందన్నారు. రాయల వారి గురించి కల్పిత కథలు, గాథలు ఉన్న పరిస్థితుల్లో చేసిన మూలాల అన్వేషనణ మంచి ప్రయత్నం అన్నారు. భువన విజయం తెలుగు భాషా భోజుడి వెలుగు కధలు అని తమ అధ్యక్షోపన్యాసంలో రేగుళ్ళ వ్యాఖ్యానించారు. అనేక సందేహాలు ఈ పుస్తకం ఒక సమాధానమన్నారు, డాక్టర్ గుమ్మాసాంబశివరావు రాయలవారి కధలు, గాధలు పుస్తకాంశాలను విశ్లేషించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు భువన విజయం మంచి రచనని వ్యాఖ్యానించారు, రచయిత జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ అభివృద్ధి మూలాల అన్వేషణని తెలిపారు. విశేషంగా సాహిత్య మిత్రులు, కవులు, కళాకారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# 32వ ఎపి న్యూరోకాన్ సదస్సు

## ముఖ్య అతిధిగా మంత్రి పొంగూరు నారాయణ



**హైదరాబాద్, జులై 05, ప్రభాతవార్త:** నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న 32వ ఏపీ న్యూరో కాన్ సదస్సుకు రెండవ రోజు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హాజరయ్యారు. మంత్రితోపాటు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి పొంగూరు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి నారాయణ మాట్లాడుతూ సౌత్ ఇండియాలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ న్యూరాలజీ వైద్యులు అందరూ విచ్చేసి వారి విజ్ఞానాన్ని పంచుకోవడం ఈ సదస్సులో జరుగుతుందని.. ఇందువలన రోగులకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని ఇటువంటి సదస్సును నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. శరణి పొంగురు మాట్లాడుతూ సదస్సులో న్యూరాలజీలో వస్తున్న అత్యాధునిక వైద్య విధానాల గురించి పరికరాల గురించి తెలుసుకోవడం జరుగుతుందని.. సుమారు 700 మందికి పైగా వైద్యులు పాల్గొంటున్నారని, 70 మందికి పైగా వక్తులు ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, నారాయణ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ సౌత్ ఇండియా నుంచి కాకుండా నార్త్ నుంచి కూడా వైద్యులు వచ్చారని, మూర్ఛ, స్ట్రోక్, బ్యాక్ పెయిన్, పార్కిఇన్‌సన్ జబ్బులకు అందించే వినూత్న వైద్య విధానాల గురించి చర్చించుకోవడం ద్వారా విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవడం జరుగుతుందన్నారు. నెల్లూరుపై, మంత్రి నారాయణపై ఉన్న అభిమానంతో లండన్‌లోని కింగ్స్ కాలేజీ వైద్యులు, నెల్లూరు వాసి డాక్టర్ మెట్టా వినోద్ కుమార్ రావడం ఎంతో సంతోషమన్నారు. కింగ్స్ కాలేజ్.. నారాయణ మెడికల్ కళాశాలతో ఎంవోయూ చేసుకోవడం పార్కిన్సన్ జబ్బుకు అత్యాధునిక చికిత్స పద్ధతులను ఇక్కడ అవలంబించేందుకు సహకరించిన డాక్టర్ వినోద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ న్యూరో సైన్సెస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, అపోలో హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఏవి రమణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా జబ్బులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరు న్యూరో క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ పిఎస్ రెడ్డి గతంలో రెండు మార్లు ఈ సదస్సు నిర్వహించడం జరిగిందని అయితే ఈసారి ఇంత గొప్పగా నిర్వహించడం ఆనందాన్నిస్తుందన్నారు.

# 12 రహదారులను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో 12 రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రహదారుల అభివృద్ధికి జులై 10న టెండర్లు తెరవనున్నారు. రహదారి పనుల అభివృద్ధి ప్రక్రియ వేగవంతంగా మొదలుపెడతామని ఆర్అండ్‌బీ ఎస్ఈ భాస్కరరావు తెలిపారు. ఏపీలో ప్రధానమైన రాష్ట్ర రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది, ఈ క్రమంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఈ రహదారులు అభివృద్ధికి సిద్ధమైంది. గత ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా వేయలేదు. దీంతో పూర్తిగా ఛిద్రమయ్యాయి. గత ప్రభుత్వ హయంలో కీలకమైన, రవాణా రద్దీ అధికంగా ఉండే రహదారుల మరమ్మతులు చేస్తే రూ.1520 కోట్లతో అవుతాయని అంచనా వేసినా, ఆ దిశలో కార్యచరణ చేపట్టలేదనే విమర్శలు తీవ్ర స్థాయిలో వెల్లవెత్తాయి. దశల వారిగా ఈ దారులను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించినప్పటికి అది జరుగలేదు. కొన్ని రోడ్లుకు టెండర్లు పిలిచారు. ఎందుకనో ఆ ప్రక్రియముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో నిరంతరం రద్దీగా ఉంటూ, అధ్వాన్నంగా ఉంటున్న ఉమ్మడి కృష్ణా జిల్లాలో విజయవాడ, మచిలీపట్నం డివిజన్ల పరిధిలో 12 రాష్ట్ర హైవేల అభివృద్ధిని తక్షణం చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.37.8 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 63.7 కి.మీ మేర రహదారులను బాగు చేయనున్నారు. అత్యధికంగా నూజివీడు- మైలవరం రహదారి 13.4 కి.మీ, రామానగరంనడకుదురు 10.4 కి.మీ, సింగారపాలెంబంటుమిల్లి 8.8 కి.మీ మేర అభివృద్ధి చేయనున్నారు.

# ప్రాణాలు తీసిన బోటింగ్ సరదా

## ప్రమాదవశాత్తు నీటమునిగి ఇద్దరు మహిళలు మృతి

**వికారాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** సరదా ఇద్దరి ప్రాణాలు బలిగొంది. వారాంతం కావడంతో సరదాగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా గడిపేందుకు రిసార్టుకు వచ్చిన వారికి విషాదం మిగిలింది. బోటింగ్ చేస్తూ ఇద్దరు మహిళలు నీట మునిగి మృత్యు ఒడికి చేరుకున్నారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా, వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం వీకెండ్ కావడంతో బీహార్ కు చెందిన రెండు కుటుంబాల వారు వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్ పల్లి ప్రాజెక్ట్ పక్కనే కొనసాగుతున్న ది విల్డెర్నెస్ రిసార్టు క్యాంపు సైట్‌లో ఔటింగ్‌కు వచ్చారు. వారికి రిసార్టు నిర్వాహకులు బోటింగ్ చేయిస్తాము.. ఇతర సౌకర్యాలు కల్పిస్తాము అంటూ వారికి చెప్పడంతో.. సరదాగా బోటింగ్ చేద్దామని ప్రాజెక్ట్ లోకి ఇద్దరు మహిళలు, ముగ్గురు మగ వారు బోటింగ్ చేసేందుకు వెళ్ళారు. వారికి తోడుగా రిసార్టు నిర్వాహకులు మాత్రం వెళ్ళలేదు. దీంతో ప్రాజెక్టు మధ్యలోకి వెళ్ళగానే బోటు ప్రమాదవశాత్తు తిరగబడింది. ఈ పమాదంలో బోటులో ఉన్న రేటా కుమారి (55), పూనమ్ సింగ్ (60) అనే ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని ఒక ప్రముఖ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇద్దరు మహిళల మృతి కారణం రిసార్టు నిర్వాహకుల నిర్ల క్ష్యమేనని కుటుంబ సభ్యు లు పేర్కొంటున్నారు. కనీసం గజ ఈతగాళ్ల లేకుండా బోటింగ్ ఎలా చే యిస్తారని, ముందు జాగ్ర త్త చర్యలు పాటిం చకుం డా ప్రాజెక్టు నీటిలో బోటింగ్‌కు పర్యాటకులను ఎలా పంపుతారని మృతు ల కుటుంబసభ్యులు ఆగ్రహంవ్యక్తంచేస్తున్నారు.

**బోటింగ్‌కు అనుమతులు ఉన్నాయా..?**

వికారాబాద్ జిల్లా కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సర్పన్ పల్లి ప్రాజెక్ట్ పక్కనే కొనసాగుతున్న ది విల్డెర్నెస్ రిసార్టు క్యాంపు సైట్ ఉంది. గత 5 సంవత్సరాలుగా టూరి జం, ఇరిగేషన్ శాఖల నుండి ఎలాంటి అ నుమతులు లేకుండానే అక్రమంగా బోటింగ్, హోమ్ బోటింగ్ నిర్వహిస్తున్నారు. సంబం ధిత ఇరిగేషన్ అధికారు లతో పాటు ఇతర అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడ టం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోటింగ్‌కు సైతం రిసార్టు వారికి ఎలాంటి అనుమతులు ఇవ్వకున్న రాజకీయ నాయకుల అండదండలతో రిసార్టును యథేచ్ఛగా కొనసాగిస్తూ అసాంఘీక కార్యక్రమాలకు తెరలేపుతున్నారని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సంఘటనతోనైనా సంబం ధిత శాఖ అధికారులు స్పంధించి రిసార్టు నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పంట పొలాల్లో భాస్వరం నిల్వలు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** తెలంగాణలో పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పంట పొలాల్లో భాస్వరం నిల్వలు భారీగా పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణలో ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిక పురుగు మందుల వినియోగం అధికంగా ఉంది. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్ఫేట్ వినియోగం పెరిగింది.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

### డెంగీ ప్లేట్‌లెట్స్ పేరిట పేషెంట్లను దోచుకునే ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠినచర్యలు

### సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియత్రణపై జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో వైద్య, ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, మెడికల్ కార్పొరేషన్ ఎండీ ఫణీంద్ర రెడ్డి, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, పబ్లిక్‌హెల్త్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్ నాయల్, జాయింట్ డైరెక్టర్ శివబాలాజీ పాల్గొన్నారు. సమావేశంలో.. మే నెల నుంచే వర్షాలు ప్రారంభమయ్యాయని, వాతవరణంలో వచ్చిన ఈ మార్పుల నేపథ్యంలో మే, జూన్ నుంచే అక్కడక్కడ సీజనల్ వ్యాధులు మొదల య్యాయని అధికారులు మంత్రికి దృష్టికి తీసుకొచ్చారు. అయితే గతేడాదితో పోలిస్తే ఈసారి చాలా జిల్లాల్లో డెంగీ కేసులు తక్కువగా నమోదయ్యాయని.. గ్రేటర్ హైదరా బాద్‌లో స్వల్పంగా కేసులు పెరిగాయని తెలిపారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు నమోదైనట్లు అధికారులు మంత్రికి చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జీహెచ్‌ఎంసీ జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో సమీక్షించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అలాగే ట్రైబల్ ఏరియాలపై ఎక్కువగా ఫోకస్ చేయాలని, ఐటీడీఏ పీవోలతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన పేషెంట్లకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో అవసరమైన అన్ని వసతులతో సిద్ధంగా ఉంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట పేషెంట్లను దోచుకునే ప్రైవేట్ హాస్పిటల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంట్లో అలాగే ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి ప్రజలకు సూచించారు.

## స్పీకర్ చైర్‌లో దళితుడు కూర్చోవడాన్ని కెసిఆర్ జీర్ణించుకోవడం లేదు

### రేవంత్‌తో చర్చించే దమ్ము కెటిఆర్‌కు లేదు

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ డిఎన్ఎలోనే దళిత వ్యతిరేకత ఉంది స్పీకర్ చైర్‌లో దళితుడు కూర్చొవడంతో కెసిఆర్ జీర్ణించుకోలేక అసెంబ్లీకి రావడంలేదు ఎఐసిసి అధ్యక్షుడి మల్లికార్జ ఖర్గేపై అక్కసుతో ఆయనకు వ్యతిరేకంగా పోస్టర్లు వేయించారు అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం సిఎల్‌పి కార్యలయంలో విలేఖరులతో మాట్లాడుతూ మా ప్రభుత్వం పైన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద ఆడిపోసుకోవడమే కెటిఆర్‌కు పనిగా మారిందని దుయ్యబట్టారు. అక్కసు, కుళ్లు తప్ప కెటిఆర్‌లో మాటల్లో ఏ మాత్రం పస లేదని తెలిపారు. మా ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమా అని కెటిఆర్ సవాల్ చేస్తున్నారు. మా ప్రభుత్వ పనితీరుపై ఎప్పుడైనా మేం చర్చకు సిద్దం అని ఆయన ప్రకటించారు. ప్రజాస్వామ్యం లో చర్చకు చట్ట సభలున్నాయి అక్కడ జరిగే చర్చలు రికార్డు అవుతాయి అని ఆయన అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత కొన్ని రోజులుగా సవాల్ విసురుతున్నారు..కృష్ణా, గోదావరి జలాలతో పాటు అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చకు మేం సిద్దం నీకు దమ్ముంటే స్పీకర్ దగ్గరకు వెళ్లి అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు కోరుతూ మీ పార్టీ తరపున లేఖ ఇవ్వండని ఆయన తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్ ను అసెంబ్లీకి తీసుకువచ్చి చర్చ చేయమనండి అని కోరారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిచేంత స్థాయి, దమ్ము బచ్చా కేటీఆర్ కు లేదు.. మేం చాలుకేటీఆర్ హరీష్ రావు లాంటి పిల్ల గాళ్లకు మేం చాలు, మా ముఖ్యమంత్రి అవసరం లేదని ఆయన అన్నారు. ప్రెస్ క్లబ్ లో చెట్ల కింద ఎందుకు అసెంబ్లీ కి రండి, తేల్చుకుందాం అని ఆయన అన్నారు. కెటిఆర్ రైతుల కోసం మా ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు మేం సిద్ధం అని అన్నారు. సిరిసిల్ల, చింతమడక, తెలంగాణ భవన్ , ప్రెస్ క్లబ్ ఎక్కడికైనా వచ్చి చర్చిస్తామని అన్నారు. 72 గంటలు కాదు,72 నిమిషాల్లోనైనా చర్చకు సిద్ధం..మా ముఖ్యమంత్రి చెప్పినట్లు వచ్చే ఎన్నికల్లో మేం వంద సీట్లు గెలుస్తామని ఆయన ఢంకా భజాయించి చెప్పారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేసింది మా ప్రభుత్వం అని అన్నారు.

## టెట్-2025 ప్రాథమిక కీ విడుదల

### 8 వరకు అభ్యంతరాలు స్వీకరణ

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-జూన్-2025 పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీని పాఠశాల విద్య శాఖ శనివారం విడుదల చేసింది. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8 సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవాలని పాఠశాల విద్య డైరక్టర్, టెట్-2025 ఛైర్మన్ నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు జూన్ 18 నుంచి 30 వరకు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలకు 74 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలను 9 రోజులపాటు 18 సెషన్‌లలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిం చారు. టెట్ పరీక్షలకు రాష్ట్రంలో 1,83,653 దరఖాస్తులు రాగా.. అందులో పేపర్-1కి 63,261 మంది, పేపర్-2కి 1,20,392మంది దరఖాస్తు చేసుకున్నారు. 2 పేపర్లకు 15,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1 పరీక్షలకి 63,261 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 47,224 మంది (74.65 శాతం) పరీక్షకు హాజరయ్యారు. పేపర్-2లో భాగంగా గణితం అండ్ సైన్స్ పరీక్షకి 66,686 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 48,998 మంది(73.48 శాతం) మంది హాజరయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 53,706 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 41,207 మంది(76.73శాతం) పరీక్షలకి హాజరయ్యారు.

## అసెంబ్లీ చర్చకు రమ్మంటే ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతానంటున్న కెసిఆర్

### కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** గోదావరి, కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చ పెడదామని సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుంటే కెసిఆర్ మాత్రం ప్రెస్‌మీట్ పెడతా అంటున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన సామ స్పందించారు. కెసిఆర్ అసెంబ్లీకి వస్తే బతుకు గోదాట్లో దూకినట్లే అని భాష్యం చెప్పారు. కృష్ణాలో మునిగినట్లేననే విషయం బిఆర్ఎస్ నేతలకు తెలియదన్నారు. అందుకే రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చర్చ విషయాన్ని బిఆర్ఎస్ నేతలు కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్తే కెసిఆర్ మాత్రం నేను ప్రెస్‌మీట్ పెడతానని చెబుతున్నారని ఈ నిర్ణయంతో గులాబీ నేతలు తలగొక్కుంటున్నారని సెటైర్ వేశారు. ప్రెస్‌మీట్ అయితే అడిగేవాళ్లు ఉండరు. చెప్పాల్సింది చెప్పి దులుపుకుని పోవచ్చనే కెసిఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని సామ విమర్శించారు. ఎవరైనా మీడియా ప్రతినిధి ప్రశ్న వేస్తే 'ఏ పేపర్ నీది.. ఏం తెల్సు నీకు.. నాకంటే తెల్విఉందా నీకు' అంటూ రిపోర్టర్‌పైనే కెసిఆర్ ఎదురుదాడి చేసుడు మనకు తెలిసిందే కదా అంటూ పోస్టు చేశారు.

## గిరిజనుల సంఖ్యలో కొత్తగూడెం అగ్రస్థానం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 33 జిల్లాలలో గిరిజనుల జనాభాను చూస్తే అత్యధికంగా కొత్తగూడెం జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలో నాలుగు లక్షల మంది గిరిజన జనాభా ఉన్నట్లు ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. అలాగే 3 లక్షల మందితో మహబూబాబాద్ రెండో స్థానంలోను, 2.25 లక్షలతో ఆదిలాబాద్ మూడో స్థానంలో ఉన్నాయి. ఇక రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో 2.10 లక్షల మంది గిరిజనులు, ఖమ్మంలో 2 లక్షల మందితో అధిక జనాభాను కలిగి ఉన్న జిల్లాగా నమోదైంది. అదేవిధంగా రాష్ట్రంలో లక్ష నుంచి లక్షన్నర మధ్య రంగారెడ్డి, సూర్యాపేట, కొమరం భీమ్, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలు, 50 నుండి లక్ష జనాభా మధ్యన కలిగిన షెడ్యూల్ ట్రైబ్స్ జిల్లాలు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మంచిర్యాల, నిర్మల్, ములుగు ఉన్నాయి. వీటితో పాటు, హైదరాబాద్‌లో 50, వేలు, భువనగిరిలో 44 వేలు, వనపర్తిలో 46 వేలు ఎస్టీల జనాభా ఉంది. 20 నుండి 40 వేల మధ్యన గిరిజన జనాభా గలిగిన జిల్లాలు జనగాం, హనుమకొండ, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నారాయణపేట, జోగులంబ గద్వాల్, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల తక్కువ జనాభాతో కలిగి ఉన్న జిల్లాలుగా ఉన్నాయి.

## వైద్య పోస్టుల సెలక్షన్ లిస్ట్ విడుదల

### ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 156

### ఎంఎన్‌జెలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 45

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఇప్పటికే ఈ యేడాదిలో రెండు నోటిఫికేషన్లను జారీ చేయగా.. ఇప్పుడు డాక్టర్లకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు మరో శుభవార్త తెలిపింది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్, ఎంఎన్‌జె హాస్పిటల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ లిస్ట్‌ను శనివారం విడుదల చేసింది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 156 ఉండగా.. ఎంఎన్‌జేలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 45 ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపికైన వారి వివరాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం ప్రకటించింది. పోస్టుల భర్తీతో ఆయుష్ వైద్య సేవలు మరింత మెరుగవుతాయని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలను బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రి గుర్తుచేశారు. ఆయుష్‌లో ఇటీవలే సుమారు 630 వరకు యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, మరో 200లకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. అలాగే రాష్ట్రంలో కేన్సర్ పేషెంట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేన్సర్ వైద్యసేవలను విస్తరిస్తున్నామని మంత్రి తెలిపారు. కొత్తగా 45 మంది డాక్టర్ల నియామకంతో ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో వైద్యసేవలు మరింత మెరుగవుతాయన్నారు. జిల్లాలకు కూడా ప్రభుత్వ కేన్సర్ వైద్య సేవలను విస్తరిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కొత్త జిల్లాల్లో డిస్ట్రిక్ట్ కేన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో రీజనల్ కేన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. ఈ సెంటర్లు అందుబాటులోకి వచ్చాక, పేషెంట్లు హైదరాబాద్ వరకూ రావాల్సిన అవసరం ఉండబోదని.. జిల్లా స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.

## భట్టి విక్రమార్క ఎల్‌ఒసితో కేన్సర్‌ను జయించిన మహిళ

### గాంధీభవన్ ముఖాముఖి కార్యక్రమానికి స్పందన

### కృతజ్ఞతలు తెలిపిన భర్త రామకృష్ణ

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** ఉపముఖ్య మంత్రి భట్టివిక్రమార్క ఎల్ఒసితో ఒక మహిళ కేన్సర్ జయించి మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి ఒక సార్థకత చేకూర్చింది. కాంగ్రెస్ పాలకులు గడీలకు పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు ప్రజల బాధలు వారి బాధలుగా భావిస్తూ నిత్యం ప్రజల్లో ఉండటం వల్ల వారి కష్టసుఖాలకు పరిష్కార మార్గం సత్వరమే దొరుకుతున్నది. ఆర్థికకష్టాలు రాష్ట్రాన్ని చుట్టుముట్టినా నేనున్నాని అనే ధీమా ప్రజల్లో భద్రతా భావం పెంపొందిస్తున్నది. మంత్రులతో ముఖాముఖి వంటి కార్యక్రమం ఎంతోమంది అణగారిన వర్గాల ప్రజలకు ప్రభుత్వంను చేరువలోకి తీసుకొచ్చింది. కేన్సర్ జయించిన మహిళ కుటుంబం వివరాల్లోకి వెళితే.. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన రామకృష్ణ హైదరాబాద్ నగరంలో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆయన భార్య క్యాన్సర్ లంప్ తో బాధపడుతున్నట్టు గుర్తించి ఓ ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కొంతకాలం చికిత్స అనంతరం వారు వైద్యఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని తెలుసుకొని రామకృష్ణ కుమారుడు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లును కలిసి లిఖితపూర్వకంగా తన తల్లిదండ్రుల ఆవేదనను వివరించారు. చలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వెనువెంటనే లెటర్ ఆఫ్ క్రెడిట్ ఇచ్చి రామకృష్ణ జీవితం సహచరికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సహాయం ఎక్కడ ఆగకుండా ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేసి చెప్పాలని తన సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎల్ ఒ సి తో రామకృష్ణ తన భార్యకు 5 సార్లు కీమో థెరపీ చేయించ గలిగారు. కీమో అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించగా రామకృష్ణ శ్రీమతి క్యాన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా విముక్తి పొందినట్టు వైద్యులు నిర్ధారించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందించడంతో తన కుటుంబం నిలబడిందని, శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రామకృష్ణ డిప్యూటీ సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. క్యాన్సర్ ను విజయవంతంగా జయించిన ఆ కుటుంబానికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలియజేశారు.

## గురుకుల సీట్ల విషయంలో దళారులను నమ్మొద్దు

### పైరవీకారులతో తస్మాత్ జాగ్రత్త

### పారదర్శకంగా సీట్లు కేటాయింపు

### సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్‌సి అభివృద్ధి శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో సీట్ల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్సీ గురుకుల సొసైటీ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాలయాల్లో అడ్మిషన్ల విషయంలో వివిధ తరగతుల్లో సీట్లు ఇప్పిస్తామని కొంతమంది మధ్య దళారులు డబ్బులు తీసుకొని మోసపోయిన సంఘటనలు సొసైటీ దృష్టికి రావడం జరిగిందని.. కాబట్టి తల్లిదండ్రులు అలాంటి మోసగాళ్ల చేతిలో వారు చెప్పే మాట లను నమ్మవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియపరుస్తున్నట్టు సొసైటీ ప్రకటించింది. కొంత మంది మధ్య దళారులు పలువురు ప్రజా ప్రతి నిధులైన ఎమ్మెల్యే, ఎంపీల పేరుతో ఉన్నా లెటర్ ప్యాడ్లు ఉన్నా వాటిని ఫ్యాబ్రికేటెడ్‌గా తయారుచేసి తల్లిదండ్రులను మోసం చేస్తున్న సంఘటనలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఇలా మోసం చేసిన వారిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలనీ సంస్థ సూచించింది. గతంలో సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఇష్టారీతిగా సీట్లను అమ్ముకోవడం, డబ్బులు ఇచ్చినవారికి, మధ్య దళారుల చేత పైరవీ చేసిన వారికీ సీట్లను కేటాయించిన సంఘటనలు పలు పిర్యాదులు రావడం జరిగిందని... దాంతో ఈ ఏడాది 2025-26 విద్యాసంవత్సరం నుండి గురుకులాల్లో ఎంతో పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించడం జరిగింది. తద్వారా అట్టడుగు వర్గాలకు అలాగే ఆదాయం తక్కువ వున్న నిరుపేదవర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఇలా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికి ప్రవేశాల కోసం ఫిబ్రవరిలో నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పారదర్శకంగా సీట్లను కేటాయించడం జరిగింది. సీట్లు లభించిన విద్యార్థులకు వారు రిజిస్టర్ చేసుకున్న మొబైల్ ఫోన్లకు సంక్షిప్త సమాచారం అందించడంతోపాటు వాయిస్ మెసేజ్ సైతం పంపించడం జరిగింది. దీంతోపాటు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అధికారిక వెబ్ సైట్‌లో కుడా మెరిట్ లిస్టును పొందుపర చడం జరిగిందని సంస్థ తెలిపింది. ఇలా అన్ని దశలలో ఎక్కడ ఎలాంటి పొరపాటు లేకుండా పూర్తి పారదర్శకంగా మెరిట్ విద్యార్థులకు సీట్లను కేటాయించడం జరిగిందని.. ఈ నేపథ్యంలో మధ్యదళారులు ఎటు తోచకపోవడంతో ఇప్పుడు పలు మార్గాలను ఎంచుకొని కొందరు అమాయక తల్లిదండ్రులను టార్గెట్‌గా చేసుకొని సీట్లను ఇప్పిస్తామని డబ్బులు దండుకొంటున్నారని పేర్కొం ది. కాబట్టి తల్లిదండ్రులు మోసపోవద్దని.. మెరిట్ విద్యార్థులు రిపోర్ట్ చేసి ఇంకా జాయిన్ కాకపోతే ఏర్పడిన ఖాళీ సీటును తదుపరి మెరిట్ వున్న విద్యార్థిచే భర్తీ చేయబడుతుందని సొసైటీ స్పష్టం చేసింది. అన్ని విషయాలను తల్లిదండ్రు లందరు అర్థం చేసుకొని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నట్టు సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

## అసెంబ్లీలో చర్చిద్దాం రా..!




### సిఎం సవాల్‌కు స్పందించని ప్రతిపక్ష నేత

### కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** అసెంబ్లీలో చర్చిద్దాం రా..! సిఎం రేవంత్‌రెడ్డి సవాల్‌కు ప్రతిపక్షనేత కెసిఆర్ స్పందించడంలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో విచిత్ర పరిస్థితి కనిపిస్తుందని సాధారణంగా ప్రతిపక్ష పార్టీ అసెంబ్లీ సమావేశమ పరచమని అధికార పార్టీని డిమాండ్ చేస్తుందని కానీ ఇక్కడ రివర్స్ ఉందని సిఎం రేవంత్ అసెంబ్లీ పెడతా ప్రతిపక్ష నాయకుడు రావాలి అని కోరుతున్నాడని అన్నారు. ప్రతిపక్షనేత కెసిఆర్ సభకు వస్తా అంటే అసెంబ్లీ పెడతా రండి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుతున్నా ప్రతిపక్ష నాయకుడు మాట్లాడ కుండా సెకండ్ బెంచ్ లీడర్స్ మాట్లాడు తున్నారని అన్నారు. జాతీయపార్టీకి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపప్రాంతీయ పార్టీ ప్రతిపక్షనే కెసిఆర్ మధ్యలో సెకండ్ బేంచ్ కెటిఆర్,హరీష్‌రావులు వచ్చి బోట్స్ క్లబ్ కి ప్రెస్ క్లబ్ కి రా అంటున్నారని రెండు రోజులు పోతే కల్లుదుకాణం కాడికిరా అని అంటారేమో జగ్గారెడ్డి విమర్శించారు. కెటిఆర్ ఆంధ్రోళ్ల ను తిట్టింది నువ్వే,కాలుకు ముళ్ళు గుచ్చుకుంటే నోటితో తీస్తా అన్నది మీరే అని ఆయన ఎద్దేవ చేశారు. కెసిఆర్ గ్రేటర్ ఎన్నికలు రాగానే ఆంధ్రా వాళ్ళ కాళ్ళకు ముళ్ళు గుచ్చుకుంటే పంటితో తీస్తా అన్నావు అప్పుడు నీ అజెండా నీది నీళ్లను దొంగతనం చేసిన వాళ్లను ఇంటికి పిలిచి ఎందుకు మీటింగ్ పెట్టినవు అని నిలదీశారు. రేవంత్ కెసిఆర్ ఇద్దరూ మొదటి బెంచ్ వాళ్ళే అని ఆయనఅన్నాడు. నువ్వు కోడి కూర పెడితివి అక్కడ పోయి చేపల కూర తిని వస్తిరి అని ఎకసెక్కాలు చేశారు. రేవంత్ గడ్డం పట్టుకుని బతిమి లాడుతున్నారు అసెంబ్లీకి రండి చర్చ చేద్దాం, సలహాలు ఇవ్వండి అంటున్నాడు ఎం ఎల్ ఎ లు చర్చ చేసేది అసెంబ్లీ లోనాఅని ప్రశ్నించారు. కెటిఆర్ దమ్మంటే మీ ప్రతిపక్షనేతతో రాజీనామా చేయించు నీవే లీడర్‌గా వచ్చి చర్చ చేయ్ అన్నారు. మీ నాయన చంద్రబాబు విహెచ్ నాయ కత్వంలో పనిచేశారు.

## ముగిసిన దోస్త్-2025 అడ్మిషన్ల ప్రక్రియ

### మూడు విడతల్లో సీట్ల కేటాయింపు

### కాలేజీల్లో చేరడానికి శనివారంతో ముగిసిన గడువు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మూడు విడతల్లో సీట్లను కేటాయించారు. రెండు, మూడో విడతల్లో సీటు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరడానికి ఇచ్చిన గడువు కాస్త శనివారం(జులై 5)తో ముగిసింది. దీంతో 2025-26 సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినట్టయింది. మొదటి విడతలో 65వేల మందికి సీట్ల కేటాయింపు చేపట్టగా వారిలో సుమారు 43 వేల మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చారు. ఇక రెండో విడతలో 43వేల సీట్ల కేటాయింపు చేయగా.. మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు.

సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా దానిని కాస్త జులై 5 వరకు పొడిగించారు. అదికాస్త శనివారంతో ముగిసింది. దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపును జూన్ 28న విడుదల చేశారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 82,770 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో విడతలో 96,015 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 85,680 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 10,335 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు.

రెండు, మూడో విడతలో సీటు పొందిన వారు రూ. 500.. రూ. 1000 ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరడానికి శనివారం(జులై 5) వరకు అవకాశం కల్పించగా .. గడువు కాస్త ముగిసింది. మొత్తంగా మూడు విడతల్లో కలిపి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను దోస్త్ అధికారులు సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్రంలో 4లక్షలకిపైగా డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

## కరీంనగర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా

### కేంద్రమంత్రి బండి సంజయ్

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో అంతవరకే రాజకీయాలు.. ఆ తర్వాత వార్డు మెంబర్ స్థాయి నుండి పార్లమెంట్ స్థాయి వరకు మనకు ఓట్లు వేసిన గెలిపించిన ప్రజల మనోభావాలకు అనుగుణంగా నాయకులము అన్న విషయాన్ని మర్చిపోయి, ప్రజలకు సేవకులుగా వారి అవసరాలను గుర్తించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేసినప్పుడే ప్రజలు మనల్నను ఆశీర్వదిస్తారని, హక్కున చేర్చుకుంటారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక, జమ్మికుంట మండలాల పరిధిలో1కోటి 56 లక్షల వ్యయంతో, వీణవంక మండలంలో 18 అంతర్గత సీసీ రోడ్లను నిర్మించగా, కరీంనగర్ నుండి వీణవంకకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను హుజురాబాద్ బిఆర్ఎస్ శాసనసభ్యుడు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, బిజెపి పార్టీ శ్రేణులు బండి సంజయ్‌కుమార్ ఘనంగా గజమాలతో స్వాగతం పలికారు. వీణవంకలో నిర్మాణమైన 18 సీసీ రోడ్లను మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు.

అనంతరం జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి గ్రామంలో మరో 78లక్షల వ్యయంతో 13అంతర్గత సీసీ రోడ్లను ఇరువురు చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకుముందే పలుచోట్ల గ్రామ దేవతలకు, పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గడిచిన ఆరు సంవత్సరాల కాలంలో 20వేల కోట్ల రూపాయల వ్యయంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ప్రజల అవసరాలను గుర్తించి, నంబర్ 1 పార్లమెంట్‌గా అభివృద్ధిలో తీర్చిదిద్దానని, మరిన్ని నిధులు అభివృద్ధి పనులకు తీసుకువస్తానని బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేసారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధికి అగ్రగామిగా తీర్చిదిద్దడమే పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులకు రాజకీయాలు, పార్టీలు పక్కనపెట్టి ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం కలిసికట్టుగా అందరితో కలిసి పనిచేస్తున్నానని మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ ఉపాధి పథకం కింద ఈ నిధులను తీసుకువచ్చినట్లు మంత్రి విలేకరులకు తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్తల కృషి ఫలితమే సమరభేరి విజయం

### ప్రమాదంలో పార్టీ కార్యకర్త మృతి బాధాకరం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** సామాజిక న్యాయ సమరభేరి అద్భుతంగా విజయవంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడి కృషి ఫలితమని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు కార్యకర్త నుంచి రాష్ట్ర నాయకుల వరకు అందరూ అహర్నిశలు కృషి చేశారని ఆయన గుర్తు చేసుకొన్నారు. రాష్ట్రంలో ప్రతి మారుమూల నుంచి నాయకులు సభలో పాల్గొన్నారని పేర్కొన్నారు. సభకు పిలవగానే రాష్ట్ర రాజధానికి వచ్చి రెండు రోజులపాటు ఇక్కడే ఉండి పిసిసి, పిఎసి సమావేశాలలో కార్యవర్గ సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ కేడర్‌కు ఎంతో స్ఫూర్తినిచ్చారని అన్నారు.

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు అందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సమరభేరి సభకు హాజరై తిరుగప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ కార్యకర్త శ్రీను మృతి చెం దడం బాధాకరమని పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ, మహేష్‌కుమార్‌గౌడ్ సంతా పం తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం చెన్నైపాలెం గ్రామానికి చెందిన శ్రీను శుక్రవారం సభకు వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం అత్యంత బాధా కరమని పేర్కొన్నారు. పార్టీ కోసం గ్రామ స్థాయిలో విశేషంగా కృషి చేసిన నేతగా ఆయన పాత్రను పిసిసి చీఫ్ కొనియాడారు. శ్రీను కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుంటుబాన్ని కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

# 'ఎన్‌సి 24-ది ఎక్స్‌కవేషన్ బిగిన్స్' సెకండ్ సింగిల్

యువసామ్రాట్ నాగ చైతన్య తండేల్ సంచలన విజయం తర్వాత విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్‌ని చేస్తున్నారు. విది24 ఈ జానర్‌ని రీడిఫైన్ చేసే సినిమాటిక్ వండర్. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి (ఎస్‌విసిసి), సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు. టీం ఇటీవల మొదటి షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసింది. రషెస్‌తో థ్రిల్‌గా ఉంది. ఇప్పుడు, మరింత ఉత్సాహంతో హైదరాబాద్‌లో నెల రోజుల పాటు జరిగే కీలకమైన రెండవ షెడ్యూల్‌ను ప్రారంభించారు. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ షెడ్యూల్‌లో నాగ చైతన్య, ఇతర పరిశ్రమల నుండి ప్రముఖ నటులు కూడా పాల్గొంటున్నారు. ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లోని మూడు ప్రధాన ప్రదేశాలలో జరుగుతుంది. నాగ చైతన్య ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో జూట్ రోప్ పట్టుకుని కనిపిస్తున్న న్యూ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'వన్ స్టెప్ డీపర్, వన్ స్వింగ్ క్లోజర్" అనే లైన్ ఇంట్రస్టింగ్‌గా వుంది. నాగ చైతన్య కెరీర్‌లో హయ్యెస్ట్ బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రమిది. ఇందులో ఆయన ట్రాన్స్ ఫర్మేషన్ బిగ్గెస్ట్ హైలెట్‌గా ఉండబోతోంది. ఇది మరింత బజ్‌ను పెంచుతుంది. టైటిల్, ప్రధాన తారాగణాన్ని త్వరలో అనౌన్స్ చేస్తారు. ఇప్పటికే మేకర్స్ 'ఎన్‌సి24 – ది ఎక్స్‌కవేషన్ బిగిన్స్' అనే గ్రిప్పింగ్ కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం వర్క్ చేస్తున్నారు. అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందించగా, రఘుల్ ధరుమాన్ సినిమాటోగ్రఫర్. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

తారాగణం: నాగ చైతన్య
దర్శకత్వం: కార్తీక్ దండు.



# 'వార్ 2' కోసం యష్‌రాజ్ ఫిల్మ్స్‌తో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ జోడీ

వరుస విజయాలతో దూసుకుపోతూ వైవిధ్యమైన సినిమాలను రూపొందిస్తూ, అందరి దృష్టిని ఆకర్షిస్తోన్న ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ సంస్థ డిస్ట్రిబ్యూషన్ కూడా నిర్వహిస్తోంది. హ్యాట్రిక్ విజయాల కోసం ఎన్టీఆర్ నటించిన అరవింద సమేత, దేవర వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ వార్ 2 కోసం కలిసి పని చేస్తోంది. విఆర్‌ఎఫ్ బ్లాక్ బస్టర్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ వార్ 2 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



ఆగస్ట్ 14న వరల్డ్ వైడ్‌గా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేయటానికి సిద్ధమైంది. వార్ 2 తెలుగు థియేట్రికల్ హక్కులను సితార ఫ్యాన్సీ రేటుకి కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని సితార ఎంటర్‌టైన్ మెంట్స్ అధికారికంగా తెలియజేస్తూ ట్వీట్ చేసింది. "హ్యాట్రిక్ హిట్ కోసం సరికొత్త ఎనర్జీ, ప్యాషన్‌తో ..మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, గ్రీక్ గాడ్ హృతిక్, పవర్ హౌస్ యష్ రాజ్ ఫిల్మ్స్ కాంబోలో రానున్న వార్2తో ఓ ఎక్స్‌ప్లోజివ్ రైడ్‌ను ప్రారంభిస్తున్నాం. వార్ 2ను తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయటం ఎంతో ఆనందంగా ఉంది. ఆగస్ట్ 14న థియేటర్స్‌లో ఈ ఉత్సవం మొదలు కానుంది. భారీ యాక్షన్ థ్రిల్లర్ వార్2 యష్ రాజ్ ఫిల్మ్స్ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీ స్పై యూనివర్స్‌లో భాగంగా, మరో అధ్యాయంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. పఠాన్, టైగర్ 3, వార్ వంటి గ్లోబల్ హిట్ మూవీస్ తర్వాత వస్తోన్న వార్ 2పై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్ లెవల్లో లీజ్ చేస్తుండటం ప్రేక్షకులకు పండగే. వార్ 2 మూవీలో ఇండియన్ సినీ హిస్టరీలో ఇద్దరు బిగ్ స్టార్స్ అయిన హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మధ్య ఉండే పోటీ ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. బ్రహ్మాస్త్ర, యేహ్ జవానీ హై దీవానీ వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యష్ రాజ్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఐఎంఎఎక్స్ ఫార్మాట్‌లో కూడా విడుదల కానుంది.

# ఆగస్టు 1న 'ఓం శాంతి శాంతి శాంతిః'

ఇప్పటికే పలు సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్న తరుణ్ భాస్కర్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లో లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఈషా రెబ్బా కథానాయికగా నటిస్తోంది. రూరల్ ఎంటర్ టైనర్‌గా రాబోతునన్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు ఎ ఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తున్నారు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మిస్తున్నారు. కిషోర్ జలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇది ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ జాయింట్ ప్రొడక్షన్. షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. 2దీ యానిమేషన్ స్టయిల్‌లో ప్రజెంట్ చేసిన కాన్సెప్ట్ వీడియోతో పాటు ఆకట్టుకునే టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేయడంతో మేకర్స్ ప్రమోషన్‌లను ప్రారంభించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ పోస్టర్ గొడవ పడుతున్న జంట చేతులను చూపించడం ఆసక్తికరంగా వుంది. ఓం శాంతి శాంతి శాంతిః అనే టైటిల్ విజువల్స్‌లో చూపించిన గొడవకు ఫన్ యాడ్ చేసింది. కాన్సెప్ట్ వీడియోలో ఈషాను కొండవీటి ప్రశాంతి అనే పల్లెటూరి అమ్మాయిగా, తరుణ్‌ను వ్యాన్ యజమాని అంబటి ఓంకార్ నాయుడుగా పరిచయం చేశారు. వారి పెళ్లి తర్వాత కథమలుపు తిరుగుతుంది. ఇద్దరిమధ్య వాగ్వాదాలు, గొడవలు పందెంకోళ్ల తలపించేట్టుగా చూపించారు. జై క్రిష్ మ్యూజిక్ రూరల్ చార్మ్‌ని మరింతగా ఎలివేట్ చేసింది. దీపక్ యెరగర సినిమా టోగ్రఫర్. ఈ చిత్రం హ్యూమర్, కల్చర్, రిలేషన్షిప్ డ్రామాతో అందరినీ అలరించబోతోంది. ఈ చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



పూజిత పొన్నాడ
నయా లుక్



# 11న 'మై బేబి' తెలుగులో విడుదల

ఇటీవల విడుదలై తమిళంలో సూపర్ హిట్ అయిన డి ఎన్ ఏ సినిమాను ఎస్. కె. పిక్చర్స్ ద్వారా సురేష్ కొండేటి తెలుగు ప్రేక్షకులకు అందించనున్నారు. ఈ సినిమా తెలుగులో మై బేబి పేరుతో జూలై 11న విడుదల కానుంది. గతంలో ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్ మాల్, పిజ్జా వంటి విజయవంతమైన 15 చిత్రాలను నిర్మాతగా విడుదల చేసిన సురేష్ కొండేటి గతంలో డిస్ట్రిబ్యూటర్ గా 85 పైగా చిత్రాలను విడుదల చేశారు. ఇప్పుడు నిర్మాతగా 16వ చిత్రంగా ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. మై బేబి ప్రొడ్యూసర్‌గా తనకు తెలుగులో 16వ చిత్రమని, ఇది కూడా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తమిళంలో ఇటీవలే విడుదలై, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. మామూలుగా మనం హాస్పిటల్స్‌లో పిల్లల్ని మాయం చెయ్యడం వారిని వేరే చోట అమ్మేయడం వంటి వార్తలని వింటున్నాం ఇలాంటి వార్తలు ఇప్పుడు కాదు కొన్ని సంవత్సరాలుగా వింటూనే ఉంటున్నాం. ఈ సినిమా మరొక్క సారిగా మనం సొసైటీలో ఎంత జగ్రత్తగా ఉండాలో తెలియచేసింది. అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగ డ్రామాతో కూడిన గ్రిప్పింగ్ కథాంశంతో ఆకట్టుకుంది.



2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ఈ కథ సాగుతుంది.

# 'విటి 15' ఫారిన్ షెడ్యూల్ షూటింగ్

వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఇండోకొరియన్ హారర్‌కామెడీ విటి15 తో సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీగా నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు. హైదరాబాద్, అనంతపురం షెడ్యూల్స్ తర్వాత విటి15 షూటింగ్ ఇప్పుడు ఫారిన్ షెడ్యూల్ శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్, ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో మోస్ట్ ఎంటర్టైనింగ్ అండ్ హై ఎనర్జీ సీక్వెన్స్‌లని చిత్రీకరిస్తున్నారు. ఈ ఫారిన్ షెడ్యూల్‌లో టీం వైబ్రెంట్ హంటింగ్‌లో డ్రాప్స్‌లో స్టన్నింగ్ విజువల్స్‌ని షూట్ చేస్తోంది. ఇది ప్రాజెక్ట్‌కు ఇంటర్నేషన్ టచ్‌ని యాడ్ చేస్తోంది. ఈ షెడ్యూల్‌తో 80 షూటింగ్ పూర్తవుతుంది. విటి15 దర్శకుడు మేర్లపాక గాంధీ, యువి క్రియేషన్స్‌తో కలిసి వరుణ్ తేజ్ చేస్తున్న మొదటి సినిమా, కంచె తర్వాత ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్‌మెంట్‌తో వరుణ్ తేజ్ మరోసారి కలిసి పనిచేస్తున్నారు. టైటిల్, గ్లింప్స్‌తో సహా మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే తెలియజేస్తారు మేకర్స్. విటి15 మునుపెన్నడూ లేని విధంగా బిగ్ స్క్రీన్‌పై హాంట్ చేసే హిలేరియస్ రైడ్‌ని అందించబోతోంది.

తారాగణం: వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య

రచన, దర్శకత్వం: మేర్లపాక గాంధీ, నిర్మాతలు: యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్

సంగీతం: ఎస్ థమన్, పీఆర్వో: వంశీ శేఖర్

మార్కెటింగ్: హాష్టాగ్ మీడియా.




# 'ఓ భామ అయ్యో రామ' ట్రైలర్

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఓ భామఅయ్యో రామ. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రిలక్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే.. ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్, హీరో, హీరోయిన్స్ ఎనర్జీ, ఇలా ఈతరం ప్రేక్షకులతో పాటు అన్ని వర్గాల వారిని అలరించే ఫుల్ ప్యాకేజీగా ఈ చిత్రాన్ని రూపొందించారని అర్థమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, ట్రైలర్ విడుదలైన కొద్ది సమయంలోనే మంచి స్పందన వస్తోంది. ట్రైలర్ చూసిన వారు ఈచిత్రం షూర్ షాట్ విజయం అంటుంటే ఆనందంగా ఉంది. క్యూట్ రొమాంటిక్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రత సన్నివేశం ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తుంది. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా ఈ చిత్రం అందరికి కొత్త అనుభూతినిస్తుంది. జూలై11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబో తున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. తప్పకుండా నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉందిఅన్నారు. దర్శకుడు మాట్లాడుతూ, ఇటీవల విడుదలైన ప్రతి ప్రమోషన్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఓ క్వాలిటీ సినిమాను ప్రేక్షకులకు ఇవ్వడానికి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాత హరీష్ ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడ కుండా సినిమాను నిర్మించాడు. ప్రొడక్ట్ క్వాలిటీగా రావడానికి ఆయనే కారణం. మణికందన్ ఫోటోగ్రఫీతో ఈ సినిమాను చాలా కలర్‌ఫుల్‌గా మలిచాడు. రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచిసంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరుపాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గా ఉంటాయి అన్నారు.



# 'కొత్తపల్లిలో ఒకప్పుడు' విలేజ్ ప్లే ఫుల్‌రైడ్ టీజర్

రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, మీనింగ్ ఫుల్ ఎంటర్‌టైనింగ్ సినిమాలకి సపోర్ట్‌ని కంటిన్యూ చేస్తోంది. ఈసారి కొత్తపల్లిలో ఒకప్పుడు రూరల్ కామెడీ ఎంటర్టైనర్ ని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తోంది. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రం పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా చూపించబోతోంది. గాసిప్‌తో సందడి చేసే పల్లెటూరి నేపథ్యంలో సాగే కొత్తపల్లిలో ఒకప్పుడు టీజర్ కలలు, విలేజ్ డ్రామా ఒకదానితో ఒకటి కలిసి పోయే వరల్డ్ పరిచయం చేస్తుంది. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. అతను డ్యాన్స్ పార్ట్నర్ కోసం వెదుకుతున్నప్పుడు ఊహించని సమస్యలలో చిక్కుకుంటాడు. కొత్తపల్లిలో ఒకప్పుడు రిఫ్రెష్‌గా ఉండే రస్టిక్ టోన్‌లో ఆకట్టుకుంది. సినిమాటోగ్రాఫర్ పెట్రోస్ ఆంటోనియాడిస్, గ్రామీణ జీవితాన్ని అద్భుతంగా చూపించాడు. మణిశర్మ సంగీతం సమకూర్చగా, వరుణ్ ఉన్ని అందించిన నేపథ్య సంగీతం టీజర్ ఫన్‌ని ఎలివేట్ చేసింది. ఈ చిత్రంలో మోనికా టి, ఉషా బోనెల కూడా ప్రముఖ పాత్రల్లో నటించారు. టీజర్‌లో పెర్ఫార్మెన్స్‌లో చాలా నేచురల్‌గా ఆకట్టుకున్నాయి. గురుకిరణ్ బత్తుల కథ, సంభాషణలను అందించారు. డైరెక్టర్ ప్రవీణ పరుచూరి నెరేటివ్‌కి చక్కని సున్నితత్వాన్ని తీసుకువచ్చారు. టీజర్ అందరినీ ఆకట్టుకుంది. సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రం జూలై 18న థియేటర్లలో విడుదల కానుంది.



తారాగణం: మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల, రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేంసాగర్, సాంకేతిక సిబ్బంది: సమర్పణ: రానా దగ్గుబాటి దర్శకత్వం: ప్రవీణ పరుచూరి పాటలు: మణిశర్మ బ్యాక్ గ్రౌండ్ స్కోర్: వరుణ్ ఉన్ని, నిర్మాణ సంస్థ: పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్, నిర్మాతలు: గోపాలకృష్ణ పరుచూరి ప్రవీణ పరుచూరి.

# 'జూనియర్' నుంచి సాంగ్ లాంచ్

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి, తన డెబ్యు మూవీ జూనియర్ హైలీ ఎంటర్టైనింగ్ టీజర్‌లో తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. రాధా కృష్ణ దర్శకత్వంలో వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ జూలై 18న విడుదలకానుంది. మేకర్స్ ప్రమోషన్లలో డోస్ పెంచారు.ఒక పాట బిగ్ హిట్ అయి సోషల్ మీడియాలో సంచలనం సృష్టించినప్పుడు, అది వైరల్ పాట అనే లేబుల్‌ను సంపాదిస్తుంది. కానీ జూనియర్ విషయంలో మాత్రం... ఇక్కడ వైరల్ అవుతోందది పాట మాత్రమే కాదు హీరోయిన్ శ్రీలీ. సెకండ్ సాంగ్ వైరల్ వయ్యారికి కొత్త ఇమేజ్ ఇచ్చింది శ్రీలీల. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ మాస్ ఎనర్జీతో నిండిన కంపోజిషన్ ఇచ్చారు. సాంగ్ అదిరిపోయింది. డిఎస్‌పి, హరిప్రియ ఇద్దరూ పాడిన స్టైల్ సాంగ్‌ని ఇంకో లెవల్‌కి తీసుకెళ్లింది. లిరిక్ రైటర్ కళ్యాణ్ చక్రవర్తి కూడా సూపర్ మోడర్న్ టచ్ ఇచ్చారు. యూత్‌తో కనెక్ట్ అయ్యేలా సోషల్ మీడియా లాంగ్వేజ్, ట్రెండీ ఫ్రేసెస్ తో హైలైట్ అయింది. కిరీటి రెడ్డి, శ్రీలీల కలిసి డాన్స్ అదరగొట్టారు. కిరీటి స్టెప్పుల్లో గ్రేస్ చూపిస్తే, శ్రీలీల తన అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్స్, ఎలిగెన్స్‌తో ఆకట్టుకుంది. అందమైన సెట్స్‌లో షూట్ చేసిన వైరల్ వయ్యారి పాట క్యాచి మ్యూజిక్, ట్రెండీ లిరిక్స్, కలర్ ఫుల్ విజువల్స్‌తో ఈ సాంగ్ ఈ ఏడాది వైరల్ చార్ట్‌బస్టర్ హిట్ కానుంది. ఈ సినిమాకి కె.కె. సెంథిల్ కుమార్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రవీందర్ ప్రొడక్షన్ డిజైనర్, పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటర్. కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని డైలాగ్ అందిస్తున్నారు.

తారాగణం: కిరీటి, శ్రీలీల, జెనీలియా, డాక్టర్ రవిచంద్ర వి

సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: రాధా కృష్ణ, నిర్మాత: రజనీ కొర్రపాటి, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, డీవోపీ: కెకె సెంథిల్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్, స్టంట్ డైరెక్టర్: పీటర్ హెయిన్ డైలాగ్స్: కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని.



# తొలి మహిళ పైలట్ పూనియాకు 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారం



భారత నావికాదళంలోనికి మొట్టమొదటి సారిగా ఫైటర్ బృందంలోనికి శిక్షణ పొందిన సబ్ లెఫ్టినెంట్ ఆస్తా పూనియా నియ మితులయ్యారు. భారత యుద్ధనౌకల ఏవియేషన్ విభాగంలోనికి మొట్టమొదటి మహిళా పైలట్‌గా ఆమె.

పూనియాతో పాటే లెఫ్టినెట్ అతుల్‌కుమార్‌దుల్ ప్రతిష్ఠాత్మకమైన వింగ్స్ ఆఫ్ గోల్డ్ ధృవపత్రాన్ని అందుకున్నారు. నావికాదళ సిబ్బంది అసిస్టెంట్ చీఫ్‌నుంచి ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఆస్తాపూనియా నియామకంతో భారత నౌకాదళం యుద్ధనౌకలపైకి కూడా మహిళా పైలట్లు తొలిసారిగా నియమితులయినట్లు అసిస్టెంట్ చీఫ్ జనక్ బేవ్లీ తెలిపారు. పూనియా ఇటీవలే సెకండ్ బేసిక్ హాక్‌కన్వర్షన్ కోర్సును విశాఖపట్టణంలోని ఐఎన్ఎస్ డేగాలో పూర్తిచేసారు. ఇప్పటికే మహిళలు నావికాదళం ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లలోను, ఎంఆర్ ఎయిర్‌క్రాఫ్టులు, హెలికాప్టర్లు వంటివాటిలో మహిళలను నియమించారు. ఆస్తాపూనియా ఫైటర్ పైలట్ బృందంలోకి రావడంతో నావికాదళ ఏవియేషన్ విభాగంలో నారిశక్తిని ప్రతిబింబిస్తోంది. అంతేకాకుండా ఎలాంటి వివక్ష లేకుండా సమానత్వం, సంస్కృతి సాంప్రదాయాలు, మహిళలకు లభించే అవకాశాలను ప్రోత్స హిస్తున్నట్లు భారత నౌకాదళం ఒక ప్రకటన విడుదలచేసింది. 2016లోనే భారతీయ వైమానికశాఖ ముగ్గురు మహిళా అధికారులను నియమించింది. అవని చతుర్వేది, భావనా కాంత్, మోహనాసింగ్‌లు యుద్ధవిమానాల పైలట్లుగా నియమించింది. ఆ తర్వాత ఇపుడు నౌకాదళం ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లలో కూడా నియమించిన తర్వాత యుద్ధనౌకల్లోకి ఫైటర్ పైలట్లుగా మహిళలు రావడం ఇదే తొలిసారి అని నౌకాదళ విభాగం ప్రకటించింది. □

# తొలి పండుగ ఏకాదశికి స్వాగతం



**శ్రియః పతి శ్రీపతి శాశితుం జగత్ జనన్నివాసో**
**వసుదేవ సద్మనీ !**
**వసన్ దదర్శాత్ అవతరంతమంబరాత్ హిరణ్యగర్భాంగ**
**భువం మునిం హరిమ్ !!**

శ్రీలక్ష్మీదేవికి భర్తగా, సంపదకు యజమానిగా జగత్తును శాసించే ప్రభువుగా మహావిష్ణువు తేజస్సుతో వెలుగొందుతున్నాడు. అట్టి శ్రీమహావిష్ణువును ప్రణమిల్లుతున్నాను. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజునుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు శ్రీమహావిష్ణువు శయనించే కాలము. అంటే ఆయన యోగనిద్రలో ఉంటాడని భావన. ఆషాడ శుద్ధ ఏకాదశిని ప్రథమ ఏకాదశి, శయన ఏకాదశి అని వ్యవహరిస్తుంటారు. దక్షిణాయనంలో రావలసిన శయన ఏకాదశి ఈ సంవత్సరము ఉత్తరాయణంలో రావటం జరిగింది. గత సంవత్సరం అధికమాసం కారణంగా ఈ విధంగా వచ్చింది. సాధారణంగా ఉత్తరాయణంలో ముక్కోటి ఏకాదశి, దక్షిణాయనంలో శయన ఏకాదశి జరుపుకుంటూంటారు. అందువలననే సంవత్సరంలోని రెండు ఆలయనాలలో మొదటి ఏకాదశిని విశేషంగా ఆరాధన చేస్తారు. శయన ఏకాదశి రోజు మొదలు కార్తీక శుద్ధ ఏకాదశి వరకు గల నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస వ్రతము అంటారు. మఠాధిపతులు, సిద్ధులు, సన్యాసాశ్రమం తీసుకున్నవారు ప్రత్యేక వ్రత దీక్షను చేపడతారు. ఈ విశేషాలను పద్మపురాణములో విపులంగా వివరించారు.



ఈ కాలంలో వారు ప్రత్యేకంగా యోగ సమాధిలో గడుపుతూ జ్ఞాన సముపార్జన చేస్తారు. వారు నిత్యము ఉభయ సంధ్యలలో మంత్రానుష్టానము, హోమ, జప, తపాదులు మొదలైనవి విడువకుండా చేయాలి. శిష్యులకు జ్ఞానబోధ చేస్తూ, నియమిత ఆహారాన్ని స్వీకరిస్తూ గడపాలి. అన్ని జన్మలలోకి మానవ జన్మ ఉత్తమమైనది. దీనిని సార్ధకం చేసుకుని ఉత్తమ గతులను పొందాలంటే మాయాధీశ్వుడైన శ్రీమన్నారాయణుని స్మరణ ఒక్కటే మార్గము. అందుకు అనువైన కాలము చాతుర్మాస్య కాలము. తొలి ఏకాదశి పర్వదినాన్ని రైతులు కూడా అత్యంత భక్తితో ఆచరిస్తారు. తమ పంటలకు తెగుళ్ళు, చీడలు వంటివి సోకకుండా మంచి దిగుబడి రావాలని మొక్కజొన్న పేలాలను పిండిగా చేసి అందులో బెల్లం కలిపి శ్రీమహావిష్ణువుకు నైవేద్యంగా సమర్పిస్తారు. తరువాత ఆ ప్రసాదాన్ని అందరు కలసి స్వీకరిస్తారు. వాతావరణంలో కలిగే మార్పులకు తొలి ఏకాదశి శ్రీకారం చుడుతుంది. జడత్వం పెరుగుతుంది. రాత్రి కాలం అధికమై నిద్రాసమయము పెరుగుతుంది. ఇది అనేక అనారోగ్య సమస్యలకు కారణమౌతుంది. ఇటువంటి రోగాలను నివారించుటకు మన పెద్దలు ఉపవాస దీక్షలను మనకు పరిచయం చేసారు. గ్రీష్మ ఋతువు పూర్తి అయి వర్ష ఋతువు ప్రారంభమవుతుంది. ఏకాదశి వ్రతాన్ని ఆచరించేవారు, ప్రతీనెలలోను వచ్చే ఏకాదశి భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. ముఖ్యంగా ప్రధాన ఏకాదశులైన, ముక్కోటి ఏకాదశి, శయన ఏకాదశి మరింత భక్తితో ఆచరిస్తారు. ముందురోజుగల దశమి తిథి ఆఖరు ఘడియలనుంచి నిరాహారంగా ఉంటూ, ఏకాదశి రోజు తెల్లవారు జామునే నిద్ర మేల్కొని, తలస్నానమాచరించి, లక్ష్మీ మ సమేతుడైన శ్రీమన్నారాయణుని పూజిస్తారు. రోజంతా నిరాహారంగా ఉంటూ, భగవన్నామ స్మరణలో గడుపుతారు. రోజంతా శివకేశవుల నామ పారాయణలతో గడపాలి. రాత్రి కాలం జాగరణ చేసి మరుసటి దినమైన ద్వాదశినాడు అతిథులకు భోజనం పెట్టి, తదుపరి భోజనం చేయాలి. ఈ విధంగా చేస్తే శ్రీమన్నారాయణునికి అత్యంత సంతృప్తి కలుగుతుంది. ఈ రోజు పరమేశ్వరుని కూడా అత్యంత భక్తి శ్రద్ధలతో పూజ చేయాలి. శివకేశవుల మధ్య బేధం చూపరాదు. యధాశక్తి దానధర్మాలు చేయాలి. **శివాయ విష్ణురూపాయ శివరూపాయ**
**విష్ణవే, శివస్య హృదయం**
**విష్ణు: ర్విష్ణోశ్చ హృదయగ్ం శివ:!!** దీని అర్థం ఏమనగా శివుని హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు కొలువైవుంటారు. విష్ణువేరీతి శివమయమై యున్నాడో అట్లే శివుడును విష్ణుమయమై వున్నాడు. హైందవ సంప్రదాయము అనేక ఆటుపోటులకు నిలబడి విరాజిల్లుతున్నది. ఎంతో ముక్తిప్రదమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని మనమంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించి, యధాశక్తి దానధర్మాలు చేసి, ఇహపర సుఖాలను పొందుదాం.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# వీటితో కీళ్లనొప్పులు తగ్గుతాయి

**మునగాకు ఔషధం, వంద విధాల మేలు చేస్తుంది- అనేది మనందరికీ తెలిసిన సంగతే. మునగ విత్తనాలతోనూ ఎన్నో ప్రయోజనాలున్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. ఆ లాభాలు ఏంటో, వాటిని ఏ రూపంలో తీసుకోవాలో చూద్దాం.**





♦. మునగ గింజల్లో. ఎ, బి1, ఇ విటమిన్లు, పొటాషియం, భాస్వరం, సోడియం, జింక్, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్ సోడియం, కాపర్, అయొడిన్, మాంగనీస్, పిండిపదార్థాలు అమినో యాసిడ్స్, ప్రొటీన్లు విస్తారం.

♦ రక్తహీనత నుంచి బయట పడొచ్చు.

♦. కీళ్లనొప్పులు తగ్గుతాయి. జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది.

♦ హాయిగా నిద్ర పడుతుంది. ♦. రక్తంలో చక్కెర స్థాయి, కొలెస్ట్రాల్ లెవెల్ క్రమబద్ధంగా ఉంటాయి. మధుమేహం నియంత్రణలో ఉంటుంది.

♦ చర్మానికి కాంతి వస్తుంది. ♦. వీటిని ఉడికించి లేదా వేయించి తినొచ్చు. □

# ఎప్పుడు కావాలన్నా కమ్మని కాఫీ

ముక్కుపుటాలని హాయిగా పలకరించే కాఫీ



పరిమళం ఒక్కసారి అలవాటైందా.. ఇక అంతే! వదల్లేం. మంచి కాఫీ కలపడం ఒక ఆర్ట్ అంటారు. ఆ కెమిస్ట్రీ కుదరడం అందరికీ సాధ్యం కాదు. కానీ ఎక్కడైనా ఏ సమయంలో అయినా ఒకేలా ఉండే కాఫీని అందించాలనుకున్నారు కొమిటీర్ సంస్థను స్థాపించిన మాథ్యూరాబర్ట్స్. ఇందుకోసం తొమ్మిదేళ్లు కష్టపడి ఫ్రీజింగ్ కాఫీని తయారుచేశారు. ఈ కాఫీని కలపడానికి ఎక్కువ సమయం పట్టదు. బరిస్తా కాఫీ రుచిని ఇంట్లోనే పక్కాగా అందించేందుకు ఆధునిక బ్రూయింగ్ టెక్నిక్ నైపుణ్యాలని పాటించి ఈ కాఫీని తయారుచేసింది కొమిటీర్ సంస్థ. ఈ ఆలోచన నచ్చడంతో ఇన్వెస్టర్లు కోట్ల రూపాయలని పెట్టుబడిగా అందించారు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎనిమిది రకాల కాఫీ గింజలతో తయారుచేసిన ఈ ఫ్రిజింగ్ కాఫీ.. మనికి బిళ్లల రూపంలో దొరుకుతుంది. కాఫీ కావాలనుకున్నప్పుడు పాలల్లో కలిపితే సరి. అన్నట్టు ఈ ఏడాది ప్రపంచ ఉత్తమ ఆవిష్కరణల్లో దీన్ని ఒకటిగా టైమ్ పత్రిక పేర్కొంది. □

# ప్రసవానంతరం బరువు తగ్గాలంటే..

**ప్రసవానంతర సమస్యలను దూరం చేయడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.**

న్యాయమం చేస్తూ... క్యాలరీలు తక్కువగా, పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను డైట్‌లో చేర్చుకుంటే ప్రసవనంతరం త్వరగా బరువు తగ్గచ్చుట! ప్రయోజనాలివే:

ప్రసవం తర్వాత శరీర శక్తిని కోల్పోయి పూర్తిగా బలహీనపడుతుంది. అయితే ఈ శక్తిని కూడగట్టుకోవాలంటే వ్యాయామం చక్కటి మార్గం అంటున్నారు నిపుణులు. వ్యాయామం చేసే క్రమంలో ఎండార్ఫిన్లు, డోపమైన్, సెరటోనిన్ వంటి హ్యాపీ హార్మోన్లు శరీరంలో విడుదలవుతాయి. ఇవి శరీరంలో శక్తిని పెంచడంతో పాటు ప్రశాంతతను అందిస్తాయి.

♦ బిడ్డకు జన్మనిచ్చాక నిద్రలేమి, అలసటతో తీవ్రమైన ఒత్తిడి ఎదురవుతుంది. అయితే విభిన్న వ్యాయామాలు, యోగా, ధ్యానం: ఒత్తిడిని తరిమికొట్టి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఇలా ప్రశాంతంగా ఉండటం వల్ల బిడ్డ ఎదుగుదలకు పరోక్షంగా మేలు జరుగుతుంది.

♦ గర్భధారణ సమయంలో దృఢంగా ఉంచడానికి కొన్ని వ్యాయామాలు ఎలా మేలు చేస్తాయో. ప్రసవనంతరం కూడా కొన్ని వర్కవుట్లు తిరిగి పూర్వపు స్థితికి తీసుకొస్తాయి. ముఖ్యంగా డెలివరీ తర్వాత అధిక బరువును తగ్గించుకోవడం, పొట్ట తగ్గించుకోవడంలో ఇవి సహకరిస్తాయంటున్నారు. నిపుణులు

♦ బిడ్డ పుట్టాక కొంతమంది తల్లులు నిద్రలేమి సమస్యను ఎదుర్కొంటారు. ఇలాంటి వాళ్ళు వ్యాయామాలు చేయడం వల్ల సుఖంగా నిద్ర పట్టే అవకాశాలు ఎక్కువంటున్నారు నిపుణులు.

**ఆరు వారాల తర్వాతే..!** సుఖ ప్రసవమైనా, సిజేరియన్ అయినా.. డెలివరీ అయిన ఆరు వారాల తర్వాత వ్యాయామం మొదలు పెట్టమని సలహా ఇస్తుంటారు వైద్యులు, అయినా ఈ ముందు ఓసారి డాక్టర్ వద్ద ఆరోగ్య పరిస్థితిని సమీక్షి ంచుకున్నాకే ఎక్సర్సైజ్ ప్రారంభించడం మంచిది. అలాగే దీన్ని బట్టే మీరు ఎలాంటి వ్యాయామాలు చేయాలో కూడా చెబుతారు. సాధారణంగా బ్రిస్క్ వాకింగ్, ఈత, యోగా, సైక్లింగ్, పిలాటిస్, తక్కువ తీవ్రత ఉండే ఏరోబిక్ వ్యాయామాలు, పరుగు జాగింగ్... స్థానిక ప్రసవనంతర సమస్యల నుంచి త్వరగా కోలుకునేందుకు తోడ్పడతాయంటున్నారు. నిపుణులు. అలాగే ఒకేసారి ఎక్కువ సమయం వ్యాయామాలు చేయకుండా రోజూ క్రమేపీ కొంత సమయాన్ని పెంచుకుంటూ పోవడం మంచిది. □



# మనసు దోచే దోసె

**కరకరలాడే దోశలు ఇష్టపడనివాళ్లుంటారా?! కొంచెం తుంచుకుని.. చట్నీ అద్దుకుని తింటుంటే అసలికేమైనా గుర్తొస్తుందా చెప్పండి! రవ్వ, ఓట్స్ అటుకులు, రాగులు, జొన్నలు దేంతోనైనా దోశలు వేసేయొచ్చు. అంతేనా.. మైసూర్, కాంచీపురం, నీల్‌గిరి అంటూ వందల రకాలున్నాయి.**

## తీపి దోసె



**కావలసినవి :** గోధుమపిండి-కప్పు, యాకుల పొడి-అర చెంచా, నెయ్యి- చెంచా, ఉప్పు-చిటికెడు, బెల్లం-పావు కప్పు, పాలు-అర కప్పు, బేకింగ్ సోడా-పావు చెంచా, కొబ్బరి తురుము-గుప్పెడు, పంచదార పొడి- చెంచా,

**తయారీ:** బెల్లంలో కొన్ని నీళ్లు పోసి మరగించి.. చల్లారాక వడకట్టలి. గోధుమపిండిలో బేకింగ్ సోడా, యాలకుల పొడి, నెయ్యి, బెల్లం నీళ్లు వేసి కలపాలి. ఈ పిండితో దోశలు వేసి.. కొబ్బరి తురుము, పంచదార పొడి చల్లాలి. అంతే తియ్యటి దోశలు తిని ఆనందించటమే తరవాయి.

## కూరగాయలతో...



**కావలసినవి :** కందిపప్పు, ఎర్రకంది పప్పు, శనగ, మినపప్పులు- పావుకప్పు చొప్పున, బియ్యం-కప్పు, ఉప్పు-తగినంత, నూనె- 3 చెంచాలు, ఇంగువ పావు చెంచా, కరివేపాకు-3 రెబ్బలు, ఎండుమిర్చి-2, క్యారెట్, బీన్స్, స్వీట్‌కార్న్, చీజ్ తురుము-3 చెంచాల చొప్పున, కొత్తిమీర తరుగు గుప్పెడు.

**తయారీ :** బియ్యం, పప్పులను కడిగి.. ఉప్పు, ఇంగువ, కరివేపాకు, మిర్చి జతచేసి నానబెట్టాలి. నాలుగు గంటల తర్వాత గ్రైండ్ చేయాలి. పెనం వేడయ్యాక ఈ పిండితో దోశలు వేసి బీన్స్, స్వీట్ కార్న్ , చీజ్ కొత్తిమీర, క్యారెట్ తురుము చల్లి, చుట్టూ కాస్త నూనె వేసి.. మూత పెట్ట చక్కగా కాలిందనుకున్నాక తీసేయాలి.

## మొలకలతో...



**కావలసినవి :** మొలకెత్తిన గింజలు-కప్పు, దోశపిండి-కప్పున్నర, ల్లం-చిన్న ముక్క, పచ్చినమిర్చి-2, జీలకర్ర-చెంచా, ఉప్పు-రుచికి తగినంత, కరివేపాకు-2 రెబ్బలు, నూనె-4 చెంచాలు.

**తయారీ :** మిక్సీ జార్‌లో మొలకెత్తిన గింజలు, కొన్ని నీళ్లు, ఉప్పు, అల్లం ముక్క, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలు వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పిండిలో కలిపి దోశలు వేసుకోవాలి. వీటికి కొబ్బరి పచ్చడి సూపర్ కాంబినేషన్, ఇవి రుచే కాదు బలం కూడా.

## పాలకూరతో ..



**కావలసినవి:** బియ్యం అర కప్పు, ఉల్లి తరుగు- పావు కప్పు, పాలకూర ఒక కట్ట, పెసలు -2 చెంచాల చొప్పున, ఉప్పు రుచికి తగినంత, నెయ్యి - చెంచా

**తయారీ:** పనీర్ ఫిల్లింగ్ కోసం: నూనె -3 టేబుల్ స్పూన్లు, ఎండుమిర్చి- 2, ఆవాలు చెంచా, మినప్పప్పు 2 చెంచాలు, కరివేపాకు ఒక రెబ్బ, ఉల్లి తరుగు పావు కప్పు, పచ్చిమిర్చి 1, అల్లం తరుగు కొద్దిగా పన్నీర్ 200 గ్రాములు, ఉప్పు తగినం తయారీ: కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు.. అవి చిటపటలాడక మినప్పప్పు, ఎండుమిర్చి, కరివేపాకు, ఉల్లి, అల్లం తరుగు, పచ్చిమిర్చి ముక్కలను ఒక్కొక్కటిగా వేయాలి. అవి కాస్త వేగాక. పనీరు చేత్తో మెదిపి జతవేయాలి. సన్న సెగ మీద రెండు నిమిషాలు వేయించి దించాలి. పాలకూరను ఉడికించి చల్లార్చాలి. బియ్యం, పెసరపప్పులను విడివిడిగా నానబెట్టాలి. వీటిలో పాలకూర, కరివేపాకు, జీలకర్ర, మిరియాలు, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లి తరుగు జతచేసి గ్రైండ్ చేయాలి. గరిటెడు పిండితో పల్చగా దోశ వేసి నిమ్మకాయంత పన్నీర్ మిశ్రమాన్ని పరిచినట్లుగా. చల్లాలి. కాలిన దోశను సగానికి మడిచి తీయాలి. తక్కిన పిండితోనూ ఇలాగే చేయాలి. వీటికి చట్నీ అయినా బేషుగ్గా ఉంటుంది.

## చెట్టినాడ్



**కావలసినవి:** బియ్యం 2 కప్పులు, మినప్పప్పు ఒక కప్పు, మెంతులు చెంచా, నూనె 3 చెంచాలు, ఉప్పు: తగినంత మసాలా కోసం బంగాళదుంపలు 3, ఆవాలు, జీలకర్ర టేబుల్స్ పన్ చొప్పున, నూనెన్నర చెంచాలు, ఉల్లి తరుగు అర కప్పు, పసుపు అర చెంచా, వారు ముప్పావుంచా, పచ్చి, 3, పచ్చి, 3, పచ్చి, 3, **తయారీ:** బియ్యం మినప్పప్పులను ముందురోజు రాత్రి నానబెట్టాలి. ఉదయం ఆ నీళ్లు తీపేసి, కాస్త ఉప్పు, తగినన్ని వీళ్లు జతచేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. బంగాళదుంపలను ఉడికించి, పొట్టుతీసి, చిన్న ముక్కలుగా కోయాలి. ఫ్యాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు(అవి చిటపటలాడుతున్నప్పుడు జీలకర్ర. అవి వేగాక కరివేపాకు, ఉల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. ఉల్లి తరుగు లేత గోధుమరంగులోకి మారాక బంగాళదుంప ముక్కలు, కారం, పసుపు, ఉప్పు వేయాలి. పచ్చి వాసన వరకు వేయించాలి. సర్దాలి.. మిగిలిన పిండితోనూ ఇలాగే చేయాలి.

## బీట్ రూట్‌తో..



**కావలసినవి :** దోశపిండి-2 కప్పులు, బీట్‌రూట్ గుజ్జు-అరకప్పు, మెంతిపిండి-చిటికెడు, ఉప్పు-రుచికి తగినంత, నూనె-5 చెంచాలు, కచ్చాపచ్చా దంచిన పచ్చిమర్చి- అరచెంచా.

**తయారీ :** దోశపిండిలో బీట్‌రూట్ గుజ్జు, మెంతిపిండి, ఉప్పు, పచ్చిమిర్చి ముద్ద వేసి కలపాలి. ఈ మిశ్రమంతో పల్చగా దోశలు వేసుకోవలి. వీటికి పల్లీ, టొమాటో, పుదీనా అల్లం.. ఏ పచ్చడైనా బాగుంటుంది. □

# గ్లాస్ రిన్సర్



వంట చేసిన పాత్రలన్నింటినీ సింకులో వేసి, డిష్‌వాషర్‌తో తోమి శుభ్రం చేస్తాం. గ్లాసులు, బాటిళ్ల విషయానికొస్తే వాటిని తోమాల్సిన అవసరం ఉండదు. కేవలం నీళ్లతో శుభ్రం చేస్తే చాలు. అందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన పరికరమే గ్లాస్ రిన్సర్ పరికరం. దీన్ని సింకు పక్కనే అమర్చుకోవచ్చు. గుండ్రంగా, వెడల్పుగా ఉండే ఈ పరికరంపై గ్లాసును ఉంచి ఒత్తితే చాలు. నీళ్ల వేగంగా వచ్చి గ్లాసు లోపలి భాగాల్ని శుభ్రం చేస్తాయి. ఇది కేవలం గ్లాసుల కోసమే కాదు.. బాటిళ్లు, సీసాల మూతలు శుభ్రం చేయడానికీ ఉపయోగపడుతుంది. □

పారా ఆర్చరీ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో

## మహిళల కాంపౌండ్, మిక్స్‌డ్ జట్లకు స్వర్ణాలు

### ఒక్క రోజే భారత్ ఖాతాలో 7 పతకాలు




**న్యూఢిల్లీ:** పారా ఆర్చరీ ఆసియా ఛాంపియన్‌షిప్-2025లో భారత మహిళల కాంపౌండ్, మిక్స్‌డ్ రికర్వ్ జట్లు స్వర్ణం సాధించాయి. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో శీతల్ దేవి, జ్యోతి స్వర్ణం సాధించగా, హార్విందర్ మరియు భావన మిక్స్‌డ్ రికర్వ్ టీమ్ టైటిల్‌ను గెలుచుకున్నారు. శనివారం చైనాలోని బీజింగ్‌లో జరిగిన 2025 పారాఆర్చరీ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత పారాఆర్చర్లు మహిళల కాంపౌండ్ టీమ్ మరియు మిక్స్‌డ్ రికర్వ్ టీమ్ ఈవెంట్‌లలో రెండు బంగారు పతకాలు సహా ఏడు జట్టు పతకాలను గెలుచుకున్నారు. మహిళల టీమ్ కాంపౌండ్‌లో శీతల్ దేవి మరియు జ్యోతి ద్వయం చైనాపై 148-143 తేడాతో విజయం సాధించి స్వర్ణం సాధించగా, హార్విందర్ మరియు భావనలతో కూడిన భారత మిక్స్‌డ్ రికర్వ్ జట్టు షూట్ ఆఫ్‌లో 5-4 తేడాతో చైనాను ఓడించి 0-4 తేడాతో అసాధారణంగా పునరాగమనం చేసింది. మరోవైపు, 3భారతజట్లు పురుషుల రికర్వ్ఓపెన్, పురుషులకాంపౌండ్ ఓపెన్, మిక్స్‌డ్ కాంపౌండ్ ఓపెన్ తమ బంగారు పతక మ్యాచ్‌లను గెలవడంలో విఫలమయ్యాయి, రజత పతకాలతో సరిపెట్టుకున్నాయి. హార్విందర్ మరియు వివేక్ చికారాతో కూడిన పురుషుల రికర్వ్ జట్టు విజయానికి చాలా దగ్గరగా వచ్చింది కానీ చివరికి చైనా చేతిలో (4-5) ఓడిపోయింది, అక్కడ చైనా 18కి బదులుగా వారు 17 మాత్రమే షూట్ చేయగలిగారు. అంతకుముందు, రాకేష్ కుమార్ రెండు రజత పతకాలను గెలుచుకున్నాడు, మొదట శ్యామ్ సుందర్ స్వామితో కలిసి పురుషుల కాంపౌండ్ ఓపెన్ జట్టులో, ఆపై జ్యోతితో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఓపెన్ ఈవెంట్‌లో వాటిని సాధించాడు.

యునైటెడ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో

## గుకేష్ విజయం




**న్యూఢిల్లీ:** క్రొయేషియాలోని జాగ్రెబ్‌లో జరిగిన 2025 సూపర్ యునైటెడ్ ర్యాపిడ్ మరియు బ్లిట్జ్ ఈవెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ దొమ్మరాజు తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు, ర్యాపిడ్ ఈవెంట్ ముగింపులో అతను మూడు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించాడు. ప్రస్తుత క్లాసికల్ ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్‌ను ఈ ఈవెంట్‌కు ముందు మైదానంలో బలహీనమైన ఆటగాళ్లలో ఒకరిగా ప్రపంచ నంబర్ 1 మరియు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన మాగ్నస్ కార్ల్‌సెన్, అభివర్ణించాడు. అయితే, 19 ఏళ్ల గుకేష్ ర్యాపిడ్ ఈవెంట్‌ను 18 పాయింట్లకు 14 పాయింట్లతో ముగించడం ద్వారా తన విమర్శకుల వాదన తప్పని నిరూపించాడు. బ్లిట్జ్ విభాగం ప్రారంభమయ్యే ముందు అతను రెండవ స్థానంలో ఉన్న జాన్ క్రిస్జ్‌టాఫ్ డుడా కంటే మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. అదే సమయంలో భారత ఆటగాడు అంతగా రాణించలేదు, డూడాతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడిపోయాడు కానీ దాన్ని అధిగమించి అద్భుతంగా పుంజుకున్నాడు. ఈ నేథ్యంలో జరిగిన రాపిడ్ గేమ్‌ల చివరి సెట్‌లోకి అడుగుపెట్టే క్రమంలో కార్ల్‌సెన్‌పై గుకేష్ ఘన విజయంతో సహా వరుసగా ఐదు విజయాలు నమోదు చేశాడు.



వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్..

## దూసుకుపోతున్న భాంబ్రీ జోడీ

**న్యూఢిల్లీ:** వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ టోర్నమెంట్‌లో భారత్ డబుల్స్ స్పెష లిస్ట్ యుకీభాంబ్రీ జోడీదూసుకుపోతోంది. అలాగే పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ కూడా పురోగతి సాధించి, భారత ఆశలను సజీవంగా ఉంచాడు. 2025 వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో భారత జోడీ యుకీ భాంబ్రీ మరియు చైనా జోడీ జియాంగ్ జిన్యు రెండో రౌండ్‌కు చేరుకున్నారు. అమెరికా ద్వయం నికోల్ మెలిచార్ మార్టినెజ్ మరియు క్రిస్టి యన్ హారిసన్ ద్వయంపై అధిపత్యం సంపాదించింది. కోర్టు 16లో ఆడుతున్న ఇండోచైనీస్ జంట ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో విజయం సాధించింది. అమెరికా ద్వయంపై 6-3, 1-6 తేడాతో భాంబ్రీ, జియాంగ్ జంట గెలుపొం దింది. ఈ మ్యాచ్ మొదటి సెట్‌లో భాంబ్రీ మరియు జియాంగ్ బలంగా రాణించారు, ప్రారంభంలోనే సర్వ్‌పై ఆధిపత్యం చెలాయించారు. కానీ రెండవ సెట్‌లో అమెరికన్లు తిరిగి దూసుకెళ్లి, 6-1 సెట్‌తో పోటీని సమం చేశారు. పోటీ ఒక్కో సెట్ తో ముగిసినందున, మ్యాచ్ టైబ్రేక్ ఉత్కంఠభరితంగా సాగింది. భాంబ్రీ, జియాంగ్ జోడి తమ స్థానాన్ని మరింత మెరుగ్గా నిలుపు కుని 10-6 తేడాతో విజయాన్ని సాధించి ముందుకు సాగారు. ఈ ఫలితం ఈ సంవత్సరం ఎస్‌డబ్ల్యూ19 లో భాంబ్రీకి మరో సానుకూల అడుగును సూచిస్తుంది. 32 ఏళ్ల అతను తోటి భారతీయుడు రిత్విక్ బొల్లిపల్లితో కలిసి పురుషుల డబుల్స్ ఈవెంట్‌లో రెండవ రౌండ్‌కు చేరుకున్నాడు, రెండు డబుల్స్ డ్రాలపై భారత ఆసక్తిని సజీవంగా ఉంచాడు. అలాగే పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో భాంబ్రి మరియు బొల్లిపల్లితో కలిసి ఎన్ శ్రీరామ్ బాలాజీ ఆడిన ఒక రోజు తర్వాత ఈ విజయం కూడా జరిగింది. మెక్సికోకు చెందిన మిగ్యుల్ రేయెస్‌వారెలాతో కలిసి, బాలాజీ లెర్నర్ టియెన్ మరియు అలెగ్జాండర్ కోవాసెవిచ్‌లతో కూడిన అమెరికన్ జట్టుపై క్లినికల్ ప్రదర్శన ఇచ్చి 6-4, 6-4 తేడాతో విజయం సాధించారు. ఈ జంట మ్యాచ్‌ను ముగించడానికి కేవలం 71 నిమిషాలు మాత్రమే పట్టింది.

మహిళల టి 20 ఉత్కంఠ పోరులో

# భారత్ ఓటమి

### 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ విక్టరీ





**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన మహిళల మూడో టీ20 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా మహిళల జటు నిరాశపరచింది. చివరి వరకూ ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో ఐదు పరుగుల తేడాతా ఓటమిపాలైంది. చివరి బంతికి ఆరు పరుగులు అవసరం కాగా, కెప్టెన్ హర్మన్ ప్రీత్ క్యాచ్ ఔటైంది. దీంతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్, నిర్ణీత 20 ఓవరల్లలో 9 వికెట్లు నష్టపోయి 171 పరుగులు సాధించింది. ఓపెనర్లు సోఫియా డంక్లీ (75: 53 బంతుల్లో 7 ఫోర్లు ఒక సిక్స్), వ్యాట్ హాడ్జ్ (66: 42 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆ తర్వాత మిగతా బ్యాటర్లు కూడా రాణించారు. టీమ్‌ఇండియా బౌలర్లలో అరుంధతీ రెడ్డి 3, దీప్తి శర్మ 3, శ్రీ చరణి 2, రాధా యాదవ్ ఒక వికెట్ తీశారు. ఆ తర్వాత 172 పరుగుల లక్ష్యంగా బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు మాత్రం చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (56: 49 బంతుల్లో 10 ఫోర్లు) అర్ధశతకంతో షఫాలీ వర్మ (47: 25 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ అదరగొట్టారు. జెమిమా రోడ్రిగ్స్ (20), హర్మన్ ప్రీత్ కౌర్ (23) పరుగులు చేశారు. చివరి రెండు ఓవర్లలో భారత విజయానికి 20 పరుగులు అవసరమవ్వగా, 19వ ఓవర్లో 8 పరుగులు సాధించింది. చివరి 12 పరుగులు చేయాల్సి ఉండగా, టీమ్‌ఇండియా విజయం సాధిస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఇంగ్లాండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌లో తొలి ఐదు బంతుల్లో 6 పరుగులే వచ్చాయి. దీంతో చివరి బంతికి ఆరు పరుగులు అవసరమయ్యాయి. కెప్టెన్ హర్మన్ ప్రీత్ తాను కొట్టిన షాట్‌తో పెవిలియన్ చేరింది. దీంతో 5 పరుగుల తేడాతో భారత్ ఓడిపోయింది. కాగా, ఇప్పటికే భారత్ రెండు టీ20ల్లో గెలిచింది. ఈ నెల 9న మాంచెస్టర్ వేదికగా నాలుగో టీ20 జరగనుంది.




## కెనడా ఓపెన్‌లో సెమీస్‌కు శ్రీకాంత్

### శ్రీయాన్షి నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** కెనడా ఓపెన్-2025లో భారత్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ సెమీఫైనల్స్‌కు చేరగా, వాలిషెట్టి శ్రీయాన్షి ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించింది. 2025 కెనడా ఓపెన్ సూపర్ 300లో భారత ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మాజీ ప్రపంచ నంబర్ 1 ఆటగాడు చైనీస్ తైపీకి చెందిన టాప్ సీడ్ చౌ టియెన్ చెన్‌ను 21-18, 21-9 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించిన శ్రీకాంత్ చివరి నాలుగు స్థానాల్లో తన స్థానాన్ని సంపాదించుకున్నాడు. తొలి గేమ్‌లో 11-7 ఆధిక్యాన్ని సాధించిన శ్రీకాంత్ ప్రారంభం నుంచే ఆటపై నియంత్రణ సాధించాడు. చైనీస్ తైపీ షట్లర్ 15-15తో సమం చేయడానికి పోరాడినప్పటికీ, శ్రీకాంత్ తన ధైర్యాన్ని నిలుపుకుని 21-18తో గేమ్‌ను ముగించగలిగాడు. రెండవ గేమ్‌లో శ్రీకాంత్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. చౌ టియెన్ చెన్ అతని స్ట్రోక్‌ప్లేను ఎదుర్కోవడంలో విఫలమయ్యాడు. చివరకు శ్రీకాంత్ 9-21 తేడాతో సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. కాగా మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో డెన్మార్క్‌కు చెందిన అమాలీ షుల్జ్ చేతిలో ఓడిపోయిన తర్వాత శ్రీయాన్షి వాలిషెట్టి పోటీ నుంచి తప్పుకుంది. ప్రపంచ ర్యాంక్‌లో 75వ స్థానంలో ఉన్న 20 ఏళ్ల శ్రీయాన్షి బలమైన పోరాటం చేసినా కానీ చివరికి ప్రపంచ 69వ ర్యాంకర్ షుల్జ్ చేతిలో ఓడిపోయింది. షుల్జ్ 53 నిమిషాల్లో 12-21, 21-19, 21-19 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. తొలి గేమ్‌ను ఆహ్లాదకరంగా తీసుకున్నప్పటికీ, షుల్జ్ రెండు, మూడవ గేమ్‌లలో ఆటుపోట్లను తిప్పికొట్టిన పదునైన నెట్ ప్లే మరియు వ్యూహాత్మక లిఫ్ట్‌లతో తిరిగి పోరాడిన వాలిషెట్టి తన జోరును నిలబెట్టుకోలేకపోయింది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో వాలిశెట్టి 16వ రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ మలేషియాకు చెందిన లెట్షానా కరుపతేవన్‌పై 21-15, 21-14 తేడాతో విజయం సాధించి ఆకట్టుకుంది. ఈ క్వార్టర్ ఫైనల్ ముగింపు సూపర్ 300 ఈవెంట్‌లో వాలిశెట్టి యొక్క ఉత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది.

## రికార్డు స్థాయికి భారత్ ఫారెక్స్ నిల్వలు

**న్యూఢిల్లీ, జులై 5:** జీవితకాల గరిష్ట రికార్డును బద్దలు కొట్టడానికి భారతదేశానికి ఇంకా 2 బిలియన్ డాలర్లు అవసరం. మునుపటి విదేశీ మారక నిల్వలలో 1 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ తగ్గుదల లేకపోతే ఈ అంతరం ఇంకా తక్కువగా ఉండేది. ఈ ఏడాది భారతదేశ విదేశీ మారక నిల్వలు 58.39 బిలియన్ డాలర్లు పెరిగాయి. ప్రత్యేకత ఏమిటంటే ప్రపంచంలోని చాలా దేశాల వద్ద ఇంత మొత్తం విదేశీ మారక నిల్వలు లేవు. ప్రపంచంలో అత్యధిక ఫారెక్స్ నిల్వలు కలిగిన నాల్గవ దేశం భారతదేశం. చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత దేశం కంటే ముందు ఉన్నాయి. దేశ కేంద్ర బ్యాంకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ గణాంకా లను విడుదల చేసింది. ఆర్‌బిఐ డేటా ప్రకారం, దేశ ఫారెక్స్ నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటాయి. జూన్27తో ముగిసిన వారంలో, ఇది 4.84బిలియన్ డాలర్లు పెరిగి 702.78 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అన్నింటి కంటే, అక్టోబర్ 2024లో, భారతదేశ ఫారెక్స్ నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటినట్లు కనిపించింది. అంటే దేశ ఫారెక్స్ నిల్వలు 9 నెలల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అయితే, దేశ ఫారెక్స్ నిల్వల ఆల్‌టైమ్ హై రికార్డును బద్దలు కొట్టడానికి 2 బిలియన్ డాలర్లకు పైగా అవసరం. దీనిని వచ్చే వారం దాటవచ్చు. సెప్టెంబర్ 2024 చివరి నాటికి విదేశీ మారక నిల్వలు ఆల్‌టైమ్‌హై 704.88 బిలియన్లకు చేరుకున్నాయి. మునుపటి వారంలో, విదేశీ మారక నిల్వలు 1.01 బిలియన్ డాలర్లు తగ్గి 697.93 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మరో వైపు, భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులుభారీగా పెరిగాయి. జూన్ 27తో ముగిసిన వారంలో ఈ నిల్వలలో అతిపెద్ద భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 5.75 బిలియన్ డాలర్లు పెరిగి, 594.82 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బిఐ తెలిపింది. డాలర్ పరంగా వ్యక్తీకరించిన విదేశీ కరెన్సీ ఆస్తులలో విదేశీ మారక నిల్వలలో ఉంచిన యూరో, పౌండ్, యెన్ వంటి యుఎస్ కాని యూనిట్ల పెరుగుదల లేదా తరుగుదల ప్రభావం ఉంటుంది.



## ఇండస్ ఇండ్ బ్యాంకుకు ఫలితాల షాక్

**ముంబయి, జూలై 5:** ప్రైవేటురంగంలోని ఇండస్ ఇండ్ బ్యాంకు తొలి త్రైమాసికంలో నికర అడ్వాన్సులు 3శాతంమేర తగ్గాయి. అకౌంటింగ్ మోసాలు వెలుగులోకి రావడంతో బ్యాంకు అడ్వాన్సులు కూడా క్షీణించాయి. బ్యాంకు డిపాజిట్లు కూడా 3.3శాతం మేర క్షీణించి 3.97 లక్షలకోట్లకు తగ్గాయి. నికర అడ్వాన్సులు చూస్తే క్రమానుగతంగా 3.1శాతం క్షీణించి 3.34 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్-జూన్ తొలిత్రైమాసికంలో బ్యాంకు వార్షిక పద్ధతిలో చూస్తే నాలుగు శాతం తగ్గినట్లు ప్రకటించింది. బ్యాంకు పరిధిలో చోటు చేసుకున్న డెరివేటివ్ కుంభకోణం వల్ల ప్రతిష్ట దెబ్బతిని ఇన్వెస్టర్ల నమ్మకం తగ్గింది. మార్కెట్ సెంటిమెంట్ బలహీన పడింది. ఇక కార్పొరేట్ బ్యాంకింగ్ అడ్వాన్సులపరంగా చూస్తే 14.4శాతం క్షీణించాయి. త్రైమాసికం వారీగాచూస్తే 6.2శాతం తగ్గాయి. వినియోగ రంగ బిజినెస్ అడ్వాన్సులు 0.9శాతంగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలో గణిస్తే 4.8శాతం పెరిగినట్లు బ్యాంకు ప్రకటించింది. సంక్షోభంలో ఉన్న బ్యాంకు డిపాజిట్లుకూడా 3.3శాతం క్షీణించాయి. 3.97 లక్షలకు చేరాయి. రిటైల్ డిపాజిట్లపరంగా చూస్తే చిన్న వ్యాపార కస్టమర్లు 1.84 లక్షలకోట్లుగా ఉంటే గత త్రైమాసికం కంటే స్వల్పంగా తగ్గాయి. ప్రస్తుతం కరెంటుఖాతా, సేవింగ్స్ ఖాతాలపరంగా కాసా నిష్పతి కూడా 31.49 శాతం దిగజారింది. 32.81శాతం అంతకుముందున్న త్రైమాసికం కంటే తగ్గినట్లు బ్యాంకు స్టాక్ ఎక్ఛేంజీలకు నివేదిక ఇచ్చింది. రోజువారి సగటు నగదు లభ్యత కవరేజి నిష్పత్తి కూడా 141.27 శాతంగా ఉంది. బ్యాంకు తొలిత్రైమాసికంలో బిజినెస్ ఈ కుంభకోణం వల్లనే దెబ్బతిన్నట్లు తేలింది. కాసా నిష్పత్తికూడా బ్యాంకు పటిష్టతను సవాల్‌చేసేవిధంగా ఉంది. తక్కువ వడ్డీ ఫండింగ్ వనరులు కొంతమేర దెబ్బతిని బ్యాంకు లాభదాయకతను తగ్గించినట్లు నిపుణులు పేర్కొంటు న్నారు.




## కొత్త హంగులతో బజాజ్ ఆటో డోమినార్

**ముంబై, జులై 5:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో, భారతమార్కెట్లో తన పాపులర్ టూరింగ్ బైక్‌లు డోమినార్ 400, డోమినార్ 250 మోడళ్లను సరికొత్త అప్‌డేట్స్‌తో విడుదల చేసింది. కొంతకాలంగా టీజర్లతో ఆసక్తి రేకెత్తించిన ఈ బైకులను, అధునాతన ఫీచర్లు, మెరుగైన రైడింగ్ సౌకర్యాలతో కంపెనీ లాంచ్ చేసింది. ముఖ్యంగా లాంగ్ రైడ్స్ ఇష్టపడే వారి కోసం చేసిన ఈ మార్పులు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ అప్‌డేట్‌లో భాగంగా బజాజ్ రెండు డోమినార్ బైకులలోనూ రైడర్లకు మెరుగైన నియంత్రణ అందించేందుకు నాలుగు రైడింగ్ మోడ్స్‌ను పరిచయం చేసింది. రెయిన్, రోడ్, స్పోర్ట్, ఆఫ్‌రోడ్ అనే ఈ మోడ్స్ ద్వారా రైడర్ తన అవసరానికి, ప్రయాణిస్తున్న రోడ్డుకు అనుగుణంగా థ్రాటిల్ రెస్పాన్స్, ఏబీఎస్ (యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్) పనితీరును మార్చుకోవచ్చు. ఇక డోమినార్ 400 మోడల్‌లో 'రైడ్‌బైవైర్' టెక్నాలజీని కొత్తగా చేర్చారు. దీనివల్ల థ్రాటిల్ మరింత కచ్చితంగా పనిచేస్తుంది. అయితే, డోమినార్ 250లో మెకానికల్ థ్రాటిల్ వ్యవస్థనే కొనసాగించినా, నాలుగు విభిన్న ఏబీఎస్ మోడ్స్‌ను అందించడం గమనార్హం. ఈ మార్పులు భద్రతను, రైడింగ్ అనుభూతిని రెండింటినీ మెరుగుపరుస్తాయి. ఈ రెండు బైక్‌లలోనూ మరో ప్రధానమైన మార్పు డిజిటల్ డిస్‌ప్లే. ఇటీవలే విడుదలైన పల్సర్ ఎన్ఎస్400జెడ్‌లో ఉపయోగించిన కలర్ ఎల్‌సీడీ గ్లాస్ బాండెడ్ స్పీడోమీటర్‌ను ఇప్పుడు డోమినార్ సిరీస్‌లోనూ అమర్చారు. ఈ కొత్త డిస్‌ప్లేకు అనుగుణంగా స్విచ్‌గేర్‌ను కూడా మార్చారు. దీంతో పాటు, సుదూర ప్రయాణాల్లో రైడర్లకు అలసట తగ్గించేందుకు హ్యాండిల్ బార్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దినట్లు బజాజ్ తెలిపింది. అంతే కాకుండా, టూరింగ్ రైడర్ల కోసం ప్రత్యేకంగా జీపీఎస్ పరికరాలు లేదా స్మార్ట్‌ఫోన్‌లను అమర్చుకోవడానికి వీలుగా ఫ్యాక్టరీ ఫిట్టెడ్ జీపీఎస్ మౌంట్‌ను కూడా అందించారు. ఇది టూరింగ్ ప్రియులకు ఎంతగానో ఉపయోగపడే ఫీచర్.



# వాణిజ్యం

## విదేశీ సిమ్‌లు, ఇ-సిమ్‌లు భారత్‌లో విక్రయానికి కసరత్తులు

**న్యూఢిల్లీ, జూలై 5:** విదేశీ టెలికాంసంస్థల సిమ్‌లు, ఈసిమ్‌లు భారత్‌లో విక్రయించడం, వినియోగించడంపై సంబంధిత టెల్కోలనుంచి అభిప్రాయ సేకరణ జరుపుతూ ట్రాయ్ మార్గదర్శకాలు జారీ చేసింది. విదేశీ టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్లు సిమ్‌లు, ఈసిమ్‌లను భారత్‌లో విక్రయించడం, వినియోగించే అంశంపై అభిప్రాయాలు కోరింది. మెషిన్‌టు మెషిన్ విధానంలో సమీకరణంచేసేందుకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కు అవసరమైన పరికరాల ఎగుమతులు వంటివాటిపై అభి ప్రాయాలు కోరింది. ఉండాలన్న దానిపై అభిప్రాయాలు కోరుతోంది. కొందరు భారతీ య ఉత్పత్తి దారులు ఇప్పటికే ఇంటర్నెట్ ఆఫ్‌థింగ్స్, ఎం2ఎం పరికరాలను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులుచేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇదే ఉత్పత్తి దారులు విదేశీ సిమ్‌లు భారత్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతులు కోరుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల విదేశీ నెట్‌వర్క్‌లు తక్షణమే ఆపరేట్ చేయాలన్న అవసరం ఉంటుందని, ఇందుకు సంబంధించి భారతీయ టెల్కోల నుంచి కూడా అభిప్రాయాలను సేకరిస్తోంది. విదేశీ సిమ్‌లు విక్రయించాలంటే భారత టెలికాం నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రాలు అంటే ఎన్వోసీలు పొందాల్సి ఉంటుంది.

ఇందుకోసం డాట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పాలసీని తీసుకురావాల్సిన అవసరం ఉందా అనేదికూడా ఈ అభిప్రాయ సేకరణలో ఒకభాగం. రిజర్వుబ్యాంకు, కస్టమ్స్ ఇతర అధికారుల నుంచి కూడా ఇందుకు సంబం ధించి అభిప్రాయాలుకోరుతున్నట్లు ట్రాయ్ తన సంప్రదింపుల పత్రంలో వెల్లడించింది. అలాగే భారతీయ టెలికాం కంపెనీలు ఎంటిఎం వ్యవస్థలో సిమ్‌లు, ఈసిమ్‌లతోపాటు వాటిని విదేశాల్లో వినియోగం చడంపైనా అభిప్రాయాలు కోరింది. ఇందుకు ఫీజులు, అర్హత, కాలపరిమితి, విదేశీ సిమ్‌లు, ఈసిమ్‌ల వినియోగంపై నిర్దిష్టమైన పరిమితులు ఎలా




## వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ సోదరుడి అరెస్టు

**న్యూఢిల్లీ, జూలై 5:** పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.14 వేల కోట్లకు ముంచేసిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ సోదరుడు నేహాల్ దీపక్‌మోడీని అమెరికాలో అరెస్టు చేసారు. భారత అధికారులు విజ్ఞప్తిమేరకు అరెస్టుచేసి భారత్‌కు అప్పగించనున్నట్లు తేలింది. బెల్జియన్ దేశస్తుడుగా ఉన్న నేహాల్‌మోడీని 4వ తేదీ అమెరికాలోని స్థానిక అధికారులు అరెస్టుచేసారు. ఇంటర్‌పోల్ ఇప్పటికే అతనిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీచేయడంతో అలర్ట్ అయ్యారు. సిబిఐ, ఈడీ విభాగాలు ఇప్పటికే వీరందరిపైనా కేసులునమోదుచేసి దర్యాప్తు వేగంచేసిన క్రమంలో రెడ్‌కార్నర్ నోటీసులు జారీచేసారు. సుదీర్ఘమైన న్యాయపరమై, దౌత్య పరమైన ప్రక్రియ తర్వాత నేహాల్‌మోడీని యుఎస్ పోలీసులు అరెస్టుచేసారు. ఒకదశలో రెడ్‌కార్నర్‌నోటీసులను కూడా వీరు సవాల్‌చేసారు. పీఎన్‌బీ కుంభకోణంలో నేహాల్ మోడీ పాత్రకూడా ఉందని ఇడి, సిబిఐ అధికారులు భావించారు. అతని పెద్దన్న నీరవ్‌మోడీ ఈ కేసులో కీలక నింది తుడు. భారతదర్యాప్తు అధికారుల వివరాల ప్రకారం నేహాల్‌మోడీ నీరవ్‌మోడీకి సహకరించాడని, కీలక సాక్ష్యాలన్నింటినీధ్వంసంచేసి సాక్షులను బెదిరించారని ఆరోపణలున్నాయి. దర్యాప్తునకు భంగం కలిగించేవిధంగా నేహాల్‌మోడీ వ్యవహరించారు. ఈకుంభకోణంలో ఆర్జించిన వేలాదికోట్ల రూపాయలు మనీలాండరింగ్‌ద్వారా దారిమళ్లించారన్న ఆరోపణలున్నాయి. నేహాల్ ఈ సొమ్మును డొల్లకంపెనీల సాయంతో విదేశాల్లో లావాదేవీలు నిర్వహించాడు. ఇక ఈతడిని భారత్‌కు అప్పగించే కేసు విచారణ ఈనెల 17వ తేదీ ఉంది. ఈ సమయంలోనే బెయిల్ దరఖాస్తును కూడా నేహాల్‌మోడీ తరపున దాఖలుచేసే అవకాశం ఉంది. అయితే యుఎస్ ప్రాసిక్యూషన్ ఇప్పటికే తాము బెయిల్‌ను వ్యతిరేకిస్తామని స్పష్టంచేసింది. మొత్తం 14వేల కోట్ల కుంభకోణంలో నీరవ్‌మోడీ ఒక్కడే 6498.20 కోట్లవరకూ కాజేయగా ఆయన మేనమామ మెహుల్‌చోక్సీ 7080.86 కోట్లు దారిమళ్లించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. నీరవ్‌మోడీ, చోక్సీ ఇద్దరూ కూడా 2018 జనవరిలోనే భారత్‌నుంచి పరారయ్యారు. నీరవ్‌మోడీని బ్రిటన్‌లో 2019లో అరెస్టు చేసారు. లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ప్రస్తుతం ఉన్నాడు. మెహుల్‌చోక్సీ ప్రస్తుతం యాంటిగ్వాలో ఉన్నారు.



## ఇండిగో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అమితాబ్ కాంత్

**ముంబై, జూలై 5:** భారత్‌లోని అతిపెద్ద విమాన యానసంస్థ ఇండిగో నీతి ఆయోగ్ మాజీ సీఇఒ అమితాబ్ కాంత్‌ను నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించుకుంది. ఇండిగో మాతృక ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సంస్థ ఈ మేరకు ప్రకటించింది. అయితే అందుకు వాటాదారుల అనుమతులు, చట్టపరమైన క్లియరెన్స్‌లు రావాల్సి ఉంది. జి20 సమావేశాల సందర్భంగా అమితాబ్ కాంత్ భారత్ షెర్పాలా వ్యవహరించిన సంగతి తెలిసిందే. నీతి ఆయోగ్ సిఇఒగా ఆరేళ్లపాటు పని చేసారు. నాలుగుదశాబ్దాల సివిల్ సర్వీసు అనుభవం ఉన్న అధికారి కావడంతో ఇండిగో ఆయన్ను నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించుకునేందుకు ఆసక్తి చూపిం చింది. దేశీయంగా విస్తరించడంతో పాటు అంతర్జాతీయ సర్వీసుల్లోను మరింతగా విస్తరించే లక్ష్యంతో అమితాబ్ కాంత్ సేవలు సంస్థకు ఎంతో ఉపకరిస్తాయని భావిస్తోంది. పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులపరంగా కూడా అమితాబ్‌కాంత్‌కు విశేషానుభవం ఉంది. ఇండిగో బోర్డు ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా మాట్లాడుతూ కాంత్ దశాబ్దాల నాయకత్వ లక్షణాలు తమ సంస్థకు ఎంతో మేలుచేస్తాయని అన్నారు. 2030 నాటికి ఇండిగో గ్లోబల్ ప్లేయర్‌గా మారేందుకు వీలుగా కాంత్‌ప్రణాళికలు వేయగలరన్నారు. గత ఏడాది కెనడా బిలియనీర్ ప్రేమ్ వాట్సా కంపెనీ ఫెయిర్‌ఫాక్స్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ కాంత్‌ను తమకు సీనియర్ సలహాదారునిగా నియమించుకుంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.